


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 234

బుధవారం 15-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆ అమ్మాయి వయొలిన్ సాధన చేస్తుంటే ఇరుగు పొరుగు వారు ఇల్లు ఖాళీ చేయమని గోల చేశారు. కాని ఇప్పుడు మొత్తం కేరళ ఆ అమ్మాయిని చూసి గర్విస్తోంది. 14 ఏళ్ల వయసులో ప్రతిష్ఠాత్మక 'ట్రినిటీ కాలేజ్ లండన్' వారి ఫెలోషిప్కు ఎంపికై రికార్డు సృష్టించింది మార్టినా. ఈ వయసులో ఈ ఫెలోషిప్ సాధించిన వారు దేశంలో లేరు. ఏ వయసు వారైనా కేరళలో లేరు. సంగీతంతో ఆరోహణ దిశలో పయనిస్తోంది మార్టినా.

న్యూస్‌మేకర్

కేరళ నుంచి ట్రినిటీ కాలేజీకి

సుప్రసిద్ధ రచయిత చాగంటి సోమయాజులు రాసిన 'వాయులీనం' కథలో భార్య తీవ్రంగా జబ్బు పడితే ఆమెను కాపాడుకోవడానికి భర్త ఆమె ఎన్నాళ్లుగానో కాపాడుకుంటూ వస్తున్న వయొలిన్ని అమ్మేస్తాడు. ఆమె బతుకుతుంది. అమ్మకానికి వెళ్లిపోయిన వయొలిన్ని తలుచుకుని, మిగిలిన డబ్బుతో భర్త కొన్న చీరను చూస్తూ 'పోనీలేండి జ్ఞాపకంగా పడి ఉంటుంది' అంటుంది వేదనగా. జీవితంలో కళాసాధన, కళాసాధనకు ఎదురు నిలిచే జీవితం గురించి చెప్పిన కథ ఇది.

మార్టినా జీవితంలో తండ్రి కూడా ఇలాంటి త్యాగమే చేశాడు.



తల్లిదండ్రులతో మార్టినా

మొదలైన ప్రయాణం

14 ఏళ్ల మార్టినా ఇప్పుడు వయొలిన్లో గొప్ప పేరు సంపాదించి 'ట్రినిటీ కాలేజ్ లండన్' ఫెలోషిప్ పొందిందిగాని ఇక్కడి వరకూ చేరడానికి ఆమె తండ్రి పడిన కష్టం ఉంది. మార్టినాది కన్నూరు జిల్లాలోని పెరవూర్. తండ్రి చార్లెస్కు బాల్యంలో గొప్ప మ్యూజీషియన్ కావాలని ఉండేది కాని ఇంట్లో పరిస్థితులు బాగాలేక కొద్దోగొప్పో నేర్చుకున్న కీబోర్డుతో చర్చ్లో సంగీతం వాయించేవాడు. ఆ డబ్బు సరిపోక మిగిలిన సమయాల్లో ఆటో నడిపేవాడు. భార్య షైనీ గృహిణిగా ఉన్నంతలో సంసారాన్ని లాక్కువచ్చేది. అయితే ఐదారేళ్ల వయసు నుంచే కూతురు మార్టినా సంగీతంలో విశేష ప్రతిభ చూపడం వారికి ఒకవైపు ఆనందం, మరొక వైపు ఆందోళన కలిగించాయి. ఆనందం కూతురికి సంగీతం వచ్చినందుకు, ఆందోళన అందుకు తగ్గట్టుగా నేర్పేందుకు వనరులు లేనందుకు. ఎనిమిదవ తరగతి వరకూ పెరవూర్లోనే చదువుకున్న మార్టినా అక్కడే ఉన్న 'రాగం స్కూల్ ఆఫ్ మ్యూజిక్'లో వయొలిన్ నేర్చుకుంది. కానీ తర్వాతి స్థాయి వయొలిన్ నేర్చుకోవాలంటే త్రిశూర్లో చేరాలి. అంటే కుటుంబం మొత్తం త్రిశూర్కు మారాలి. అక్కడ మొదలైంది సమస్య.

ఆటో అమ్మేసిన తండ్రి

ఉంటున్న పెరవూర్ నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న త్రిశూర్కు కాపురం మారాలంటే చాలా ఖర్చు. సాధనకు వీలైన ఇల్లు తీసుకోవాలి. ముఖ్యంగా కనీసం లక్ష రూపాయల విలువైన కొత్త వయొలిన్ కొనాలి. ఇవన్నీ ఆలోచించి తండ్రి ఆటో అమ్మేశాడు. అంతేకాదు తమ చిన్నపాటి ఇంటిని కూడా అమ్మేద్దామనుకున్నాడు. కాని బంధువులకు సంగతి తెలిసి వారు తలా ఒక చేయి వేశారు. 2019లో త్రిశూర్కు షిఫ్ట్ అయినప్పటి నుంచి మార్టినా సాధన పెంచింది. ఉదయం ఐదు గంటలకు లేచి స్కూల్ సమయం అయ్యే వరకు సాధన చేసేది. అయితే ఇరుగు పొరుగు వారు ఇల్లు ఖాళీ చేయమని గోల చేశారు. దాంతో మరో ఇంట్లోకి మారాల్సి వచ్చింది. ఏమైనా సరే కూతురిని గొప్ప వయొలినిస్ట్ చేయాలని చార్లెస్ సంకల్పం బూనాడు.

జాతీయ విజేత

త్రిశూర్లో, కొచ్చిలో గొప్ప గొప్ప గురువుల దగ్గర సాధన చేసి వయొలిన్ నేర్చుకుంది మార్టినా. తీగలను మీటి మీటి ఆమె చేతి వేలి కొసలు రక్తాన్ని చిమ్మేవి. మెడ మీద వయొలిన్ ఉంచి ఉంచి కదుములు కట్టేవి. అయినా సరే మార్టినా తన సాధన మానలేదు. ఫలితం? ఆల్ ఇండియా వయొలిన్ కాంటెస్ట్ 2022, 2023... రెండు సంవత్సరాలూ ఆమే విజేతగా నిలిచింది. 100 మంది వయొలినిస్ట్లను ఓడించి మరీ! ఆ తర్వాత 'సౌత్ ఏసియన్ సింఫనీ'లో సభ్యురాలు కాగలిగింది. ఈ సింఫనీ కోసం 11 దేశాల వయొలినిస్ట్లు పోటీ పడుతుంటారు. చివరగా ప్రతిష్ఠాత్మక ట్రినిటీ కాలేజ్ లండన్ ఫెలోషిప్ పొందింది. 14 ఏళ్ల వయసులో ఈ ఫెలోషిప్ను పొందిన వారు లేరు. చార్లెస్, షైనీల ఆనందానికి అవధులు లేవు.

ఈ గొప్ప కళాకారిణి సంగీతానికి కొత్త శోభను తేవాలని కోరుకుందాం.

త్రినేత్రం



శుభా భట్

పచ్చటి ఊరు వదిలి కాంక్రీట్ జంగిల్లోకి అడుగు పెట్టిన శుభా భట్కు బెంగళూరులోని 'ఐఐఎస్సీ' క్యాంపస్ రూపంలో ప్రకృతి ప్రపంచం దగ్గరైంది. ఎన్నో పక్షులు నేస్తాలు అయ్యాయి. 'పక్షులను ప్రేమించడానికి వాటి శాస్త్రీయ నామాలతో పనిలేదు' అని హాస్యానికి అన్నా శుభాభట్ విషయంలో అది నిజం. ఎన్నో పక్షులకు సంబంధించి శాస్త్రీయ నామాలు, పుట్టు పూర్వోత్తరాలు తెలియకపోయినా వాటిని ప్రేమించింది. పక్షులను చూస్తున్నంతసేపూ తనకు శుభ సమయమే. శాస్త్రీయ కోణం కంటే అనుభూతులు, భావోద్వేగాల కోణంలో రెండు వందల జాతుల పక్షులకు సంబంధించి తన పరిశీలనలను 'పక్షి జల' పేరుతో ఫొటో డాక్యుమెంటేషన్ చేసింది శుభా భట్...

పక్షులకు శుభ సమయం









పెళ్లయిన తరువాత బెంగళూరు మహానగరంలోకి అడుగు పెట్టింది శుభా భట్. పచ్చని పల్లెటూరి నుంచి వచ్చిన తనకు వాహనాల రణగొణధ్వనులు తప్ప పక్షుల కిలకిలారావాలేవీ వినిపించేవి కాదు. దీంతో ఇంటి నాలుగు గోడల మధ్య నేషనల్ జాగ్రఫీ చానల్ చూడడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

అలాంటి పరిస్థితుల్లో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) క్యాంపస్లోకి అడుగు పెట్టడం మళ్లీ పుట్టింటికి వచ్చినట్లుగా అనిపించింది శుభా భట్కు. ఆమె భర్త నవకాంత్ భట్ పరిశోధకుడు.

ఐఐఎస్సీ క్యాంపస్లోకి ఎన్నో పక్షులు వచ్చిపోతుంటాయి. వాటిలో ఎప్పుడూ వచ్చే పక్షులతో పాటు అరుదైన అతిథుల్లాంటి పక్షులు కూడా ఉంటాయి. దాహార్తితో ఉన్న పక్షుల కోసం తన ఇంటిముందు మట్టిపాత్రలో నీళ్లు పెట్టి దూరంగా కూర్చునేది. దురదృష్టవశాత్తు ఒక్క పక్షి కూడా వచ్చేది కాదు. క్యాంపస్లోనే మరో చోటికి మకాం మార్చినప్పుడు కూడా ఇంటిముందు మట్టి పాత్రలలో నీళ్లు పెట్టి కూర్చొనేది.

ఈసారి మాత్రం అదృష్టం తలుపు తట్టింది. కాకులు, పిచ్చుకలు... రకరకాల పక్షులు వచ్చి నీళ్లు తాగి వెళ్లేవి. ఈ ఉత్సాహంతో మరిన్ని మట్టిపాత్రలు ఇంటి చుట్టూ పెట్టేది. పేరు తెలిసిన పక్షులతో పాటు బొత్తిగా అపరిచితమైన పక్షులూ వచ్చి నీళ్లు తాగి వెళ్లేవి. అవి నీళ్లు తాగే దృశ్యం శుభకు అపురూపంగా అనిపించేది. నీటికి, పక్షులకు మధ్య ఉండే సంబంధాన్ని గురించి లోతుగా ఆలోచించేలా చేసేది. ఒకరోజు ఒక పక్షి చెట్టు కొమ్మల్లో నుంచి రాలిపడుతున్న నీటిబిందువులలో ఆనందంగా జలకాలాడుతున్న దృశ్యం చూసిన తరువాత చెట్లపై కూడా నీళ్లు పోయడం అలవాటు చేసుకుంది.

మొత్తానికైతే శుభ ఉండే ఇల్లు పక్షులకు నచ్చిన ఇల్లు అయింది. 'ఇక్కడికి వస్తే మనకు ప్రమాదమేమీ లేదు' అనే నమ్మకం వాటికి కలిగింది. కొన్ని సంవత్సరాల క్రితం కశ్మీర్కు చెందిన అరుదైన కశ్మీర్ ఫ్లైక్యాచర్ శుభ కంటపడింది. కర్ణాటక గడ్డపై అరుదైన కశ్మీర్ పక్షిని వీడియో రికార్డ్ చేసిన ఘనత దక్కించుకుంది శుభ.

ఫొటోగ్రాఫర్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు శుభ. అయితే రకరకాల పక్షులు నీళ్లు తాగుతున్న అందమైన దృశ్యాలు కనువిందు చేస్తున్న రోజుల్లో కెమెరాను చేతుల్లోకి తీసుకుంది. 'పక్షి జల' పుస్తకంతో రచయిత్రిగా కూడా మారింది. ఈ పుస్తకాన్ని ఐఐఎస్సీ ప్రెస్ ప్రచురించింది.

'పుస్తకం రాయాలని ఎప్పుడూ అనుకోలేదు. బాటనీ, బయోలజీ బ్యాక్గ్రౌండ్ నుంచి రాకపోయినా ఈ పుస్తకం రాశానంటే కారణం ప్రకృతిపై నాకు ఉన్న ప్రేమ. దీంట్లో నా పరిశీలనలు, భావాలు, అనుభవాలు కనిపిస్తాయి. పక్షి జల చదివిన వాళ్లు ఎవరైనా తమ ఇంటి పరిసరాలలో పక్షుల దాహార్తిని తీర్చడానికి, వాటి జలకేళిని దర్శించడానికి నీటితో నిండిన మట్టిపాత్రలు ఏర్పాటు చేస్తే ఈ పుస్తకం ప్రయోజనం నెరవేరినట్లే' అంటుంది శుభ.

మనది కాని ప్రపంచంలోకి తొంగిచూడాలంటే అద్భుతశక్తులేవీ అవసరం లేకపోవచ్చుగానీ ఆసక్తి మాత్రం ఉండాలి. శుభా భట్కు ఆసక్తి అనే శక్తి ఉంది. ఆ ఆసక్తే ఆమెని పక్షుల ప్రపంచంలోకి వెళ్లేలా చేసింది.

ఇంటిప్స్



- గాజుసీసాలో నీళ్లుపోసి స్ప్రింగ్ ఆనియన్స్ వేర్లు మునిగేలా పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి. పచ్చని భాగం పెరుగుతూ ఉంటుంది కాబట్టి అవసరం ఉన్నప్పుడల్లా కాస్త కట్ చేసుకోని వాడుకోవచ్చు.



- క్యాప్సికాన్ని పేపర్ బ్యాగ్లో చుట్టిపెట్టి, రిఫ్రిజిరేటర్లో పెడితే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటుంది.



- మిగిలిపోయిన బ్రెడ్ స్లైసులను మిక్సీ పట్టుకోవాలి. ఈ పొడిని దోరగా వేయించి గాలి చొరబడని డబ్బాలో నిల్వచేసుకోవాలి. మార్కెట్లో దొరికే బ్రెడ్ క్రంబ్స్లా ఇది ఉపయోగపడుతుంది. క్రిస్పీ వెజ్ నాన్వెజ్ డిష్లకు ఇది బాగా ఉపయోగపడుతుంది.
- బేకింగ్ సోడాలో కాస్త వెనిగర్ వేసి నల్లగా జిడ్డుపట్టిన పాత్రలపైన రాసి పది నిమిషాలు నానబెట్టాలి. తరువాత డిష్ వాషర్తో తోమితే నలుపంతా పోయి పాత్ర కొత్తదానిలా మెరుస్తుంది.

బ్యూటిప్

ఇన్‌స్టంట్ గ్లో ప్యాక్



ఎంత మంచి డ్రెస్, దానికి తగ్గ యాక్సెసరీస్ ధరించినా, ముఖం ప్రకాశవంతంగా ఉంటేనే ఆకర్షణీయంగా ఉంటుంది. క్షణాల్లో మెరుపులీనేలా కనిపించే ఇన్స్టంట్ గ్లో ప్యాక్ను ప్రయత్నించి చక్కగా మెరిసిపోండి.
- రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిలో టీస్పూను తేనె, రెండు టేబుల్ స్పూన్ల చల్లటి పాలు పోసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసుకుని రెండు నిమిషాలు మర్దన చేయాలి. ఆరిన తరువాత నీటితో కడిగేయాలి. తడిలేకుండా తుడుచుకుని మాయిశ్చరైజర్ రాసుకుంటే ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

యూత్ పల్స్



యూత్‌ఫుల్ బ్లాక్‌బస్టర్

ఇటీవల హైదరాబాద్లో జరిగిన ఇండియా గేమ్ డెవలప్ కాన్ఫరెన్స్ (ఐజీడీసీ)లో విడుదల చేసిన 'లుమికై స్టేట్ ఆఫ్ ఇండియా గేమింగ్ రిపోర్ట్' మన దేశంలో డిజిటల్ గేమింగ్ ఇండస్ట్రీ ఉజ్వలభవిష్యత్తు గురించి చెప్పకనే చెప్పింది. డిజిటల్ గేమ్స్కు యూత్ మహారాజ పోషకులే అయినప్పటికీ 'యూజర్' స్థానానికి మాత్రమే పరిమితం కావడం లేదు. గేమింగ్ ఇండస్ట్రీ ముఖ చిత్రాన్ని మార్చడంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. సొంతంగా గేమ్ బిల్డింగ్ కంపెనీలు స్టార్ట్ చేస్తున్నారు.

ఇండియా గేమ్ డెవలప్ కాన్ఫరెన్స్(ఐజీడీసీ)లో గేమింగ్ వెంచర్ క్యాపిటల్ ఫర్మ్ లుమికై గూగుల్తో కలిసి 'లుమికై స్టేట్ ఆఫ్ ఇండియా గేమింగ్ రిపోర్ట్' విడుదల చేసింది. మన దేశంలో గేమింగ్ ఇండస్ట్రీ స్పీడ్కు ఇది అద్దం పడుతుంది. మన గేమింగ్ ఇండస్ట్రీ 2028 నాటికి అరవై రెండు వేల కోట్లను దాటుతుందని ఈ రిపోర్ట్ తెలియజేస్తుంది.

'డిజిటల్ గేమ్స్' అనగానే గుర్తుకు వచ్చేది యువతరమే. వారు డిజిటల్ గేమ్స్ వైపు ఆకర్షితం కావడానికి ప్రధాన కారణాలు...

- **సోషల్ కనెక్షన్:** ఫోర్ట్నైట్, మైన్క్రాఫ్ట్లాంటి గేమ్స్ ఫిజికల్ లొకేషన్తో పనిలేకుండా వర్చువల్ ఎన్విరాన్మెంట్లో ప్లేయర్స్ ఇతరులతో ఇంటరాక్ట్ అయ్యే, స్నేహం చేసే, ఆన్లైన్ కమ్యూనిటీలను నిర్మించుకునే అవకాశాన్ని కలిగిస్తున్నాయి. జెన్ జెడ్ హైలీ సోషల్ జెనరేషన్గా పేరు తెచ్చుకుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్లేయర్స్ ఒకరితో ఒకరు కనెక్ట్ కావడానికి, పోటీ పడడానికి తమ గేమ్స్లో సోషల్ ఫీచర్స్ను తీసుకువస్తున్నాయి కంపెనీలు.
- **యూజర్-జనరేటెడ్ కంటెంట్:** యూజర్లు తమ సొంత కంటెంట్ను క్రియేట్ చేసుకోవడానికి ఎన్నో పాపులర్ గేమ్స్ అనుమతిస్తున్నాయి. తమ స్వీయ అనుభవాలను ఉపయోగించి యూజర్-జనరేటెడ్ కంటెంట్ను వర్చువల్ వరల్డ్లో వైబ్రెంట్ అండ్ డైనమిక్గా క్రియేట్ చేయడానికి వీలవుతుంది.
- **ఎన్నో ఎన్నెన్నో:** యూత్ ప్లేయర్స్కు మోడ్రన్ గేమ్స్ కాంపిటీటివ్, కో–ఆపరేటివ్ గేమ్ప్లే, ఎక్స్ప్లోరేషన్, స్టోరీ టెల్లింగ్కు సంబంధించి సరికొత్త అనుభవాలను అందిస్తున్నాయి. ప్లేయర్స్కు గ్రాఫిక్స్, సౌండ్, గేమ్ ప్లే మెకానిక్స్ను చేరువచేయడంపై దృష్టి పెడుతున్నాయి.
- **స్ట్రెస్ ఫ్రీ-క్రియేటివిటీ:** యూత్లో కొద్ది మంది ఒత్తిడి నుంచి బయట పడడానికి గేమింగ్కు దగ్గరవుతున్నారు. ఆర్ట్, డిజైన్, స్టోరీ టెల్లింగ్ లాంటి సృజనాత్మక ప్రక్రియలను ఇష్టపడే యువతరం క్రియేటివ్ ఎక్స్ప్రెషన్స్ కోసం వీడియో గేమ్స్ ఆడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కంపెనీలు తమ గేమ్స్లో ప్లేయర్స్కు సొంత గేమ్ మోడ్స్, మ్యాప్స్ క్రియేట్ చేయడానికి అనుమతిస్తున్నాయి.

యువతరమే కారణం...

మొబైల్ డివైజ్లకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మొబైల్ గేమింగ్ అభివృద్ధికి యూత్ ఉపయోగపడుతుంది. సంప్రదాయ గేమింగ్ కన్సోల్స్ కంటే అఫర్డబుల్ అండ్ యాక్సెసబుల్గా ఉండే మొబైల్ డివైజ్లకే ప్రాధాన్యత ఇస్తోంది యువతరం. ఇ–స్పోర్ట్స్ లేదా కాంపిటీటివ్ గేమింగ్ మెయిన్ స్ట్రీమ్లోకి రావడానికి ప్రధాన కారణం యువత. యువతరం చూపిస్తున్న ఆసక్తి వల్ల ఎన్నో టెలివిజన్ నెట్వర్క్లు ఇ–స్పోర్ట్స్ను నిర్వహిస్తున్నాయి. ప్రొఫెషనల్ ఇ–స్పోర్ట్స్ ప్లేయర్స్ తయారవుతున్నారు.

బోలెడు ఉపాధి అవకాశాలు...

గేమ్స్ నుంచి అపారమైన ఆనందాన్ని సొంతం చేసుకోవడమే కాదు గేమింగ్ ఇండస్ట్రీ నుంచి ఉపాధి అవకాశాలను కూడా వెదుక్కుంటోంది యువతరం. ఇ–స్పోర్ట్స్ ఇటీవల కాలంలో మల్టీ-బిలియన్–డాలర్ ఇండస్ట్రీగా ఎదిగింది. ప్రొఫెషనల్ ప్లేయర్స్కు జీతాలతో పాటు స్పాన్సర్షిప్ అవకాశాలు కూడా వస్తున్నాయి. గేమింగ్ ఇండస్ట్రీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగావకాశాలు ఉన్నాయి అంటుంది టీమ్లీజ్ డిజిటల్ ఫర్మ్ రిపోర్ట్ 'గేమింగ్: టుమారోస్ బ్లాక్బస్టర్. ప్రోగ్రామింగ్ (గేమ్ డెవలపర్స్, యూనిటీ డెవలపర్స్), టెస్టింగ్ (గేమ్స్ టెస్ట్ ఇంజనీరింగ్, క్వాలిటీ అండ్ అసూరెన్స్), యానిమేషన్, డిజైన్(మోషన్ గ్రాఫిక్ డిజైనర్స్, వర్చువల్ రియాలిటీ డిజైనర్స్), ఆర్టిస్ట్స్ (వీఎఫ్ఎక్స్ అండ్ కాన్సెప్ట్ ఆర్టిస్ట్స్), కంటెంట్ రైటింగ్, గేమింగ్ జర్నలిజం మొదలైన విభాగాలలో యువతకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

స్ఫూర్తిదాయక సూపర్‌స్టార్స్

యువతలో ఎంతోమందిలాగే ఈ ముగ్గురికి గేమ్స్ అంటే చాలా ఇష్టం. గేమింగ్ను వీరు అభిరుచిగా మాత్రమే చూడలేదు. గేమింగ్ రంగంలో తమ వ్యాపారదక్షతను నిరూపించుకోవాలనుకున్నారు. సొంతంగా గేమ్ బిల్డింగ్ కంపెనీ ప్రారంభించి తమ సత్తా చాటారు. యువతరంలో ఎంతో మందికి స్ఫూర్తి ఇస్తున్నారు.



సూపర్ గేమింగ్

యూనివర్శిటీ ఆఫ్ ముంబైలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసింది క్రిస్టెల్ డీక్రూజ్. ఆ తరువాత కొలరాడో స్టేట్ యూనివర్శిటీ(యూఎస్)లో కంప్యూటర్ సైన్స్లో మాస్టర్స్ చేసింది. 'టాప్టూలెర్న్'లో ఎడ్యుకేషనల్ గేమ్ డెవలపర్గా ఉన్నప్పుడు గేమ్స్కు ఉండే పవర్ ఏమిటో దగ్గర నుంచి చూసింది. ఆ కంపెనీలో చేరిన తొలి మహిళా ఉద్యోగి క్రిస్టెల్. ఆ తరువాత ఫ్రెండ్స్తో కలిసి 'సూపర్ గేమింగ్' అనే గేమ్బిల్డింగ్ కంపెనీ స్టార్ట్ చేసింది.



అపార్ గేమ్స్

ముంబై యూనివర్శిటీలో ఫైన్ ఆర్ట్స్లో డిగ్రీ చేసిన లక్ష్మీ కానోల్కర్ ముంబైలోని వెలింగ్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఇంటరాక్టివ్ ఇ–లెర్నింగ్ చిల్డ్రన్స్ కంటెంట్ను డిజైనింగ్ చేయడం ద్వారా గేమింగ్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. గేమింగ్ ఇండస్ట్రీలో ఎన్నో సంవత్సరాలు పనిచేసిన అనుభవంతో సొంతంగా గేమ్ డెవలపింగ్ కంపెనీ 'అపార్ గేమ్స్'ప్రారంభించింది.



వినో జో

ది యూనివర్శిటీ ఆఫ్ మాంచెస్టర్(ఇంగ్లాండ్)లో సైకాలజీలో మాస్టర్స్ చేసిన తరువాత కేపీఎంజీ కన్సల్టింగ్ వింగ్లో చేరింది సౌమ్యా సింగ్ రాథోడ్. టైమ్స్ గ్రూప్లో పనిచేసిన తరువాత 'వినో జో' పేరుతో సొంతంగా ఆన్లైన్ సోషల్ గేమింగ్ కంపెనీని మొదలు పెట్టింది. 'ఒక విషయంపై మనకు ఇష్టం ఉన్నప్పుడు అదే మన బలంగా మారుతుంది. ఆ బలంతోనే విజయం సాధించవచ్చు' అంటుంది సౌమ్యా సింగ్.

స్ఫూర్తి

వ్యాపారం చేయాలంటే లక్షల్లో పెట్టుబడులు పెట్టాలనుకుంటారు. కానీ, అహ్మదాబాద్ వాసులైన ప్రియాంషి, యశ్వి అక్కాచెల్లెళ్లు ఐదేళ్ల క్రితం తల్లి ఇచ్చిన పాకెట్మనీ 2,500 రూపాయలతో జార్ క్యాండిల్స్ తయారీని ప్రారంభించారు. నేడు ఏడాదికి 25 లక్షల టర్నోవర్ని సాధిస్తున్నారు. కాలేజీలో చదువుకుంటూనే జాయిస్ బీమ్ క్యాండిల్ వ్యవస్థాపకులుగా, వ్యాపారవేత్తలుగా మారిన ఈ అక్కాచెల్లెళ్లు నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 'మా జీవితాల్లో మేమే వెలుగులను నింపుకుంటున్నాం' అని తమ వెంచర్ గురించి ప్రస్తావిస్తూ ఎన్నో విషయాలను ఇలా మన ముందుంచుతున్నారు.



అక్కాచెల్లెళ్లు ప్రియాంషి, యశ్వి

క్యాండిల్ సిస్టర్స్







అక్కా చెల్లెళ్లలో ముందుగా యశ్వి మాట్లాడుతూ – 'అహ్మదాబాద్లోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ చదివాను. కోర్సులో పారిశ్రామిక శిక్షణా యూనిట్ అనే సబ్జెక్ట్ కూడా ఉంది. ఇందులో మెలకువలు నేర్చుకున్నాను. ఏడాది పొడవునా సీజన్కు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసే వాళ్లం. వీటి ద్వారా మొదట్లో నెలకు వెయ్యి రూపాయలే వచ్చేది. ఆ తర్వాత ఈ పనే ప్రధానంగా చేసుకున్నాం. దీపావళి సమయంలో కొవ్వొత్తులతో పాటు సోప్ సొల్యూషన్స్, లిప్ బామ్లు అమ్మేవాళ్లం. చాలా సార్లు పెద్ద కంపెనీలకు, ఇంటింటికీ వెళ్లి ఉత్పత్తులను డోర్ టు డోర్ మార్కెటింగ్ చేసేదానిని. ఈ సమయంలో మా స్వంత కలను గుర్తించాం. కాలేజీ సమయంలో మూడేళ్ల పాటు చేసిన ఈ ప్రయత్నానికి మా అక్క ఆలోచనలు కూడా తోడయ్యాయి. అమ్మ కూడా మాకు సపోర్ట్గా నిలిచింది. ఐదుగురితో క్యాండిల్స్ తయారీ ప్రారంభించి, 50 కొవ్వొత్తులను మాత్రమే తయారు చేశాం. వాటిని ఒక ఫెయిర్లో ప్రదర్శించాను. అన్ని ఖర్చులు తీసివేస్తే 700 రూపాయల లాభం వచ్చింది. నేను చేస్తున్న ఈ ప్రయత్నం మా నాన్నకు నచ్చలేదు. ఇరవై ఏళ్లు దాటుతూనే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడమే ప్రధానంగా భావించేవారు. ఆడపిల్లలు సొంతంగా ఆలోచించడానికి వీలు లేని చోటు. దీంతో నాన్న మమ్మల్ని ఆదుకోలేదు. కానీ, ఈ రోజు మమ్మల్ని చూసి గర్వపడుతున్నారు. మొదట్లో మా బంధువుల్లో ఫలానా వాళ్ల కూతుళ్లు ఇంట్లో టైమ్ పాస్ చేస్తున్నారు అనుకునేవారు. కానీ, ఈ రోజు మా ఎదుగుదల చూసి బంధువులకు కూడా మా బలం ఏంటో అర్థమైంది. ఆంక్షలు ఉన్నప్పటికీ సాధించాలన్న మా తపనకు అవేవీ అడ్డంకి కాలేదు' అని వివరిస్తుంది.



నిశితంగా పరిశీలన

ముడిపదార్థాలను కలపడం, మ్యాజికల్ ఫార్ములాను సెట్ చేయడం యశ్వి చూస్తుంటే, ఆన్లైన్–ఆఫ్లైన్ ప్రచారాల మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించే బాధ్యత అక్క ప్రియాంషి తీసుకుంది. తమ ఉత్పత్తుల గురించి ప్రియాంషి మాట్లాడుతూ – 'మా చేతితో తయారుచేసిన జార్ కాండిల్స్ మాకో ప్రత్యేకతను తీసుకువచ్చాయి. ఆర్గానిక్, నాన్ టాక్సిక్ ముడి పదార్థాలను మాత్రమే ఈ తయారీలో ఉపయోగించడం వల్ల పర్యావరణ అనుకూలమైనవని మా అభిప్రాయం. ఇందుకు మేం గర్వపడుతున్నాం. తయారీ నుంచి ప్యాకేజ్, కస్టమర్లకు మా ఉత్పత్తులను చేర్చడం వరకు ప్రతి దశను నిశితంగా పర్యవేక్షిస్తాం. కచ్చితమైన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మా జాడీలను ఎనిమిదిసార్లు క్షుణ్ణంగా పరిశీలిస్తాం. దీని వల్ల కస్టమర్లకు నాణ్యమైన జార్ క్యాండిలను అందించగలుగుతున్నాం.

కొవ్వొత్తులు కేవలం కాంతిని మాత్రమే అందించవు. మేం తయారు చేసే క్యాండిళ్లలోని కంటికి ఇంపైన రంగులు, హాయి గొలిపే పరిమళాలు మనసును ఆనందానికి లోను చేస్తాయి. ఈ పనిలో శ్రద్ధ చాలా కీలకం. నమ్మి చేస్తాం కనుక ఫలితం కూడా చూస్తున్నాం' అని ఆనందంగా వివరిస్తుంది.

ఒక చిన్న ఆలోచనను అమలులో పెట్టి, దానికి సృజనాత్మకతను జోడించి అంచెలంచెలుగా ఎదుగుతున్న ఈ అక్కాచెల్లెళ్లు నవతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 234

బుధవారం 15-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సెమీస్ 'ప్రతీకార' సమయం

నేడు ముంబైలో న్యూజిలాండ్‌తో భారత్ వరల్డ్‌కప్ సెమీస్ పోరు -12లో



టాప్‌గేర్‌లో టెస్లా దిగుమతులు!

భారత్ నుంచి రెట్టింపు.. కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి -13లో

న్యూస్‌రీల్

మీకోసం కొట్లాడింది ఎవరు?



'మీ కోసం ఐదేళ్ల కొట్లాడిందెవరు.. లాఠీ దెబ్బలు తిన్నదెవరు, జైలుకు పోయిందెవరు.. రేవంత్, ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ మీ కోసం ఒక్కనాడైనా ఉద్యమించారా' అని బండి సంజయ్ ప్రజలను ప్రశ్నించారు.

- వివరాలు 5లో▶

సున్నిత ప్రాంతాల్లో అదనపు బందోబస్తు



రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19,375 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇందులో 4,400 ప్రాంతాలను క్లిష్టమైనవిగా గుర్తించినట్టు ఎన్నికల నోడల్ అధికారి, శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ జైన్ 'సాక్షి'కి తెలిపారు.

- వివరాలు 14లో▶

'రేటింగ్' పేరుతో చీటింగ్



సైబర్ నేరగాళ్లు గూగుల్ మ్యాప్‌లోని ప్రాంతాలకు రేటింగ్ ఇవ్వాలంటూ మోసాలకు పాల్పడుతున్నట్టు సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఒక యువకుడు ఈ స్కాంలో రూ.74 వేలు పోగొట్టుకున్నాడని తెలిపారు.

- వివరాలు 14లో▶

నేడు వాయుగుండం.. రేపటికి తీవ్రం

ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్, నికోబార్ దీవులకు ఆనుకుని మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ బుధవారం నాటికి వాయుగుండంగా మారనుంది. ఆంధ్రప్రదేశ్ తీరానికి కాస్త దూరంలో గురువారం నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది.

- వివరాలు 5లో▶

మంగళవారం నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు



రాయేదో.. రత్నమేదో తేల్చుకోండి



తొర్రూరు సభలో ప్రసంగిస్తున్న కేసీఆర్

- ఒక్కసారి ఊళ్లలో చర్చ పెట్టండి..
- అధికారం ఇచ్చినప్పుడు ఎవరు ఏం చేశారో ఆలోచించి ఓటు వేయండి
- పదేళ్ల కిందటి పరిస్థితిని, బీఆర్‌ఎస్ పాలనలో ఏం చేసిందీ బేరీజు వేసుకోండి
- రాష్ట్రం కాంగ్రెసోళ్ల చేతిలో పడితే కరెంటు, రైతుబంధు, దళితబంధు పోవుడు ఖాయం

హాలియా, తొర్రూరు, ఇబ్రహీంపట్నం సభల్లో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/ సాక్షి, మహబూబాబాద్/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఎలాంటోడని ఆలోచించడమే గాకుండా.. వారి వెనుక ఉన్న పార్టీ గత చరిత్ర ఏంటి? వాళ్లకు అధికారం ఇచ్చినప్పుడు ఏం చేసింద్రు? అన్నది ఆలోచించి ఓటు వెయ్యాలె. కాంగ్రెస్ 50 ఏళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించింది, బీఆర్‌ఎస్ కూడా పదేళ్లు పాలించింది. ఎవరి కాలంలో ఏం జరిగిందో, బీఆర్‌ఎస్ ఏం అభివృద్ధి చేసిందో బేరీజు వేసుకోవాలి. నా మాటను మన్నించి ఊళ్లలో

మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్‌లో రె'బెల్స్'

రాష్ట్రవ్యాప్తంగా 24 చోట్ల నామినేషన్లు వేసిన కాంగ్రెస్ అసంతృప్తులు

- చర్చలు జరుపుతున్న ఠాక్రే... నేడు కొలిక్కి వచ్చే అవకాశం
- 10 చోట్ల రెబెల్స్ బెడద తప్పకపోవచ్చంటున్న గాంధీ భవన్ వర్గాలు
- సూర్యాపేట, వరంగల్ వెస్ట్, బాన్సువాడ, జుక్కల్, డోర్నకల్ స్థానాలపై ఉత్కంఠ



సాక్షి, హైదరాబాద్: ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెబెల్స్ బెడద తప్పేలా లేదు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు, నలుగురు నేతలు టికెట్లు ఆశించగా, అందులో టికెట్లు రాని అసంతృప్తులు రాష్ట్రవ్యాప్తంగా 24 చోట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ 24 మందిని కాంగ్రెస్ పెద్దలు బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కనీసం 10 చోట్ల ఆ పార్టీకి రె'బెల్స్' మోగక తప్పదని గాంధీభవన్ వర్గాలే అంటున్నాయి. ముఖ్యంగా సూర్యాపేట, బాన్సువాడ, వరంగల్ వెస్ట్, డోర్నకల్, వైరా, ఇల్లందు నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది.

హైదరాబాద్‌కు రండి..

ఈసారి కాంగ్రెస్ రెబెల్స్‌గా జంగా రాఘవరెడ్డి (వరంగల్ వెస్ట్), నరేశ్ జాదవ్ (బోథ్), గాలి అనిల్‌కుమార్ (నర్సాపూర్), ఎస్.గంగారాం (జుక్కల్), కాసుల బాలరాజు (బాన్సువాడ), నాగి శేఖర్ (చొప్పదండి), దైద రవీందర్ (నకిరేకల్), రామ్మూర్తి నాయక్ (వైరా), ప్రవీణ్ నాయక్, చీమల వెంకటేశ్వర్లు (ఇల్లందు), విజయ్‌కుమార్‌రెడ్డి (ముథోల్), లక్ష్మీనారాయణ నాయక్ (పాలకుర్తి), సున్నం వసంత (చేవెళ్ల), నెహ్రూ నాయక్ (డోర్నకల్), భూక్యా మంగీలాల్ (మహబూబాబాద్), పటేల్ రమేశ్‌రెడ్డి (సూర్యాపేట), చిమ్మని దేవరాజు (పరకాల), సిరిసిల్ల రాజయ్య (వర్ధన్నపేట)తోపాటు మరి కొంత మంది రంగంలోకి దిగారు. వీరిలో ఒకరిద్దరు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) టికెట్లు తెచ్చుకుని సింహం గుర్తుపై పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. రెబెల్స్‌గా నామినేషన్లు దాఖలు చేసిన వారితో

మిగతా 3వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ మళ్లీ గెలిస్తే నిరుద్యోగులది అడవి బాటే

కాంగ్రెస్ విజయభేరి సభల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- వాళ్లు అన్నల్లో చేరితే ప్రభుత్వంలో ఒక్కరూ మిగలరు.. దొర కాళ్ల కింద తెలంగాణ నలిగిపోతోంది
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వాళ్ల కరెంటు ఊడగొడతాం
- దేశమంతా కామారెడ్డి ప్రజల తీర్పు కోసం ఎదురు చూస్తోంది
- కాంగ్రెస్‌ను గెలిపించకపోతే నిజాం పాలన పునరావృతం

సాక్షి, వరంగల్/జనగామ/ సాక్షి, కామారెడ్డి: తెలంగాణ సాధన పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్‌కు మరోసారి పట్టం గడితే రాష్ట్రంలోని నిరుద్యోగులు అడవి బాట పట్టడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యోగాల కోసం పరీక్షల యుద్ధం చేస్తున్న నిరుద్యోగ యువత దిక్కుతోచక అటవీబాట పట్టే పరిస్థితి వస్తే, నక్సలైట్ ఉద్యమం పునరావృతమైతే.. ఈ ప్రభుత్వంలో ఒక్కరూ మిగిలే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. 1,200 మంది యువత ఆత్మ బలిదానాలకు చలించి కాంగ్రెస్ పార్టీ మిగులు బడ్జెట్‌తో ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని, కానీ కేసీఆర్

మిగతా 3వ పేజీలో ▶



స్టేషన్‌ఘన్‌పూర్ సభలో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో అద్దంకి దయాకర్, అభ్యర్థి సింగపురం ఇందిర

చిట్యాల రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



ఆగం కావొద్దు

- కర్ణాటక, గుజరాత్ నేతలు కేసీఆర్‌పై దండయాత్ర చేస్తున్నారు
- సుస్థిర ప్రభుత్వానికి మద్దతివ్వాలి.. కోమటిరెడ్డి బ్రదర్స్ ఓటమి ఖాయం

నల్లగొండ జిల్లా చిట్యాల రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

చిట్యాల: కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేసే బలమైన నాయకత్వం కలిగిన బీఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎన్నికలు వచ్చాయంటే జనంలో లేని వాళ్లు, ఇతర రాష్ట్రాల నుంచి ప్రచారానికి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను చూసి ఓటర్లు ఆగమాగం కావొద్దన్నారు. కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల నుంచి విపక్షాల నాయకులు వచ్చి బక్కపల్చగా ఉండే సీఎం కేసీఆర్‌పై దండయాత్ర చేస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాలలో పార్టీ నకిరేకల్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యతో కలిసి నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ ప్రసంగించారు. బీఆర్‌ఎస్ విజయం సాధిస్తే కేసీఆర్ మూడోసారి సీఎంగా పనిచేస్తారని, కాంగ్రెస్‌లో మాత్రం కౌన్ బనేగా సీఎం అన్నట్లుగా జిల్లాకో నలుగురు సీఎం అభ్యర్థులున్నారని, వారికి ఢిల్లీ నుంచి సీల్డ్ కవర్‌లో సీఎం పేరు

మిగతా 2వ పేజీలో ▶

సుబ్రతా రాయ్ కన్నుమూత



సహారా ఇండియా పరివార్ వ్యవస్థాపకుడు సుబ్రతా రాయ్ కన్నుమూశారు. 75 ఏళ్ల రాయ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బిహార్‌లోని అరారియాలో జన్మించిన రాయ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, మీడియా, హాస్పిటాలిటీ సహా వివిధ రంగాలలో వ్యాపార సామ్రాజ్యం విస్తరించారు. -13లో

కేసీఆర్ మామకు మద్దతిద్దాం

వికారాబాద్ సభలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

- రేవంత్‌ను ఇంట్లోనే కూర్చోబెడదాం
- అతని మూలాలు ఆర్‌ఎస్‌ఎస్‌లోనే..
- ఆర్‌ఎస్‌ఎస్‌ను నిలువరించడమే మజ్లిస్ పని
- మైనారిటీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కట్టుబడి ఉంది

2లో



వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో జరిగిన ముస్లింల సభలో ప్రసంగిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ

ఇదండీ సంగతి



తనని చూసి కాకున్నా.. కనీసం తన మేనిఫెస్టోని చూసి ఓటేయమంటున్నాడు!

రాబోయే వ్యాధులకు ముందే చెక్!

- మానవ కణజాల నిల్వ, విశ్లేషణ కోసం హైదరాబాద్‌లో బయోబ్యాంక్ ఏర్పాటు.. దక్షిణాదిలోకెల్లా ఈ తరహా తొలి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఏఐజీ హాస్పిటల్స్
- జీవ నమూనాల విశ్లేషణ ద్వారా జన్యు పరిశోధనలకు మార్గం సుగమం..ముందుగానే వ్యాధుల నివారణ ప్రక్రియ ప్రారంభించేందుకు వీలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అమెరికా జీవ శాస్త్రవేత్త డాక్టర్ లెరోయ్ హుడ్, ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి

బయో బ్యాంక్ ఎలా సహాయపడుతుందంటే? 3లో

సాక్షి, హైదరాబాద్: మానవ కణజాల నమూనాల సంరక్షణ, విశ్లేషణ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక బయోబ్యాంక్‌ను ఏఐజీ హాస్పిటల్స్ ఏర్పాటు చేసింది. 3 లక్షలకుపైగా జీవ నమూనాలను 15 ఏళ్లకుపైగా నిల్వ చేసేందుకు వీలుగా ఈ బయోబ్యాంక్‌లో మైనస్ 80 డిగ్రీల ఫ్రీజర్లు పదిహేను, మైనస్ 20 డిగ్రీల ఫ్రీజర్లు ఐదు, మైనస్ 160 డిగ్రీలతో కూడిన మూడు లిక్విడ్ నైట్రోజన్ ట్యాంకులు ఉన్నాయి. ఈ తరహా నిల్వ కేంద్రం ఏర్పాటు దక్షిణాదిలోనే మొదటిదిగా పేర్కొంటున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ జీవ శాస్త్రవేత్త డాక్టర్ లెరోయ్ హుడ్ ఈ బయోబ్యాంక్‌ను మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ బయో బ్యాంక్ అర్థవంతమైన పరిశోధనలకు, వ్యాధుల నివారణకు వీలు కల్పిస్తుందని.. అంతిమంగా అత్యాధునిక వైద్య విధానాల అభివృద్ధికి దోహదపడుతుందని హుడ్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిస్టమ్స్, బిగ్ డేటా టూల్స్, మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌ల మేళవింపుతో ఈ బయోబ్యాంక్ పనిచేస్తుందన్నారు. కేన్సర్, డయాబెటిస్, హార్ట్ ఫెయిల్యూర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల లక్షణాలు


మిగతా 3వ పేజీలో ▶

మొత్తం ఓటర్లు 3.26 కోట్లు

గతనెల 5న జాబితా ప్రకటించాక కొత్తగా చేరిన ఓటర్లు 8,70,072

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. గతనెల 5న ప్రకటించిన జాబితాతో పోలిస్తే.. ఐదో తేదీ నుంచి అక్టోబర్ 31 వరకు కొత్తగా 8,70,072 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విడుదల చేసిన జాబితా ప్రకారం అందులో 3,26,02,799 ఓటర్లు ఉన్నారు. వయసు వారీగా కూడా ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. కొత్తగా చేరిన ఓటర్ల జాబితాను అక్టోబర్‌లో ప్రకటించిన ఓటర్ల జాబితాకు అనుబంధంగా జత చేయనున్నారు. 18 నుంచి 39 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్ల సంఖ్య కోటి 67 లక్షల 394 మంది ఉండగా, 40 ఏళ్ల పైబడిన వారు 1,58,73,405 మంది ఉన్నట్లు తేలింది. ఈ ఎన్నికల్లో యువ ఓటర్లు ప్రధాన పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. అయితే వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేలా రాజకీయ పార్టీలతోపాటు ఎన్నికల సంఘం కూడా ఓటు విలువను తెలియ చెప్పేలా కార్యక్రమాలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

వయసుల వారీగా ఓటర్ల జాబితా..



క్లుప్తంగా...

అమిత్ షా పర్యటనలో మార్పు.. 18న రాక



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత అమిత్ షా రాష్ట్రంలో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో స్వల్ప మార్పులు జరిగాయి. ఈ నెల 17వ తేదీన ఆయన రాష్ట్రానికి రావలసి ఉండగా.. ఆ కార్యక్రమాలన్నీ ఒకరోజు వాయిదా పడ్డాయి. ఈనెల 18న రాష్ట్రానికి రానున్నట్లు బీజేపీ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈనెల 18వ తేదీన బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన తర్వాత నల్లగొండ, వరంగల్, గద్వాల, రాజేంద్రనగర్‌లలో జరిగే బహిరంగ సభల్లో షా పాల్గొంటారు.

బీసీ బిల్లుపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలి: కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): బీసీ బిల్లుపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీజేపీ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. బీసీ ముఖ్యమంత్రిని ప్రకటిస్తే సరిపోదని, తమ అంతిమ లక్ష్యం పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమేనని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో సమర్థులైన బీసీ నేతలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ కేవలం 23 సీట్లు, కాంగ్రెస్ 20 సీట్లు కేటాయించి అన్యాయం చేశాయని ఆరోపించారు. బీసీ బిల్లుకు మద్దతిచ్చే పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందన్నారు.

గద్వాల బీఆర్ఎస్ అభ్యర్థిపై చర్యలు తీసుకోండి: గుజ్జుల



సాక్షి, హైదరాబాద్: గద్వాల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ లీగల్ సెల్ నాయకులు ఆంటోనిరెడ్డి, రామారావు తదితరులు రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారిని కోరారు. ఈమేరకు మంగళవారం సీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలపైన బీఆర్ఎస్ పార్టీ నేతలు దాడులకు పాల్పడుతున్నారని, పోలీసు యంత్రాంగం కూడా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని తెలిపారు.

మాదిగలతో ప్రధాని వేదికను పంచుకోవడం గొప్ప విషయం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణప్రసాద్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ మాదిగలతో కలిసి వేదికను పంచుకోవడం గొప్ప విషయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణప్రసాద్ అన్నారు. ఇప్పటివరకు ఏ ప్రధాని కూడా మాదిగల సమావేశానికి రాలేదన్నారు. మంగళవారం ఇక్కడ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతీ రాజకీయపార్టీ మాదిగల ఓట్లను వాడుకుంటూ వారికి ద్రోహం చేస్తూ వచ్చాయని విమర్శించారు. ముప్పై ఏళ్లుగా చేస్తున్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటానికి న్యాయం జరుగుతుందని మాదిగలు ఎదురుచూస్తున్నారని, హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూపసభలో మోదీ ఇచ్చిన హామీతో ఆ కల నెరవేరబోతోందని అన్నారు. తెలంగాణ కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్న 12 వందల మందిలో సగంమందికిపైగా దళితులే ఉన్నారని పేర్కొన్నారు. దళితుడిని కావడం వల్లే తనను డీజీపీగా ప్రమోట్ చేయకుండా బీఆర్ఎస్ సర్కారు మూడేళ్ల పక్కన కూర్చోబెట్టిందని ఆరోపించారు.

ఎన్నికల ముందే ఎస్సీ వర్గీకరణ హడావుడి

వంగపల్లి శ్రీనివాస్ మండిపాటు

ముషీరాబాద్ (హైదరాబాద్): వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని ఎందుకు స్పష్టంగా చెప్పడం లేదో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. ఎన్నికల ముందే వర్గీకరణ విషయంలో హడావుడి చేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో వంగపల్లి మాట్లాడారు. వర్గీకరణ అంశంలో తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి పంపినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగినప్పుడు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను రక్తం కారేలా కొట్టింది బీజేపీ పార్టీ కాదా? అని నిలదీశారు. దెబ్బలు తిన్న కార్యకర్తలను చూసిన మంద కృష్ణమాదిగ ఈ గాయాల సాక్షిగా బీజేపీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారని గుర్తుచేశారు. కానీ నేడు మంద కృష్ణ మోదీ కాళ్లు మొక్కి మూల్యం చెల్లించుకున్నారని ఎద్దేవా చేశారు.





మంగళవారం పాలకుర్తి, ఇబ్రహీంపట్నంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభలకు భారీగా హాజరైన జనం

రాయేదో.. రత్నమేదో తేల్చుకోండి

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్కసారి చర్చ పెట్టండి. ఏది రాయో, ఏది రత్నమో తెలుసుకుని ఓటేయండి..' అని బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. 'ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు ఓటు. ఇది ఓ వజ్రాయుధం లాంటిది. ఆట కోకిల విషయం కాదు (చిన్నపిల్లల వ్యవహారం కాదు). దానిని ఆషామాషీగా వేయొద్దు. అది మన తలరాతను మార్చుతుంది. భవిష్యత్తును నిర్ణయించేది. కాబట్టి వచ్చే ఐదేళ్లు ఎవరు పాలించాలి? ఎవరి చేతిలో ఉంటే రాష్ట్రం బాగుంటదన్న విషయాలపై గ్రామాల్లో చర్చ పెట్టి నిర్ణయం తీసుకుంటే ప్రజలు గెలుస్తారు. హైదరాబాద్‌లో ఏర్పడే ప్రభుత్వం మంచిగుంటే మీకు మంచి జరుగుతది. లేకపోతే చెడు జరుగుతుంది..' అని చెప్పారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాలో, మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం పరిధి తొర్రూరు పట్టణంలో, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రాధాన్యం

'పదేళ్ల కిందట తెలంగాణ పరిస్థితి ఏంటి అనేది ప్రతిఒక్కరూ ఆలోచించాలి. ఎక్కడ చూసినా కరువు కాటకాలు. రైతుల ఆత్మహత్యలు. కడివెడు నీళ్ల కోసం కూడా ప్రజలు కష్టాలు పడటం చూసినం. పంటలు పండక హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వలసలు. ఈ పరిస్థితి నుంచి మొదలైన బీఆర్ఎస్ పాలనలో ఎన్ని మార్పులు వచ్చాయో మీరు చూడండి. సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. కాళేశ్వరం కట్టుకున్నాం. కాల్వల ద్వారా రైతులకు నీటితీరువా లేకుండా నీళ్లు పారించి కరువును పారదోలాం. మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోదీ నాపై ఒత్తిడి తెచ్చాడు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.25 వేల కోట్ల బడ్జెట్ రావాల్సి ఉండగా, రూ.5 వేల కోట్లు కట్ చేస్తామని బెదిరించాడు. అయినా బెదరలేదు. మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశా. మరోవైపు గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసుకున్నాం. ఇప్పుడు వారే పాలకులుగా మారారు. వలసలు ఆగిపోయాయి. పెన్షన్‌ను మొదట వెయ్యి చేసి, ఇవ్వాల రెండు వేలు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. దాని రూ.5 వేలకు పెంచుకోబోతున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా కంటి వెలుగు, దళితబంధు తీసుకొచ్చాం. తలసరి విద్యుత్ వినియోగంలోనే కాదు.. ఆదాయంలోనూ దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లాం. ఇవన్నీ చూస్తే ఎట్లున్న తెలంగాణ ఎట్ల మారింది అన్నది కన్పిస్తుంది. పేదలకు ఆనాడు కాంగ్రెస్ ఇచ్చిన బియ్యం ఎంత? ఈనాడు ఇస్తున్న బియ్యం ఎంత? ఆలోచించాలి. వచ్చే మార్చి నుంచి రేషన్ కార్డున్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం ఇస్తాం. మళ్లీ అధికారంలోకి రాగానే గిరిజనబంధు అమలు చేస్తాం. ..' అని కేసీఆర్ చెప్పారు.

నేను మాట నిలుపుకున్నా.. జానారెడ్డి తప్పారు

'2014లో మేము అధికారంలోకి రాగానే ఆర్థిక నిపుణులతో చర్చించి కరెంట్ విషయంలో స్థిర నిర్ణయం తీసుకున్నాం. రెండేళ్లలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పా. ఆనాడు ప్రతిపక్ష నాయకునిగా ఉన్న కాంగ్రెస్ పెద్ద నాయకుడు జానారెడ్డి.. 'నాలుగేళ్లలో 24 గంటల కరెంట్ ఇచ్చినా నేను కాంగ్రెస్ కండువాను వదిలి, గులాబీ కండువా కప్పుకుంటా..' అని అన్నారు. నేను ఏడాదిన్నరలోనే కరెంట్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నా. కానీ జానారెడ్డి మాత్రం మాట మీద నిలబడలేదు. గులాబీ కండువా కప్పుకోలేదు. ఎన్నిసార్లు గెలిపించినా పెద్ద నాయకుడిని చేసినా ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదు. ఇప్పుడు నేను ముఖ్యమంత్రినవుతా అని పంచరంగుల కల కంటున్నారు..' అని విమర్శించారు. 'పోరాటం, దైవభక్తితో విరాజిల్లిన నేల తెలంగాణ ప్రాంతం. పోతన, చాకలి అయిలమ్మ, షేక్ బందగి, దొడ్డి కొమురయ్యలు పుట్టిన పురిటి గడ్డ. వారిని స్ఫూర్తిగా తీసుకొని పాలకులను ఎన్నుకోవాలి. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి..' అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ సభల్లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు, రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, మధుసూదనాచారి, పార్టీ నేతలు ఆనంద భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్ల చేతిలో పడితే పెద్ద పాము మింగినట్లే..

'కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారంలో ఉన్ననాడు ఏ పేదలనూ చూడలేదు. ఈసారి పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ పోవుడు ఖాయం. రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జై భీమ్. రాష్ట్రం కాంగ్రెసోళ్ల చేతిలో పడితే వైకుంఠ ఆటలో పెద్ద పాము మింగినట్లే. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ధరణి తీసేసేవాళ్లు, 24 గంటల కరెంటు వద్దని.. 3 గంటల కరెంటు ఇచ్చే వాళ్లు, 10 హెచ్‌పీ మోటార్ పెట్టుకోమనేవాళ్లు రాజ్యానికి వస్తే రైతుల గతి ఏమవుతుందో ఆలోచన చేయండి. రైతులు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటార్లు వాడుతుంటే పీసీసీ అధ్యక్షుడు 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోమంటున్నారు. మరి ఆ మోటార్లు ఎవరు కొనివ్వాలి? 24 గంటల కరెంటు ఇస్తున్న మన రాష్ట్రానికి వచ్చి.. మా కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తున్నామని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంటున్నారు. రైతుబంధుతో డబ్బులు దుబారా చేస్తున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. 3 గంటల ఉచిత విద్యుత్ చాలని ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు అంటున్నారు. రాహుల్, సీఎల్పీ నేత ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్నారు. అలాంటి ప్రభుత్వం కావాలా మీకు? ఎవరి పాలనలో ఏం చేశారు అనేది ప్రతి ఇంట్లో చర్చ జరగాలి. అంతేకానీ ఓటు వేసేటప్పుడు గాయ్ గాయ్ అయి అమూల్యమైన ఓటును గంగపాలు చేయొద్దు..' అని సీఎం సూచించారు.

కరువు, కర్ఫ్యూ | కాంగ్రెస్ కవలలు

కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: 'కరువు, కర్ఫ్యూ రెండూ కాంగ్రెస్ పార్టీకి పుట్టిన కవలలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదని ఆయన చెప్పారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన 44 కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పాలనలో పవర్ హాలిడేలు, పారిశ్రామిక వేత్తలు ధర్నాలు చేసే స్థితి నుంచి ఇప్పుడు తెలంగాణలో 24 గంటల కరెంటు ఇచ్చే స్థాయికి చేరుకున్నామని అన్నారు. జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ దేశమంతా కొట్టుకుని తెలంగాణలో మాత్రం కలిసి పనిచేస్తున్నాయని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ శక్తిని తట్టుకోలేక ఈ రెండు పార్టీలూ ఒక్కటవుతున్నాయని, తెలంగాణలో ఇటీవలి కాలంలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. 'మునుగోడు, హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు పోతే బీజేపీ గెలిచింది. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట బీజేపీ మద్దతు, బీజేపీ బలంగా ఉన్న చోట కాంగ్రెస్ మద్దతు ఇస్తోంది. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. బీజేపీలో ఉన్న వివేక్, రాజగోపాల్‌రెడ్డి నామినేషన్ల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలో కొట్లాడే ఈ పార్టీలు తెలంగాణలో మాత్రం కలుస్తాయి'అని హరీశ్ విమర్శించారు. 'రైల్వేలు, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ తదితర సంస్థలను అమ్ముతూ బీజేపీ కార్మికుల ఉసురు పోసుకుంటోంది. సంగారెడ్డి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సహా అనేక కర్మాగారాలను అమ్మే ప్రయత్నం చేస్తోంది' అని హరీశ్ పేర్కొన్నారు. 'అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో కార్మికులకు, రవాణా కార్మికుల కోసం ట్రాన్స్‌పోర్ట్ బోర్డు ఏర్పాటు చేస్తాం. రిసోర్స్ పర్సన్లు, వీఏవోల వేతనం రెట్టింపు చేస్తాం. బీమా పథకం అమలు చేసి, కుటుంబ పెద్ద మరణించిన వారం రోజుల్లో రూ.5 లక్షల బీమా డబ్బులు బాధిత కుటుంబానికి అందేలా చూస్తాం. మాట తప్పే కాంగ్రెస్ కావాలో, హామీలు నెరవేర్చే కేసీఆర్ కావాలో కార్మికులు తేల్చుకోవాలి' అని హరీశ్‌రావు అన్నారు.



తెలంగాణ భవన్‌లో జరిగిన కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హరీశ్

కేసీఆర్ మామకు మద్దతిద్దాం

- రేవంత్‌ను ఇంట్లోనే కూర్చోబెడదాం
- అతని మూలాలు ఆర్ఎస్ఎస్‌లోనే..
- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

వికారాబాద్: ఎట్టి పరిస్థితిల్లోనూ సంకీర్ణ సర్కారు రానివ్వం.. ఈ ఎన్నికల్లో కేసీఆర్ మామకు మద్దతిద్దాం.. ఆర్ఎస్ఎస్ అన్న రేవంత్‌రెడ్డిని ఇంట్లో కూర్చోబెడదామని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారు. మంగళవారం వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో జరిగిన ముస్లింల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాహుల్‌గాంధీ, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. రేవంత్ మూలాలు ఆర్ఎస్ఎస్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆదేశాలతోనే రేవంత్ ముందుగా టీడీపీలోకి ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వెళ్లారని ఆరోపించారు. అందుకే అతన్ని కొడంగల్ ఇంటికే పరిమితం చేయాలని పిలుపునిచ్చారు. 2004, 2009 ఎన్నికల్లో గోషామహల్‌లో తమ సపోర్టు వల్లే కాంగ్రెస్ గెలిచిందన్నారు. అప్పట్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో తమకున్న సత్సంబంధాల వల్లే సపోర్టు చేశామని ఓవైసీ తెలిపారు. బీజేపీకి లాభం జరగకూడదనేదే తమ ప్రధాన ఉద్దేశమనీ, తమ అంతిమ లక్ష్యం ఆర్ఎస్ఎస్‌ను నిలువరించడమేనని స్పష్టం చేశారు. గోషామహల్‌లో బీజేపీ గెలుపునకు దోహదం చేస్తోంది కాంగ్రెస్సేనని ఆరోపించారు. తాను బీజేపీ, కేసీఆర్ ఇచ్చే డబ్బులకు అమ్ముడు పోయానని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు, విమర్శలను తిప్పికొట్టారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మీరే జైలుకు పంపారని కాంగ్రెస్ నేతలనుద్దేశించి విమర్శించారు. వారి కోరిక మేరకే.. అప్పట్లో తాను జైలుకు వెళ్లి జగన్‌తో రాయబారం చేశానని, ఆయన మీతో కలిసేందుకు ఒప్పుకోలేదని వివరించారు. ఆ రోజు మీరు నాకెన్ని డబ్బులు ఇచ్చారని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. సిద్ధాంత పరంగా కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని ఆరోపించారు.

పాతబస్తీ ఏమైనా బండి జాగీరా

తెలంగాణలో ఆర్ఎస్ఎస్ గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఓవైసీ ఆరోపించారు. అది ఎప్పటికీ జరగనివ్వమని స్పష్టం చేశారు. కర్ణాటకలో బుర్ఖా వేసుకుని పోటీ పరీక్షలకు హాజరుకావద్దని ఆర్డర్ ఇచ్చారని, అలాంటి పరిస్థితి తెలంగాణలో ఉందా అని ఆయన ప్రశ్నించారు. మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందనీ, అందుకే ముస్లింలు కేసీఆర్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పాతబస్తీలో సర్జికల్ స్ట్రైక్ చేయిస్తాం అంటాడు.. పాత బస్తీ ఏమైనా నీ జాగీరా? అని ప్రశ్నించారు. జిల్లాలోని నాలుగు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ముస్లిం మైనార్టీలను కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అబ్దుల్ ఆది, హఫీజ్, మీర్‌మహేమూద్, రఫీ, తాహెర్‌అలీ, ఉస్మాన్, మోయిజ్, ఇబ్రహీ, షరీఫ్, అలీమొద్దీన్ పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం

మొత్తం అభ్యర్థులు 2,898

తిరస్కరించిన నామినేషన్లు 606

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన పూర్తయిన తరువాత అధికారికంగా సవ్యంగా ఉన్న అభ్యర్థుల నామినేషన్లు 2,898గా ఉన్నట్లు నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తేల్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడించిన వివరాల ప్రకారం 606 మంది నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన వారిలో అత్యధికులు ఇండిపెండెంట్ సభ్యులుగా, ప్రధాన పార్టీలకు డమ్మీలుగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు, అఫిడవిట్‌లు సమర్పించని, అభ్యర్థులకు మద్దతుగా సంతకాలు సరిగా చేయని వారి నామినేషన్లు తిరస్కరణకు గురైన వాటిలో ఉన్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు బుధవారంతో గడువు ముగియనుంది. నామినేషన్లు దాఖలు చేసిన వారిని బుజ్జగించే కార్యక్రమం కొనసాగుతోంది. రెబెల్స్ కారణంగా పార్టీ అధికారికంగా ప్రకటించిన వారికి ఇబ్బంది రాకుండా ఉండేందుకు పార్టీ నాయకులు వారిని సముదాయించి పోటీ నుంచి విరమింప చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. టికెట్లు రాని వారు పార్టీలు ఫిరాయించగా.. మరికొందరు పార్టీలోనే ఉంటూ పార్టీ నాయకులకు ముచ్చె మటలు పట్టించే పనుల్లో ఉన్నారు. బుధవారం రాత్రికిగానీ పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఎంత అనేది స్పష్టత వచ్చే అవకాశం లేదు.

ఆగం కావొద్దు



చిట్యాలలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

▶ మొదటి పేజీ తరువాయి

వస్తుందని ఎద్దేవా చేశారు. ఒకాయన పిల్లే లేదు కానీ పెళ్లి ముహూర్తం పెట్టుకున్నట్లు పార్టీలో సీఎం సీటు కోసం ముహూర్తం కూడా పెట్టుకున్నాడన్నారు. ప్రజలకు ఏం చేశారని కాంగ్రెస్‌కు ఓటెయ్యాలో ఆ పార్టీ నాయకులను ప్రశ్నించాలన్నారు. మరోసారి గెలిపిస్తే తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, కేసీఆర్ రూ.5 లక్షల బీమా సౌకర్యం, పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3 వేల నగదు అందిస్తామని, ఆసరా పింఛన్‌లను పెంచుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

డబ్బు పొగరుతో కోమటిరెడ్డి బ్రదర్స్ పోటీ

నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి బ్రదర్స్ డబ్బు పొగరుతో పోటీచేస్తున్నారని, వారు ఓడిపోవడం ఖాయమని కేటీఆర్ పేర్కొన్నారు. నల్లగొండలో కంచర్ల భూపాల్‌రెడ్డి, మునుగోడులో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వారిద్దరిని ఓడిస్తారని జోస్యం చెప్పారు. రిజర్వుడు నియోజకవర్గమైన నకిరేకల్ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యపై మీ పెత్తనం ఏందని కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ప్రశ్నించారు. పేదింటి బిడ్డ చిరుమర్తి లింగయ్యను ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రోడ్ షోలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, చెరుకు సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంపద పెంచాలి.. పేదలకు పంచాలి

నాగోలు: రాష్ట్రంలో అన్ని వర్గాలను, అన్ని రంగాలను అన్ని విధాలా ఆదుకున్న ఏకైక ప్రభుత్వం తమదే అని మంత్రి కేటీఆర్ అన్నారు. సంపద పెంచాలి.. పేదలకు పంచాలి అనేది తమ నినాదమన్నారు. మంగళవారం నాగోల్‌లో రాష్ట్ర హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. మునుగోడులో గతంలో ఫ్లోరోసిస్‌తో ఎంతోమంది ఇబ్బందులు పడ్డారని, కేసీఆర్ మిషన్ భగీరథ పథకానికి రూపకల్పన చేసి ఫ్లోరోసిస్‌కు శాశ్వత పరిష్కారం చూపారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని టెక్స్‌టైల్ పార్కులు పెట్టుకుందామని చెప్పారు. నేతన్నల బాగు కోసం ఇంకా ఏమైనా చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనేక చేనేత కార్మికుల పథకాలు రద్దు చేసిందన్నారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ పద్మశాలీల ఇంట్లో ఉండి చదువుకున్నందున, మన సమస్యలు తెలుసని చెప్పారు. వందకు వంద శాతం పద్మశాలీలు బీఆర్ఎస్ వైపు ఉన్నారని పేర్కొన్నారు.

టాప్ గేర్‌లో కేటీఆర్ రోడ్‌షోలు

- నేటి నుంచి 20వ తేదీ వరకు మరింత ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- హైదరాబాద్ సిటీ సహా పలు నియోజకవర్గాల్లో..
- ఉదయం జిల్లాల్లో, సాయంత్రం జంట నగరాల్లో..

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఈ నెల 15 నుంచి పూర్తిస్థాయిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లతోపాటు పలు నియోజకవర్గ కేంద్రాల్లో జరుగుతున్న రోడ్‌షోలలో కేటీఆర్ పాల్గొంటున్నారు. తాజాగా విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 15 నుంచి 20 వరకు 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే రోడ్‌షోలలో కేటీఆర్ పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు మొదలయ్యే కేటీఆర్ రోడ్ షోలు రాత్రి ఏడు గంటల వరకు కొనసాగుతాయి. ఉదయం జిల్లాల్లో సాయంత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగే రోడ్ షోల్లో కేటీఆర్ ప్రసంగిస్తారు. 21 నుంచి 28వ తేదీ వరకు ప్రచార గడువు ఉండటంతో అవసరమైన చోట కేటీఆర్ రోడ్‌షోలు ఉంటాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మంత్రి హరీశ్‌రావుతో పాటు మరో 35 మంది స్టార్ క్యాంపెయినర్లు కూడా అవసరమైన చోట రోడ్‌షోలు, సభల్లో పాల్గొనేలా షెడ్యూలు సిద్ధం చేస్తున్నారు.

తేదీ	రోడ్‌షో/నియోజకవర్గం
నవంబర్ 15	కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ
నవంబర్ 16	వికారాబాద్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్
నవంబర్ 17	మంచిర్యాల, బెల్లంపల్లి, ఖానాపూర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్
నవంబర్ 18	రామగుండం, కొత్తగూడెం, నాంపల్లి, గోషామహల్
నవంబర్ 19	భద్రాచలం, ఇల్లందు, ఖమ్మం, అంబర్‌పేట, ముషీరాబాద్
నవంబర్ 20	ఆలేరు, మిర్యాలగూడ, ఉప్పల్, ఎల్‌బీనగర్

కాంగ్రెస్ వస్తే.. ఆరు నెలలకో సీఎం



తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- హైదరాబాద్ అభివృద్ధి ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది: మంత్రి కేటీఆర్
- తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సమావేశంలో ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం మాజీ మంత్రి జానారెడ్డి సహా 11 మంది అభ్యర్థులు రెడీగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ కొత్త సీసాలో పాత సారా లాంటిది. సీల్డ్ కవర్ సీఎంలు, అంతర్గత కుమ్ములాటలు నిత్యకృత్యం. కాంగ్రెస్ ఇస్తున్న గ్యారంటీల సంగతేంటోగానీ ఆరు నెలలకో సీఎం మాత్రం గ్యారంటీ'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారమిక్కడ జరిగిన తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. సుస్థిర ప్రభుత్వం, దృఢమైన నాయకత్వం ఉంటేనే తెలంగాణ అభివృద్ధి నిరంతరంగా సాగుతుందన్నారు. 'ఎవరు అవునన్నా, కాదన్నా తొమ్మిదిన్నరేళ్లలో మాకు నికరంగా దొరికిన ఆరున్నరేళ్లలో అసాధారణ విజయాలు సాధించాం. తెలంగాణ భూతల స్వర్గమైందని చెప్పడం లేదు. సమస్యలు నిరంతరం ఉంటూనే ఉంటాయి. వాటిని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత. కేసీఆర్ ప్రజల మనిషి, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ నేడు దేశానికి దిక్సూచీగా మారింది. మా పార్టీ ఎమ్మెల్యేలపై అక్కడక్కడా అసంతృప్తి ఉన్నా బీఆర్ఎస్‌కే ఓటర్లు మద్దతు పలుకుతారు. మేము దైవాంశ సంభూతులం కాదు. అందరినీ సంతృప్తపరచడం సాధ్యం కాదు. ఏ రకమైన ప్రభుత్వం కావాలో మీరే ఎంచుకోండి'అని కేటీఆర్ పేర్కొన్నారు.

మరింత వేగంగా అభివృద్ధి చేస్తాం

'హైదరాబాద్‌లో అభివృద్ధి ఇప్పటి దాకా చేసింది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. వచ్చే ప్రభుత్వంలో మరింత వేగంగా హైదరాబాద్ అభివృద్ధి చేసి చూపిస్తాం. 332 కి.మీ. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడంతోపాటు ఔటర్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు నడుమ కొత్త హైదరాబాద్‌ను నిర్మిస్తాం. గత రెండున్నర దశాబ్దాల్లో అభివృద్ధి కోణంలో తెలంగాణపై ప్రభావం చూపిన వారు వైఎస్, చంద్రబాబు, కేసీఆర్ మాత్రమే'అని కేటీఆర్ అన్నారు. కర్ణాటక పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు ఉంది. అక్కడి కొత్త ప్రభుత్వం బిల్డర్లపై విధించిన స్పెషల్ ట్యాక్స్ 40 నుంచి 400 శాతానికి పెరిగింది. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తేనే తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి కళ్లకు కనబడుతుంది'అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, రాఘవరావు, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (డిక్కీ) ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు.

క్లుప్తంగా...

ప్రశ్నార్థకంగా బీఆర్‌ఎస్ పార్టీ వైఖరి

కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారీ



సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోరుతూ ఉద్యమాలు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ వైఖరి ప్రశ్నార్థకంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారీ అభిప్రాయపడ్డారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రాష్ట్రాలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరించినప్పుడు వ్యతిరేకించకుండా మద్దతు పలికిందని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉండాలనే దురాలోచన తప్ప రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తిని గౌరవించాలని, కాపాడుకోవాలనే శ్రద్ధ బీఆర్‌ఎస్‌కు లేదని మండిపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఏఐసీసీ సమన్వయకర్త రమణి, టీపీసీసీ అధికార ప్రతినిధి వచనకుమార్‌లతో కలిసి మనీశ్ తివారీ మాట్లాడారు. తెలంగాణలో కుటుంబ పాలన నడుస్తోందని, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన బీఆర్‌ఎస్ అన్ని ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడుతోందని, చివరకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో కూడా ఆ పార్టీ నేతలు కమీషన్లు తిన్నారని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వానికే గ్యారంటీలేదు

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే చంద్రప్ప



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే గ్యారంటీ లేదని కేఎస్‌ఆర్టీసీ మాజీ చైర్మన్, ఆ రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే చంద్రప్ప వ్యాఖ్యానించారు. మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీల హామీ ఇచ్చిందని, కానీ అక్కడి ప్రభుత్వంలో ఐదు గ్రూపులు ఏర్పడి కొట్టుకుంటున్నాయని చెప్పారు. ఆ ప్రభుత్వం ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చని జోస్యం చెప్పారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీలు ఇచ్చి మోసం చేసిందని, అన్ని బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పి, ఇప్పుడు ఆర్డినరీ బస్సులకే పరిమితం చేశారని అన్నారు. ఉచిత కరెంటు, పదికిలోల బియ్యం జాడే లేదన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ హామీలతో మోసపోవద్దని, కేసీఆర్ సర్కారు ప్రభుత్వ భూములను అమ్మి పాలన సాగిస్తోందని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ అట్టర్ ఫ్లాప్ అయిందని అన్నారు.

కాళేశ్వరం అక్రమాలపై సీబీఐతో విచారణ చేపట్టాలి

ఎస్‌ఈసీకి ఏఐసీసీ సభ్యుడు జి.నిరంజన్ వినతి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ చేపట్టాలని ఏఐసీసీ సభ్యుడు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ జి.నిరంజన్ ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జరిగిన భారీ నష్టం భారత ఎన్నికల సంఘం పరిధిలోకి వస్తుందని, ఈనెల 30న ఓటు వేసే సమయంలో తగిన నిర్ధారణకు రావడానికి ప్రస్తుత ప్రభుత్వ చర్యలు, సంబంధిత వాస్తవాలు ఓటర్లకు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు, ప్రభుత్వ ఖజానాకు జరిగిన భారీ నష్టాన్ని కప్పిపుచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి ఫిర్యాదు చేస్తే ఆ ప్రతిని సీఎస్‌కు ఫార్వర్డ్ చేయడం దురదృష్టకరమని, ఈ విషయంలో సీఎస్ ఎలాంటి చొరవ తీసుకున్నట్లు ఇప్పటి వరకు సమాచారం లేదని నిరంజన్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న మేడిగడ్డ బ్యారేజీ, అన్నారం బ్యారేజీలో లోపాలున్నాయని, వీటి ప్రభావంతో బహుళ రాష్ట్రాల శాఖలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంస్థాగత రుణాల ఏజెన్సీలకు భారీ నష్టం వాటిల్లుతుందని నిరంజన్ చెప్పారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎత్తి చూపుతా'



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర ద్వారా ప్రజల వద్దకు వెళ్తున్నానని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేశానని పదేపదే చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్‌లో మొత్తం 144 నామినేషన్లు దాఖలయ్యాయంటేనే ఆయనపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ఓడిపోతారని ప్రజలే అంటున్నారని చెప్పారు. గత పదేళ్లుగా బీసీలకు ఏమీ చేయలేని బీజేపీ ఇప్పుడు తెలంగాణలో బీసీ సీఎం అంటోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా జోడోయాత్ర చేసి బీసీల సమస్యలు తెలుసుకున్నారని, అందుకే బీసీ జనగణన చేయాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని వీహెచ్ ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ మళ్లీ గెలిస్తే నిరుద్యోగులది అడవి బాటే

▶ మొదటి పేజీ తరువాయి

కుటుంబ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని ఆరోపించారు. రాష్ట్రం వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయని ముందు వరుసలో ఉండి పోరుసల్పిన నిరుద్యోగులు..తెలంగాణ వచ్చినా ఉద్యోగ నియామకాలు లేక వయోపరిమితి మించిపోయి, చివరకు పెళ్లిళ్లు కూడా చేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ పరీక్షల రద్దు, పేపర్‌లీక్‌ల వంటి దుష్పరిణామాలతో ఆత్మస్థైర్యం కోల్పోతున్న నిరుద్యోగులు ఆత్మహత్యల వైపు పయనిస్తున్నారన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించకపోతే నిజాం పాలనను కేసీఆర్ పునరావృతం చేస్తారని ఆరోపించారు. గజ్వేల్ భూములు కొల్లగొట్టి ఇప్పుడు కామారెడ్డికి వస్తున్నారని, దేశమంతా కామారెడ్డి ప్రజల తీర్పు కోసం ఎదురుచూస్తోందని అన్నారు. మంగళవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని లక్ష్మీపురంలో జరిగిన విజయభేరి సభల్లో, కామారెడ్డి జిల్లాలో పలు కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు.



వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని మామునూరు, తిమ్మాపురం రోడ్డులోని లక్ష్మీపురం మైదానంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభకు హాజరైన జనం

మీ కరెంట్ ఊడగొడతాం..ఫ్యూజులే ఉండవు

'త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ దొర కాళ్ల కింద నలిగిపోతోంది, నీళ్లు, నిధులు, నియామకాలు అని తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చెప్పిండు. కానీ కాళేశ్వరం పూర్తి కాకముందే మేడిగడ్డ కుంగింది, అన్నారం పగిలింది, సుందిళ్లకు దిక్కులేదు. లక్ష కోట్లు దిగమింగి పేక మేడలు కట్టిండు. నిజంగా ప్రమాదంతోనే ప్రాజెక్టు కూలితే ప్రజలకు ఎందుకు చూపించవు? కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని కేసీఆర్ అంటుండు. మూడోసారి మాకు అవకాశం ఇవ్వండి.. మా మనువడిని మంత్రి చేసేది ఉందని అంటుండు.. బిడ్డా కాంగ్రెస్ రాగానే నీతో పాటు కేటీఆర్, హరీశ్, సంతోష్, దయాకర్‌రావు, కవితారావుల కరెంట్ ఊడగొడతాం...మీకు ఫ్యూజ్‌లే ఉండవు.మీ మోటార్లు కాలుతాయ్.. మీ ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతాయ్..' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

పులిని షికారు చేసేందుకు వచ్చిన వేటగాణ్ని..

'పేదలు నివాసం ఉండేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వని కేసీఆర్.. గజ్వేల్‌లో 600 గదులతో గడీని నిర్మించుకుండు. జన్వాడలో 100 ఎకరాలలో కోట్లు ఖర్చు పెట్టి ఒక గడీని కట్టుకుండు. ప్రజల రక్తాన్ని తాగుతున్న పులిని షికారు జేసేందుకు వచ్చిన వేటగాణ్ని నేను. గజ్వేల్ భూములను కొల్లగొట్టిన కాలకేయ ముఠా ఇప్పుడు కామారెడ్డి మీద కన్నేసింది. ఇక్కడి ప్రజలకు చెందిన విలువైన భూములను కొల్లగొట్టేందుకు వస్తున్నరు. వాళ్ల బారి నుంచి కాపాడేందుకు ఇక్కడికి వచ్చిన. మీరు అండగా నిలవండి. మీ భూములకు రక్షకుడిగా నేనుంటా. కామారెడ్డి ప్రాంత ప్రజలు ఎన్నికష్టాలు పడ్డా ఏనాడూ పట్టించుకోని కేసీఆర్‌కు ఎలక్షన్లు రావడంతో తల్లి ఊరు గుర్తుకువచ్చింది. గజ్వేల్‌లో ఓడిపోతా అనుకుంటే సిద్దిపేటకో, సిరిసిల్లకో పోకుండా కామారెడ్డికి రావడంలోనే మతలబు ఉంది. ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కామారెడ్డి రైతుల భూములపై కన్నేస్తే, కనుగుడ్లను పీకి గోలీలాడుతాం..' అని హెచ్చరించారు.

కేసీఆర్ పండించిన వడ్లకు రూ.4,250?

'రాష్ట్రంలో రైతులు పండించిన వడ్లను క్వింటాల్ రూ.2 వేలకు కొనే దిక్కులేదు. అదే సీఎం కేసీఆర్ ఫాం హౌస్‌లో పండించిన వడ్లను క్వింటాల్‌కు రూ.4,250 చొప్పున ఓ సీడ్స్ కంపెనీ తీసుకుంది. దీనిపై రాజరాజేశ్వర స్వామి గుడిలో ప్రమాణం చేసేందుకు సిద్ధమా.?' అని రేవంత్ సవాల్ చేశారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలంటే కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా సభల్లో ఏఐసీసీ అబ్జర్వర్ అరవింద్ కుమార్ బాల్వి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్‌అలీ, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, శోభారాణి, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

'నెల్లికల్లు'పై లొల్లి

బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల ఘర్షణ



రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులతో బీఆర్‌ఎస్ నేతల వాగ్వాదం

తిరుమలగిరి (నాగార్జునసాగర్), సాక్షి, హైదరాబాద్: నందికొండ నుంచి హాలియా, హైదరాబాద్ వెళ్లే రహదారిపై నెల్లికల్లు స్టేజీవద్ద మంగళవారం మధ్యాహ్నం ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీఎం కేసీఆర్ హాలియా సభకు వస్తుండటంతో.. నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను సకాలంలో పూర్తి చేయలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన శిలాఫలకం వద్ద ఆ పార్టీ నాయకులతో కలిసి ఖాళీ కుర్చీతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ నాగార్జునసాగర్ అభ్యర్థి కంకణాల నివేదితరెడ్డితోపాటు కార్యకర్తలు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ హాలియాలో సభ జరపడం అన్యాయమంటూ నెల్లికల్లు స్టేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆ సమయంలోనే మండలంలోని నెల్లికల్లు, జాల్‌తండా, ఎర్రచెరువు తండాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు హాలియాలో సీఎం ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తూ.. దారి ఇవ్వాలని కోరగా అందుకు బీజేపీ నాయకులు వెళ్లనివ్వబోమంటూ అడ్డుకున్నారు. దీంతో ఇరుపార్టీల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో కోపోద్రిక్తులైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు కంకణాల శ్రీధర్‌రెడ్డిని చితకబాదారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బీజేపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ దాడులు: కిషన్‌రెడ్డి

నాగార్జునసాగర్ ఉప ఎన్నిక ప్రచారంలో నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తానని కేసీఆర్ ఇచ్చిన వాగ్దానం నేటికీ నెరవేరలేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. మంగళవారం ఎన్నికల ప్రచారానికి సీఎం కేసీఆర్ హాలియాకు వచ్చిన నేపథ్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి శాంతియుతంగా ధర్నా చేస్తుండగా ఆయనపై బీఆర్‌ఎస్ గూండాలు దాడి చేశారని అన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయామన్న అసహనంతో బీజేపీ కార్యకర్తలపై బీఆర్‌ఎస్ దాడులకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు భౌతిక దాడులకు దిగుతున్నారన్నారు.

మరోసారి హైకోర్టుకు ఫిరోజ్‌ఖాన్..

సాక్షి, హైదరాబాద్: నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా నుంచి బోగస్, ఇతర ప్రాంతాలకు మారిన, చనిపోయిన వ్యక్తుల పేర్లను తొలగించడానికి ప్రత్యేక సవరణ చేపట్టేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ హైకోర్టులో గత నెల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు నివేదించుకోవచ్చని, పరిశీలించి మార్పులు చేసే అధికారం ఆయనకు ఉందని స్పష్టం చేసింది. తుది జాబితా ప్రచురించిన తర్వాత ఓటర్ల జాబితాపై అభ్యంతరం తెలుపుతూ ఈ నెల 3న, 8న ఫిరోజ్‌ఖాన్ ఈసీకి వినతిపత్రం సమర్పించారు. అయినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆయన మరోసారి కోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను 20వ తేదీకి వాయిదా వేసింది.

కాంగ్రెస్‌లో రె'బెల్స్'

▶ మొదటి పేజీ తరువాయి

మంతనాలు జరిపి వారి నామినేషన్లను ఉపసంహరింపజేసే బాధ్యతలను రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు పార్టీ అప్పగించింది. దీంతో వీరందరినీ హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానించారు. వీరిలో నలుగురైదుగురు మాత్రమే అందుబాటులోకి రాగా, మిగిలిన వారితో ఠాక్రే, మహేశ్‌గౌడ్ ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. దీనిపై మహేశ్‌కుమార్‌గౌడ్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. రెబెల్స్‌గా బరిలోకి దిగిన పార్టీ నాయకులందరితో మాట్లాడామని, అందరూ సర్దుకుంటారని చెప్పారు. బుధవారం సాయంత్రానికి మెజార్టీ నాయకులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంత ప్రయత్నించినా...

టికెట్లు ఆశించే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో కాంగ్రెస్ నెల రోజులుగా బుజ్జగింపు యత్నాలు చేస్తూనే ఉంది. టికెట్లు రాని వారితో సంప్రదింపులు జరిపేందుకు సీనియర్ నేత జానారెడ్డి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీతోపాటు ఏఐసీసీ నుంచి సమన్వయకర్తలుగా వచ్చిన దీపాదాస్ మున్షీ, జ్యోతిమణి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేలు టికెట్లు దక్కవని తెలిసిన వారితో మంతనాలు జరిపి వారికి భవిష్యత్తుపై భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇక, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు 15 మంది నేతలతో సమావేశమై బుజ్జగించారు. ఇన్ని ప్రయత్నాలు చేసిన తర్వాత కూడా 20 మందికి పైగా రెబెల్స్ నామినేషన్లు వేశారు. వీరిలో ఓ 10 మంది వెనక్కు తగ్గినా, మరో 10 మంది బరిలో ఉండే అవకాశముందని తెలుస్తోంది. వీరిలో ఎంతమంది బరిలో ఉంటారు? ఎంత మంది ఉపసంహరించుకుంటారనే దానిపై బుధవారం సాయంత్రానికి స్పష్టత రానుంది.

పార్టీలు మారిన చాలా మంది

రెబెల్స్‌గా నామినేషన్లు వేసిన వారితోపాటు చివరి క్షణంలో పార్టీలు మారిన వారి నుంచి ఎలాంటి ముప్పు వస్తుందోననే ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది. మునుగోడు నుంచి ముషీరాబాద్ వరకు, ఆదిలాబాద్ నుంచి నకిరేకల్ వరకు 20కి పైగా నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఇటీవలే పార్టీ నుంచి వెళ్లిపోయారు. వీరిలో తక్కువ మంది బీజేపీలోకి వెళ్లగా, మెజార్టీ నేతలు గులాబీ కండువాలు కప్పుకున్నారు. చివరి క్షణం వరకు టికెట్ రేసులో ఉండి పార్టీ నుంచి వెళ్లిపోయిన నేతలు కాంగ్రెస్‌ను ఓడించాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారు. వీరికితోడు మరో 10 మంది వరకు రెబెల్స్ బరిలో ఉండే అవకాశాలుండటంతో టికెట్ల 'అసంతృప్తి'పార్టీ పుట్టి ముంచుతుందేమోనన్న ఆందోళన నేతల్లో వ్యక్తమవుతోంది.



రెబెల్ అభ్యర్థితో మాట్లాడుతున్న ఠాక్రే, మహేశ్‌కుమార్‌గౌడ్

మరింత సమన్వయంతో ముందుకు...

- కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్ నేతల భేటీలో నిర్ణయం
- హాజరైన ఠాక్రే, చాడ, పి.ఎల్.విశ్వేశ్వరరావు
- ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అధికారికంగా పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్‌లు మరింత సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయించాయి. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మూడు పార్టీల కేడర్, నేతలను సమన్వయం చేసుకునేందుకు కమిటీలను ఏర్పాటు చేసుకోనున్నాయి. ఈ మేరకు మంగళవారం న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మూడు పార్టీల నేతలు సమావేశమయ్యారు. మాణిక్‌రావ్‌ఠాక్రే, మహేశ్ కుమార్‌గౌడ్ (కాంగ్రెస్), చాడ వెంకట్‌రెడ్డి, బాల మల్లేశ్ (సీపీఐ), ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు (టీజేఎస్) తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, తమ కూటమి గెలుపు అంచనాలు, ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ రెండు వారాల సమయం చాలా కీలకమని, మూడు పార్టీల నాయకత్వం కలిసికట్టుగా పని చేసి బీఆర్‌ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడించేలా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఏ స్థాయిలోనూ మూడు పార్టీల కేడర్, నేతల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, ఎన్నికల ప్రచారంలో మూడు పార్టీలు కలిసి పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించారు.

రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు: మూడు పార్టీల నాయకులు ముకుమ్మడిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ కన్వీనర్‌గా బి. మహేశ్‌కుమార్‌గౌడ్ (టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్)ను నియమించారు. ఈయనతో పాటు మరో ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. చాడ వెంకట్‌రెడ్డి, బాల మల్లేశ్, ఈటి నర్సింహ (సీపీఐ), కోదండరాం, పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు, రమేశ్ (టీజేఎస్)లను కూడా కమిటీ సభ్యులుగా నియమించారు. రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన తరహాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కూడా కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్ నేతల సమావేశంలో నిర్ణయించారు.



మంగళవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సమావేశమైన ఠాక్రే, మహేశ్‌కుమార్‌గౌడ్, చాడ, పీఎల్ విశ్వేశ్వరరావు తదితరులు

కర్ణాటకలో సాఫీగా విద్యుత్ సరఫరా

- విద్యుత్ విషయంలో తెలంగాణ, కర్ణాటకకు వ్యత్యాసం
- తెలంగాణలో అధికారం మాదే... కర్ణాటక మంత్రి దినేశ్ గుండూరావు



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరా విషయంలో తెలంగాణలోని పరిస్థితులు, కర్ణాటక పరిస్థితులకు చాలా తేడా ఉందని ఆ రాష్ట్ర మంత్రి దినేశ్ గుండూరావు వ్యాఖ్యానించారు. అయినా కర్ణాటకలో రైతాంగానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ ఇస్తున్నామని, అక్కడ ఎలాంటి సమస్య లేదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ సమన్వయకర్తలు మెహ్రాజ్, రమణిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను మూడు నెలల్లోనే అమలు చేశామని చెప్పారు. సాధారణ పౌరులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నామని, బీఆర్‌ఎస్ నేతలు మాత్రం కర్ణాటక రైతుల పేరుతో తెలంగాణలో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలకు ఎలాంటి సందేహం ఉన్నా కర్ణాటక వస్తే స్వాగతిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నా పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంతో బీజేపీ వెళ్తే.. వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచి తమ సత్తా ఏంటో చూపించామని, ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజల మనిషి 'వట్టికోట'

చిక్కడపల్లి: తెలంగాణ సాయుధ పోరాటంలో భాగస్వామిగా..దాశరథి అనుంగు మిత్రుడిగా నైజాం నిరంకుశ కాలంలో జైలు జీవితం గడిపిన వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి అని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహిస్తున్న శతాబ్ది పూర్వ 'మహనీయుల యాది'లో భాగంగా మంగళవారం వట్టికోట ఆళ్వారుస్వామి సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామోదర్ మాట్లాడుతూ వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన 'ప్రజల మనిషి' నవల నాటి తెలంగాణ ఆర్థిక సామాజిక రాజకీయ పరిస్థితులకు దర్పణం అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ఆయన నిరంతర కృషి చిరస్మరణీయం అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో జర్నలిస్ట్ జయసూర్య మాట్లాడుతూ వట్టికోట జీవితం అంతా పోరాట ఉద్యమాలమయం అన్నారు. పేదరికం అనుభవిస్తూ కూడా ప్రజల పక్షాన నిలిచిన మహావ్యక్తి అని కొనియాడారు. కళా పోషకుడు గుదిబండి వెంకట్‌రెడ్డి పాల్గొన్న వేదికపై చక్రపాణి తాళ్ళపల్లి వందన సమర్పణ చేశారు.

రాబోయే వ్యాధులకు ముందే చెక్!

▶ మొదటి పేజీ తరువాయి

బయటపడక ముందే కచ్చితంగా అంచనా వేయగల సామర్థ్యాన్ని సంతరించుకొనే క్రమంలో బయోబ్యాంక్ ఏర్పాటును మైలిమలుపుగా లెరోయ్ హుడ్ అభివర్ణించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ బయాలజీ ప్రెసిడెంట్, కో-ఫౌండర్ అయిన హుడ్... హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్టుకు మార్గం సుగమం చేసిన ఆటోమేటెడ్ జీన్ సీక్వెన్సర్‌ను గతంలో కనుగొన్నారు.

ఇదో మైలురాయి: ఏఐజీ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి

వైద్య పరిజ్ఞానాన్ని, ఆరోగ్య సంరక్షణలో పురోగతిని పెంపొందించే దిశగా బయోబ్యాంక్ ఓ మైలురాయి కాగలదని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశోధకులు, వైద్యులు, శాస్త్రవేత్తలకు కీలక వనరుగా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. తమ బయోబ్యాంక్‌కు 3 లక్షల కంటే ఎక్కువ నమూనాలను నిల్వ చేయగల సామర్థ్యం ఉందని వివరించారు. వ్యాధుల నివారణకు తోడ్పడే ఔషధ రంగంలో ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి బయోబ్యాంక్ ఏర్పాటు సహకరిస్తుందని చెప్పారు. దీనిద్వారా వచ్చే 5–10 ఏళ్ల వరకు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వేలాది మంది రోగులతోపాటు ఆరోగ్యకరమైన వ్యక్తుల వివరాలను సేకరించి వారి జీవ నమూనాలను విశ్లేషిస్తామని వివరించారు.

వ్యాధుల నిర్ధారణ, నివారణలో విప్లవం...

బయోబ్యాంక్ అనేది ఒక రకమైన నిల్వ సౌకర్యం. ఇది 3 లక్షల కంటే ఎక్కువ మానవ కణజాల నమూనాలను 15 ఏళ్లకుపైగా నిల్వ ఉంచగలదు. మానవ కణజాల నమూనాల నిల్వ, విశ్లేషణ ద్వారా ఇది జన్యు పరిశోధనలో సహాయపడుతుంది. సంక్లిష్ట వ్యాధుల చికిత్స రానురానూ కష్టతరంగా మారుతున్న పరిస్థితుల్లో వ్యాధుల రాకను ముందే పసిగట్టే అద్భుతమైన అవకాశాన్ని ఇది అందిస్తుంది. దీనికోసం వ్యక్తుల కణజాల నమూనాలను సేకరిస్తారు. వాటిని నిల్వ చేసి పదేళ్లపాటు వారి ఆరోగ్య స్థితిగతుల్ని నిశితంగా పర్యవేక్షిస్తారు. ఆ సమయంలో ఆయా వ్యక్తుల్లో ఆరోగ్యపరంగా చోటుచేసుకున్న మార్పుచేర్పుల్ని, వ్యాధుల దాడిని, వాటికి కారణాలను పసిగట్టడం ద్వారా వారసుల ఆరోగ్య స్థితిగతుల్ని అంచనా వేస్తారు. అలాగే దాదాపుగా అదే కణజాలానికి దగ్గరగా ఉన్న వ్యక్తులందరికీ భవిష్యత్తులో వచ్చే వ్యాధులను కూడా పసిగట్టే అవకాశం లభిస్తుంది. తద్వారా వ్యాధి రావడానికి ముందే నివారణ ప్రక్రియ ప్రారంభించేందుకు వీలవుతుంది.



బయో బ్యాంక్ ప్రారంభోత్సవంలో లెరోయ్ హుడ్, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు

బయో బ్యాంక్ ఎలా సహాయపడుతుందంటే?

వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు ఆరోగ్యకరమైన వ్యక్తుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తుంటారు. ఆ రక్తనమూనాలను ఈ బయో బ్యాంకులో నిల్వ ఉంచుతారు. వైద్యపరిశోధకులు ఈ వలంటీర్లతో దీర్ఘకాలం పాటు ఫాలోఅప్‌లో ఉంటారు.

ఉదాహరణకు... ఏదైనా వైద్యశిబిరంలో వంద మంది ఆరోగ్యవంతుల నుంచి రక్తం సేకరించారనుకుందాం. ఓ పదేళ్ల తర్వాత ఇందులోని ఓ ఇద్దరికి ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే... అప్పుడు ఆ బాధితుల రక్తాన్నీ, ఆరోగ్యవంతుల రక్తంతో సరిపోల్చి మరిన్ని పరిశోధనలు చేస్తారు. సునిశితమైన ఈ పరిశోధనల్లో ఆరోగ్యవంతుల శాంపిల్‌తో సరిపోలుస్తూ పరిశీలిస్తారు. ఇందులో ఫలానా జబ్బు వచ్చినప్పుడు బాధితుల్లో కనిపిస్తున్న తేడాలేమిటి అనే విషయాలను చూస్తారు. వాటికి కారణమవుతున్న అంశాలేమిటనే దిశగా కూడా పరిశోధనలు సాగుతాయి. వలంటీర్లతో పరిశోధకులు టచ్‌లో ఉన్నందున... ఇంత కాలం గడిచాక... బాధితుల్లో వచ్చిన మార్పుల్లాంటివే మిగతావాళ్లలో ఏమైనా కనిపిస్తున్నాయా అని కూడా చూస్తారు. అలాంటి మార్పులు కనిపిస్తుంటే... వాళ్లకు కూడా భవిష్యత్తులో ఫలానా సమస్య రావచ్చేమోనని అంచనా వేస్తారు. ఏదైనా చికిత్స ద్వారా కణస్థాయిలోనే దాన్ని తప్పించేందుకు అవకాశముందేమో అనే విషయాలను కూడా పరిశోధనల ద్వారా తెలుసుకుంటారు.

రెండు ప్రయోజనాలు...

ఈ పరిశీలనలూ, పరిశోధనలతో రెండు విషయాలు తెలుస్తాయి.

- **మొదటిది...** మార్పులను బట్టి ఫలానా వ్యాధి వచ్చే అవకాశాలేమైనా ఉన్నాయేమోనని తెలుసుకుని, దాని నివారణకోసం ప్రయత్నిస్తారు.
- **రెండో విషయం...** కణంలో ఏ స్థాయిలో ఈ మార్పులు జరుగుతున్నాయో గుర్తించి, వాటిని చక్కదిద్దడం ద్వారా... జబ్బు రాబోయే ముందే కణంలోని సూక్ష్మ స్థాయిలో ట్రీట్‌మెంట్ అందించి, ఇలాంటి చికిత్సతో అసలు జబ్బు రాకముందే దాన్ని నివారించడానికి వీలవుతుందేమో కూడా పరిశోధిస్తారు.

ఇలా బయోబ్యాంకు వల్ల ఈ రెండు రకాల ప్రయోజనాలు దీర్ఘకాలంలో చేకూరతాయి.





“ నీటిని చూసి నేర్చుకోవాలి: చిన్న సెలయేరు తుళ్ళుతూ ప్రవహిస్తుంది. కానీ మహాసముద్రాల లోతు నిశ్చలంగా ఉంటుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 15 నవంబర్ 2023

మార్పుల వ్యూహంతో మేలెంత?!

మార్పు మంచికే! అయితే, అన్ని మార్పులూ మంచి చేస్తాయా? మంచిని ఆశించడమే తప్ప, ఆఖరికి ఏమవుతుందో అప్పటికప్పుడు చెప్పలేం. బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్ ప్రస్తుతం మార్పునే నమ్మారు. క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించారు. పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనలపై విరుచుకుపడిన హోమ్ మంత్రి సువెల్లా బ్రేవెర్మన్‌ను పక్కకు తప్పించారు. ఆమె స్థానాన్ని విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీకి అప్పగించారు. మాజీ ప్రధాని అయిన 57 ఏళ్ళ డేవిడ్ కామెరాన్‌ను విదేశాంగ మంత్రిగా ముందుకు తెచ్చారు. భారతీయ సంతతికి చెందిన 43 ఏళ్ళ బ్రేవెర్మన్ ఛాందసవాద, వివాదాస్పద వ్యాఖ్యలకు పేరుపడడంతో, ఆమెకు ఉద్వాసన పలికి, మధ్యేవాదానికి జై కొడుతున్నట్టు కనిపించే యత్నం చేశారు. మునుపటి లిజ్ ట్రస్ హయాం నుంచి ప్రతికూలత మూటగట్టుకున్న కన్జర్వేటివ్ పార్టీ పట్ల మళ్ళీ నమ్మకం కలిగించడానికి సునాక్‌కు ఇవి సరిపోతాయా?

కన్జర్వేటివ్ పార్టీ తన సొంత ఉనికిని కాపాడుకొనేందుకు కిందా మీదా పడుతోందనడానికి తాజా ఉదాహరణ రిషీ సునాక్ తాజా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అని విశ్లేషకుల మాట. బ్రిటన్ మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్ ఒక్కరే కాక ఇంకా పలువురు పెద్ద పదవులు నిర్వహించినవారు సైతం ఈ మంత్రివర్గ మార్పులు చేర్పుల్లో చిన్న హోదాలు చేపట్టారు. గతంలో ప్రధానమంత్రి పదవికి రేసులో నిలబడ్డ నాయకురాలు, వ్యాపార శాఖ మంత్రి అయిన డేమ్ ఆండ్రియా లెడ్‌సమ్ ఇప్పుడు జూనియర్ హెల్త్ మినిస్టర్ పదవి చేపట్టారు. అలాగే ఇంకొందరు! సునాక్ వైపు నుంచి చూస్తే – ఇది మునుపటి లిజ్ ట్రస్ హయాం వారిని కొందరినైనా వదిలించుకొని, తనదైన జట్టును నిర్మించుకొనేందుకు ఆయన చేస్తున్న యత్నంగా కనిపిస్తుంది. మరోవైపు నుంచి చూస్తే – మునుపటి లిజ్ పాలన తలనొప్పులు తేవడంతో ఏడాది క్రితం ఆ స్థానంలోకి వచ్చిన సునాక్ తన సర్కార్‌పై నమ్మకం కలిగించడంలో విఫలమయ్యారనీ, అందుకే ఈ మార్పులనీ అనిపిస్తుంది.

ప్రధానిగా పదవి చేపట్టినప్పటి నుంచి సునాక్ తరచూ కామెరాన్‌తో సంభాషిస్తున్నారనీ, వారం రోజుల క్రితమే విదేశాంగ మంత్రిగా పగ్గాలు పట్టాల్సిందిగా కోరారనీ ఒక కథనం. ఇంతలోనే బ్రేవెర్మన్ దురుసు రాతలతో రచ్చ రేగింది. చివరకు సునాక్ అనుకుంటున్న మార్పే అనివార్యంగా, ముందుకు తోసుకొచ్చింది. ‘డీసీ’గా అభిమానులు ముద్దుగా పిలుచుకొనే డేవిడ్ కామెరాన్ పునరాగమనంతో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి పాలకపక్షం చిక్కుల్లో పడి, బయటపడేందుకు మరో మార్గం లేనప్పుడు పాత కాపులను మళ్ళీ రంగంలోకి దింపి ఉన్నత పదవులివ్వడం, ఎంపీలు కాని వారిని ఎగువ సభ ద్వారా పార్లమెంట్‌లోకి తేవడం బ్రిటన్‌లో తరచూ ఉన్నదే! వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం వెన్నాడుతున్న వేళ సునాక్ సర్కార్ ఏదో ఒకటి చేయక తప్పని పరిస్థితి. అందులో భాగమే తాజా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, కామెరాన్ పునరాగమనం లాంటి చర్యలు.

మాటలతో ముగ్ధుల్ని చేయగల కామెరాన్‌ను జనం నమ్ముతారనీ, రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా మారుతుందనీ సునాక్ అంచనా. అయితే, పదకొండేళ్ళు పార్టీకి నేతగా, ఆరేళ్ళ కాలం ప్రధానిగా పనిచేసి, గత ఏడేళ్ళుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైన కామెరాన్ అనుభవం కష్టాల్లో ఉన్న పార్టీకీ, సునాక్ ప్రభుత్వానికీ ఏ మేరకు ఉపయోగపడుతుందో చూడాలి. కామెరాన్‌కు పలువురు ప్రపంచ నేతలతో స్నేహం, అంతర్జాతీయ వ్యవహారాలపై పట్టు ఉన్నాయి. భౌగోళిక రాజకీయాలన్నీ అస్థిరంగా ఉన్న వర్తమానంలో అది బ్రిటన్ ప్రభుత్వానికి ఉపయుక్తమే. కానీ, వచ్చే ఎన్నికల్లో కలిసిరావడం మాత్రం కష్టమే. కేవలం 24 శాతం మంది బ్రిటన్ వయోజనులు కామెరాన్‌కు సానుకూలంగా ఉంటే, 45 శాతం మంది ఆయనకు ప్రతికూలంగా ఉన్నారని నెల కిందటి తాజా సర్వే. వెరసి కామెరాన్‌పై సునాక్ అతిగా ఆశలు పెట్టుకుంటే నిరుత్సాహం తప్పదు.

పదమూడేళ్ళ పాటు సొంత కన్జర్వేటివ్ పార్టీయే గద్దె మీద ఉన్నాక వచ్చే ఎన్నికలు సునాక్‌కు ఏటికి ఎదురీతే. ఆయన తనను తాను మార్పుకు ప్రతిరూపంగా, స్థిరచిత్తుడిగా జనానికి చూపుకోవడం అవసరం. అందుకని మాటల్లో, రాతల్లో జాత్యహంకార, వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న బ్రేవెర్మన్‌ను పదవిలో కొనసాగిస్తే కష్టం. గతంలో పలుమార్లు మాటల తూటాలు పేల్చిన ఆమె తాజాగా పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనపై నిర్లక్ష్యంగా, నొప్పించేలా ‘ది టైమ్స్’ పత్రికలో రాశారు. ప్రధాని ఆమోదం లేని ఆ వ్యాసంతో తన కథకు తానే ముగింపు రాసుకున్నారు. స్వతంత్ర పోలీసు వ్యవస్థను తప్పుబట్టడమే కాక, నిరసనను ప్రాథమిక హక్కుగా భావించే ఆధునిక బ్రిటన్ సమాజాన్నీ దూరం చేసుకున్నారు. పదవీచ్యుతురాలయ్యారు. అయితే, రానున్న రోజుల్లో ఆమె ఊరకుంటారని అనుకోలేం. సునాక్ పాలన అనంతరం అవసరమైతే పార్టీ పగ్గాలు చేపట్టగల ఛాందస వర్గ నేతగా ఆమె తనను తాను గట్టిగా నిలుపుకొన్నారు.

అయిదేళ్ళ లోపల 650 మంది సభ్యుల దిగువ సభకు ఎన్నికలు జరగడం బ్రిటన్ విధానం. ఆ లెక్కన 2025 జనవరి 28 లోపల ఎన్నికలు జరగాలి. ఏ తేదీన జరగాలో నిర్ణయించే అధికారం ప్రధానిదే. 2011లో చట్టం తెచ్చి, దాన్ని మార్చినా, 2019 ఎన్నికల్లో విజయం తర్వాత కన్జర్వేటివ్‌లు మళ్ళీ యథాపూర్వ స్థితిని పునరుద్ధరించారు. ఆ లెక్కన పార్లమెంట్‌ను ముందే రద్దు చేసి, ఎన్నికలు జరిపించమని సునాక్ కోరినా కోరవచ్చు. ఏడాది క్రితం సునాక్ పగ్గాలు చేపట్టినప్పటితో పోలిస్తే, కన్జర్వేటివ్‌ల ప్రతిష్ఠ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అప్పటి అనుకూల వాతావరణమూ లేదు. మరి, సునాక్ చేసిన తాజా మార్పులు ఎన్నికల నాటికి అద్భుతాలు చేయగలవా? ఏమో గుర్రం ఎగరావచ్చు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** శు.విదియ ప.1.50 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** జ్యేష్ఠ తె.4.01 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.9.44 నుండి 11.19 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.21 నుండి 12.07 వరకు, **అమృత ఘడియలు:** రా.7.13 నుండి 8.52 వరకు, భగినీహస్త భోజనం.

సూర్యోదయం : 6.08
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

మొత్తం మానవాళికే సమస్య!

విశ్లేషణ



దొంతి నరసింహా రెడ్డి

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌లో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు ‘కాప్ 28’ సదస్సు జరగనుంది. పూర్వ సగటు ఉష్ణోగ్రతల కంటే 2023లో 1.4 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. వాతావరణ మార్పుల సదస్సు కోసం ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములు సమావేశమవుతున్నప్పుడు, ఇంతకంటే కీలక సమస్య వేరేదీ లేదు. ఇప్పటికే, ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, సిక్కిం తదితర రాష్ట్రాలలో వరద బీభత్సం విదితమే. దేశమంతటా వర్షాలు సకాలంలో పడలేదు. వ్యవసాయ రంగం తీవ్ర ఒత్తిడిలో ఉన్నది. పంటల విస్తీర్ణం, దిగుబడి మీద వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది.

వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ (యూఎన్‌ఎఫ్‌సీసీసీ) లోని అన్ని సభ్యత్వ పక్షాలు దుబాయ్‌లో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు సమావేశం కానున్నాయి. 2015 పారిస్ ఒప్పందం ప్రకారం తొలి ‘గ్లోబల్ స్టాక్ టేక్’ (జీఎస్టీ) పూర్తి చేయడం ఈ సమావేశంలో మొదటి ప్రధాన అంశం. పారిస్ ఒప్పందం లక్ష్యాలను సాధించే దిశగా సమష్టి పురోగతిని అంచనా వేయడం, ముఖ్యంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు, అడాప్టేషన్ ప్రయత్నాల పురోగతి, నిధుల ప్రవాహం అంచనా వేయడం ఈ జీఎస్టీ లక్ష్యం. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మదింపు తదుపరి పర్యావరణ, వాతావరణ మార్పుల నేపథ్యంలో తీసుకునే చర్యలకు మార్గనిర్దేశం చేయడానికి ఉద్దేశించబడింది.

శిలాజ ఇంధనాల వినియోగం తగ్గేనా?

2023 సెప్టెంబర్‌లో విడుదలైన మొదటి జీఎస్టీ అధ్యయన ఫలితం, స్పష్టంగా ఉన్నది: ప్రపంచం మొత్తం అనుకున్న లక్ష్యం నుంచి దారి తప్పింది. ఈ నేపథ్యంలో దుబాయ్‌లో జరగనున్న ‘కాప్ 28’(కాన్ఫరెన్స్ ఆఫ్ ద పార్టీస్– భాగస్వామ్య పక్షాల 28వ సమావేశం)లో దీని దిద్దుబాటు మీద చర్చ జరుగుతుందని ఆశిస్తున్నారు. అనేక చర్యల మీద ఏకాభిప్రాయం లేదు. ఈ నివేదిక వల్ల కొన్ని చర్యల పైన విశాల ఒప్పందాలు జరుగుతాయని అంచనా. ప్రధానంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మూడింతలు చేయాలనే లక్ష్యం ఒకటి కాగా, శిలాజ ఇంధనాల వినియోగం దశల వారీగా తగ్గించే లక్ష్యం పైన చర్చలు వివాదాస్పదంగా ఉన్నాయి. దుబాయ్ సమావేశం అధ్యక్షుడు ఒక చమురు కంపెనీ అధిపతి అయిన నేపథ్యంలో చమురు ఉపయోగం తగ్గించడానికి చర్చలు జరుగుతాయా అన్న అనుమానాలు ఉన్నాయి.

రెండవ పెద్ద అంశం, ‘నష్టం మరియు హాని’. పేద దేశాలు, వెనుకబడిన దేశాల మీద వాతావరణ మార్పుల ప్రభావం ఎక్కువ ఉండడంతో భూగోళ కాలుష్యానికి కారక దేశాలు నష్ట పరిహారం అందించాలని చర్చలు జరుగుతున్నాయి. గత కాప్ 27 సమావేశంలో ఆఫ్రికన్ దేశాలు పట్టుబట్టి నష్టం మరియు హాని పరిహార నిధి ఏర్పాటును తీర్మానం చేశాయి. అటువంటి నిధిని ఏర్పాటు చేయాలనే నిర్ణయం ఆ సమావేశ పురోగతిగా వర్ణించారు. ఈ కీలక నిర్ణయం తీసుకున్నా, దాని ఏర్పాటు విషయం దశలలో తేలాల్సి ఉంది. ఇప్పటికే గత ఏడాది నుంచి ఈ విషయం మీద సమావేశాలు జరుగుతున్నాయి. పురోగతి ఆశాజనకంగానే ఉన్నది. కర్బన ఉద్గారాల వల్ల భౌగోళిక కాలుష్యం పెరిగి, సగటు ఉష్ణోగ్రత పెరిగి, వాతావరణ మార్పులు జరిగి నష్టపోతున్న దేశాలు, ప్రాంతాలు వాటిని ఎదుర్కొనే ప్రతి చర్యల మీద నిధులు సొంతంగా పెట్టుకునే సామర్థ్యం లేక ఈ ప్రపంచ నిధి గురించి ఆలోచించాయి. భారత దేశంలో ఇటీవల



హిమాచల్ ప్రదేశ్‌లో విపరీత వర్షాల వల్ల నదీ ప్రవాహం పెరిగి కొన్ని ఆనకట్టలు కొట్టుకుపోయి జరిగిన ఆస్తి నష్టం అంచనా లక్ష కోట్ల రూపాయలు. ఇటువంటి నష్ట భర్తీకి, పునర్నిర్మాణానికి సొమ్ములు ప్రపంచ నిధి నుంచి ఇవ్వాలని ఆశిస్తున్నారు. కానీ ఆ నిధికి డబ్బులు ఎవరు, ఎంత ఇవ్వాలి అనే విషయం నుంచి ఎవరికి, ఏ విధంగా, ఎంత ఇవ్వాలి అనే వరకు చర్చలు జరుగుతున్నాయి. అన్ని ప్రాథమిక దశలోనే ఉన్నాయి. నష్ట పరిహార నిధి పూర్తి స్థాయి ఏర్పాటుకు కనీసం 5 ఏళ్లు పడుతుందని అంచనా. వేగంగా నిర్ణయించాలని పేద దేశాల ఆకాంక్ష. ధనిక దేశాలకు ఈ నిధి ఏర్పాటు ఇష్టం లేదు. అది తమ ఆర్థిక రంగం మీద భారం అవుతుంది అని వారి భావన.

ఆహార, ఆరోగ్యాలపై ప్రభావం

2023 అంతటా వివిధ రూపాల్లో (రెండవ గ్లాస్గో సంభాషణ, ప్రత్యేక వర్క్ షాప్‌లు, మంత్రుల సంప్రదింపులతో సహా) దీనిపై చర్చలు జరిగాయి. కాల పరిమితులతో కూడిన లక్ష్యసాధన, అర్హత ప్రమాణాలు, ఆర్థిక వనరులు వంటి విషయాలపైన ఆలోచనలను రూపొందించడానికి ఒక పరివర్తన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ పని చిన్నదేమీ కాదు. గ్రీన్ క్లైమేట్ ఫండ్ పూర్తిస్థాయిలో పనిచేయడానికి ఐదేళ్లు పట్టింది. పరివర్తన కమిటీ పని తీరును పరిశీలిస్తే, పరిష్కరించవలసిన సాంకేతిక అంశాలు మాత్రమే కాకుండా, విభేదాలను పరిష్కరించడానికి రాజకీయ మార్గదర్శకత్వం అవసరమని తెలుస్తుంది.

యూఎన్‌ఎఫ్‌సీసీసీ కన్వెన్షన్, క్యోటో ప్రోటోకాల్, ప్యారిస్ ఒప్పందం, ఎస్బీఐ, ఎస్బీఎస్టీఏలకు సంబంధించిన ఐదు భారీ అంశాలతో పాటు అనేక ఇతర సమస్యలను కాప్ 28 ప్రస్తావించాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో కాప్ 28 సమావేశ అధ్యక్ష (యూఏఈ) పాత్ర కీలకం అని భావిస్తున్నారు. ప్రత్యేకంగా శిలాజ ఇంధనాల ఉత్పత్తిని ఎలా పరిష్కరిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొన్నది. వాతావరణ మార్పులకు, ఆహారం, ఆరోగ్యానికి మధ్య ఉన్న పరస్పర సంబంధాలను అర్థం చేసుకుని, తగిన చర్యల మీద దృష్టి పెంచడానికి ఈ సదస్సు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.



స్థూలంగా, వాతావరణ మార్పుల సదస్సు అంటే కేవలం చెట్లు, అడవులు, కాలుష్యం గురించే కాదు. ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ అభివృద్ధి విధానాలు, ఆర్థిక విధానాలు, ఉత్పత్తి పద్ధతులు, జీవన శైలి మార్పులతో సహా సమస్త మానవాళి చర్యల మీద చర్చలు జరుగుతున్నాయి. ఇందులో సామాజిక న్యాయం, సమానత్వం, సహకారం, గౌరవం, మానవ హక్కులు వంటి సూత్రాలు విధిగా ఉంటాయి.

భారతదేశం పాత్ర

భారతదేశం వహించే పాత్ర కూడా అనేక అంతర్జాతీయ సమావేశాల మాదిరిగానే కాప్ 28 సదస్సులో కూడా ముఖ్యమైన అంశంగా మారుతున్నది. నిర్ణయాలు తీసుకోవడానికి, ఏకాభిప్రాయ సాధనకు, అంతర్గతంగా ఎదురు అవుతున్న ప్రకృతిపరమైన నష్టాలకు భారత ప్రతినిధి వర్గం పని తీరును కూడా నిశితంగా గమనించాల్సి ఉన్నది. ఈ ప్రతినిధి వర్గంలో ఎవరు ఉంటారు, వారికి ప్రభుత్వం ఇచ్చిన సందేశం లేదా ఆదేశాలు ఏమిటి అని మీడియా ద్వారా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నది. ఒక అభివృద్ధి చెందుతున్న దేశంగా, ధనిక దేశాలు, పేద దేశాల మధ్య వారధిగా, అమెరికా దేశాల కూటమికీ, రష్యా, చైనా దేశాల కూటమికీ మధ్య కీలకంగా పరిణమించిన భారత్ ఈ సదస్సులో వ్యవహరించే తీరు మీద ఆసక్తి ఉన్నది. ‘అభివృద్ధి’ మార్గం వివాదాస్పదం అవుతున్న సందర్భంలో, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, పేదరికం, అనారోగ్యం, ఆకలి వంటి అంశాలను పరిష్కరించే వివిధ మార్గాలు, చర్యలు కూడా అంతర్జాతీయ పరిణామాల ప్రభావానికి లోను అవుతున్నాయి. కాబట్టి అక్కడ జరిగేది వేరు, మనకు సంబంధం లేదు అనుకోవడానికి వీలు లేదు. మన రాజకీయ వ్యవస్థ, ప్రధానంగా రాజకీయ నాయకులు ఈ అంశాల మీద తమ పరిజ్ఞానం పెంచుకుంటేబాగుంటుంది.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఉత్తమ క్రికెటర్



ఇప్పటివరకూ శ్రీలంక కన్న అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అరవింద్ డిసిల్వాకు అభినందనలు. ఇది దేశానికి కూడా గర్వకారణం (‘ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్’ గౌరవం దక్కిన నేపథ్యంలో).
– ఏంజెలో మాథ్యూస్, శ్రీలంక క్రికెటర్

గొప్ప ప్రధాని



భారతదేశ అత్యంత గొప్ప ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 134వ జయంతి సందర్భంగా ఆయనకు వినయపూర్వక నివాళి. అలాగే, బాలల దినోత్సవ శుభాకాంక్షలు.
– అభిజిత్ చావ్డా, భౌతిక శాస్త్రవేత్త

అంతటి రుగ్మత



విద్య అనేది నేర్చుకోవడానికి సంబంధించినదన్న విషయం పోయింది. ఈ దృక్పథానికి సంబంధించి కోట (రాజస్థాన్) చిన్న శకలం మాత్రమే. చిన్నప్పటి నుంచే కృత్రిమ విజయాల పట్ల అధిక శ్రద్ధ చూపడం సృజనాత్మకతను నిర్వీర్యం చేస్తోంది. (విద్యార్థులు కోట కోచింగ్ సెంటర్లలో రోజుకు 6–7 గంటలుంటూ, అంతే సమయం సొంతంగా చదువుతూ ఒత్తిడికి గురవుతున్నారని ఒక సర్వే.) – సుహాస్ పల్షీకర్, ప్రొఫెసర్

కృతఘ్నత



ఆయన పుట్టారు, దేశం కోసం పోరాడారు, దేశానికి మొదటి ప్రధాని అయ్యారు– రాజ్యాంగం రూపు దిద్దుకోవడంలో సాయపడ్డారు, దానివల్ల మీరు (తథాగత రాయ్) గవర్నర్ కాగలిగారు. కనీసం దానికైనా కృతజ్ఞత చూపండి. (నెహ్రూ పుట్టకుండా ఉండాల్సింది అని వ్యాఖ్యానించిన నేపథ్యంలో.)
– అక్షర్ ధనాని, వ్యాఖ్యాత

చీదర మాటలు



ఇది అసహ్యకరం, సిగ్గు చేటు. ఆయన (నటి ఐశ్వర్యారాయ్ గురించి పాకిస్తాన్ క్రికెటర్ అబ్దుల్ రజాక్) అన్నది నిజమేనని నిర్ధారించుకోవ డానికి రెండుసార్లు వినాల్సి వచ్చింది. ఎవరు గుణవతి అని తీర్పులిచ్చే హక్కు ఆయనకు ఎవరిచ్చారు? ఎంత చీదర! ఇది పాకిస్తాన్ పురుషుల సాధారణ అభిప్రాయమేమో అని జనాలు అనుకుంటారు.
– సమర అఫ్జల్, క్రికెట్ కామెంటేటర్

మారుతున్న ధోరణి



1980ల నుంచి మూడు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో పాల్గొన్న అనుభవాన్ని బట్టి ఇది చెబుతున్నా. 2000 సంవత్సరం వరకూ కేవలం భార్యలు మాత్రమే తమ భర్తల కోసం కిడ్నీలు దానం చేసేవాళ్లు. ఆ లెక్కలో మనది పురుషస్వామ్య వ్యవస్థ. కానీ గత ఇరవై ఏళ్లలో పరిస్థితి మారింది. భార్యలకు కిడ్నీలు ఇచ్చిన భర్తలు డజనుకు పైగా నాకు తెలుసు.
– సుందర్ శంకరన్, వైద్యుడు

బాధానందం



ఆహారం, శృంగారం అనేవి భూమ్మీద గొప్ప ఆనంద కారకాలని చెబుతుంటారు. అది తప్పు. బాధితుడిని అనుకోవడంలో గొప్ప ఆనందం ఉంది. ‘ప్రపంచం నన్ను బాధపెడుతూనే ఉంది. నా జీవితమంతా పోరాటమే’ అని చెప్పుకోవడానికి మించిన ఆనందం ఇంకెందులోనూ లేదు. ఇది మనం ధరించగలిగే బెస్ట్ ఫ్యాషన్ కూడా!
– సంజుక్తా బసు, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

వనభోజనాల్లో ఉద్యమ స్ఫూర్తి

కార్తీక మాసపు వనభోజనాలు జరిగే ప్రదేశాన్ని స్వాతంత్ర్యోద్యమానికి వేదికగా మార్చిన స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ. ఆమె స్వాతంత్ర్య ఉద్యమంలో జైలుకెళ్లిన తొలి ఆంధ్ర మహిళగా గుర్తింపు పొందారు. గాంధీజీ ‘దేశబాంధవి’ అని ఆమెను కీర్తించారు. 1880 నవంబర్ 15న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దాక్షారామంలో జన్మించారు. పదవ యేటే వివాహమయింది. భర్త దువ్వూరి వెంకట సుబ్బయ్య కొద్ది కాలానికే మరణించడంతో బాల వితంతువయ్యారామె. వారికి పిల్లలు లేరు. అప్పటికి తనకి పెద్దగా అక్షరజ్ఞానం లేకపోవడంతో కడియం వెళ్లి తన సమీప బంధువూ, కవీ అయిన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి దగ్గర శిష్యురాలుగా చేరారు. పట్టుదలతో సాహిత్యం నేర్చుకుని సంస్కృత, తెలుగు భాషల్లో విదుషీమణి అయ్యారు.



దువ్వూరి సుబ్బమ్మ

1921లో కాకినాడలో జరిగిన రాజకీయ సభలో పాల్గొని ‘సంపూర్ణ స్వాతంత్ర్య లక్ష్యం’ తీర్మానాన్ని బలపరుస్తూ అనర్గళంగా మాట్లాడారు. ఆ సభకు టంగుటూరి ప్రకాశం అధ్యక్షులు. విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా స్వయంగా ఖద్దరు బట్టలు నేసి, మూట నెత్తిని పెట్టుకొని ఊరూరా తిరిగి అమ్మేవారు. జనం గుమిగూడిన చోటల్లా స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు రగిల్చేవారు. ఆమె మాటలూ, పాటలూ వినిపించకుండా బ్రిటిష్ రక్షక దళాలు డప్పులూ, డబ్బాలు వాయించేవారు. ‘నేను గంగా భగీరథీ సమానురాలను. తలుచుకుంటే మిమ్మల్ని గంగలో ముంచెత్తగలను. కానీ గాంధీజీ ఆదేశానుసారం అహింసా వ్రతం చేపట్టాను. నా దగ్గర కాదు మీ కుప్పిగంతులు. జాగ్రత్త!’ అని గర్జించేవారు. ఆ మాటలు వినగానే పోలీసులు చల్లగా జారుకొనేవారు. సహాయ నిరాకరణోద్యమం, ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో గాంధీజీతో కలిసి పాల్గొన్నారు. తన యావదాస్తినీ స్వాతంత్ర్య ఉద్యమం కోసం అర్పించారు. అవసాన దశలో కడియంలో ఒక చిన్న గదిలో కాలం గడిపేవారు. ముఖ్యమంత్రి హోదాలో టంగుటూరి ప్రకాశం సుబ్బమ్మని పలకరించడానికి వచ్చినప్పుడు ‘ఒరేయ్ పంతులూ, ఎలా ఉందిరా ఈ నల్లోళ్ల పరిపాలన?’ అని అందట. అహర్నిశలూ దేశం కోసం బతికినామె 1964 మే 31న తుదిశ్వాస విడిచారు.

– చిలుకూరి శ్రీనివాసరావు, కడియం
(నేడు దువ్వూరి సుబ్బమ్మ జయంతి)

రాజకీయ పార్టీలను మనమేం అడగాలి?

రాష్ట్రం ఏర్పడి సుమారు 10 సంవత్సరాలు కావస్తున్న సందర్భంలో ఈ నెల 30వ తేదీన జరిగే ఎన్ని కలు రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మనకు మూడవ ఎన్నికలు. ఈ ఎన్నికల్లో తమకే ఓటు వేయమని బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు కోరుతున్నారు. విచిత్రమైన విషయం ఏమిటంటే ఆయన పాల్గొంటున్న అనేక ఎన్నికల ప్రచార సభల్లో తాము ఏం చేశారో చెప్పి ఓట్లడగటం లేదు. ఫలానా పార్టీకి ఓటు వేస్తే జరగబోయే నష్టం ఏమిటో చెప్పి ఓట్లు అడుగుతున్నారు.

ఇక ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇతర చిన్నా చితకా పార్టీలు తమకే ఓటు వేయమని చెప్పటానికి రకరకాల హామీలను తమ మేనిఫెస్టోల్లో గుప్పించాయి. ఆసక్తి గల వారు ఎవరైనా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల మేనిఫెస్టోలను పక్కపక్కనే పెట్టుకొని పరిశీలించి నట్లయితే ఏ తేడా లేనట్టుగా సులభంగానే గ్రహించవచ్చు.

ఇంతకు ఇప్పుడు ఓట్లు అడగటానికి వస్తున్న రాజకీయ పార్టీలను మనం ఏం అడగాలి? నీళ్లు, నిధులు, నియామకాలు వంటి అనేక ఆకాంక్షలతో సుదీర్ఘంగా సాగిన ప్రత్యేక తెలంగాణ పోరాటం 2014లో విజయవంతమైన తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి (నేటి బీఆర్‌ఎస్) అధికారం చేపట్టింది. వచ్చిన అనతి కాలంలోనే హైదరాబాద్‌లోని ‘ధర్నా చౌక్’ను ఎత్తివేయడం ద్వారా ప్రజలకున్న నిరసించే హక్కుపై పెద్ద దెబ్బ కొట్టింది. అది మొదలు అనేక ప్రజా వ్యతిరేక రాజకీయ నిర్ణయాలను అమలుపరిచింది. మరి ఇక ముందైనా రాజకీయ పార్టీలు తాము నిరంకుశంగా వ్యవహరించమని మేనిఫెస్టోల్లో హామీ ఇస్తున్నాయా అనేది గమనించాలి. రేపు అధికారంలోకి రావాలని అనుకొంటున్న పార్టీ ఏదైనా అభివృద్ధి పేరు మీద భూములు లాక్కోమని హామీ ఇస్తున్నదా అనేది అడగాల్సిన ప్రశ్న. రాష్ట్రం సాకారం కాకముందు



నుంచి ఒక ప్రధాన సమస్యగా ఉన్న రైతు ఆత్మహత్యలు, రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కూడా కొనసాగటం నిజంగా దురదృష్టకరం. మరి ఈరోజు ఓట్లు అడగటానికి వస్తున్న ఏ రాజకీయ పార్టీ అయినా మరణించిన ప్రతి రైతు కుటుంబాన్నీ ఆదుకుంటామనీ, బేషరతుగా సహాయం చేస్తామనీ ప్రకటిస్తున్నదా? కౌలు రైతులతో సహా మొత్తం వ్యవసాయానికి సంబంధించి ఇదీ మా వ్యవసాయ విధానమని ప్రకటించిన పార్టీ ఉన్నదా?

ఎన్నో ఆశలతో తెచ్చుకున్న కొత్త రాష్ట్రంలో ఉద్యోగాల నోటిఫికేషన్లు రావటం లేదనీ, నియామకాలు జరగటం లేదనీ, వయసు మీరి పోతోందనీ యువతీ యువకులు విగతజీవులు అవుతున్న దృష్టాంతాలు ఇటీవల చోటు చేసుకుంటున్నాయి. డబ్బు పంపిణీ ఫలానా విధంగా ఫలానా, ఫలానా వర్గాలకు చేస్తామని తమ మేనిఫెస్టోల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్న పార్టీలు యువతీ యువకులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఇదీ మా విధానం అని ఎక్కడైనా స్పష్టం చేశాయా?


మానవుల సామాజిక జీవితానికి అతి ముఖ్యమైన విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వ యాజమాన్యంలో ఉంచితే జరిగే మేలు అంతా ఇంతా కాదు. మరి ప్రభుత్వ రంగంలో విద్యనూ, వైద్యాన్నీ కొనసాగిస్తామని ఏ ఒక్క రాజకీయ పార్టీ అయినా ప్రకటించిందా?

మన తక్షణ అవసరాల కోసం, తాత్కాలిక ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలకు అధికార సోపానాలుగా ఉపయోగపడదామా? లేక మన సుస్థిర భవిష్యత్తు కోసం ఈ ప్రశ్నలు అడుగుదామా? ఆలోచించండి. ఓట్ల కోసం వచ్చే పార్టీలనూ, అభ్యర్థులనూ భద్రతతో కూడిన సుస్థిర భవిష్యత్తు కోసం పై డిమాండ్లను నెరవేర్చమని నిలదీద్దాం.

– టి. హరికృష్ణ
మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి

నిష్కామకర్మతోనే...

కురుక్షేత్ర సంగ్రామంలో విజయం పొంది, అధికారాన్ని చేపట్టి రాజ్య పాలనం చేయాల్సిన ధర్మరాజును, ఆ విజయం కోసం తాను పోగొట్టుకున్న సకల బంధుజన నష్టంతో ఒక్కసారిగా నిర్వేదం ఆవహించింది. సర్వసంగ పరిత్యాగిగా శేష జీవితాన్ని గడపాలన్న కోరికను అతడి మనసులో కలగజేస్తుంది. అకస్మాత్తుగా ధర్మరాజు వెలిబుచ్చిన ఆ నిర్ణయాన్ని స్వాగతించలేని అర్జున భీమాదులు ధర్మజుడికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగా వారి మధ్య జరిగిన సంభాషణలో క్షత్రియోచిత ధర్మాచరణ, ధనం, సుఖదుఃఖాలు మొదలైన విషయాలను గురించిన సంగతులెన్నో చర్చించ బడతాయి. ఈ సందర్భంలో ప్రవచన కుశలుడు, మహాతపస్వి అని పేరున్న దేవస్థానుడనే ఋషి, ఇంద్రుడికి దేవగురువైన బృహస్పతి ఇలా చెప్పాడని ధర్మరాజుకు బోధిస్తాడు:



సంతోషోవై స్వర్గతమః సంతోషః పరమం సుఖమ్॥
తుష్టేర్న కించిత్ పరతః సా సమ్యక్ ప్రతితిష్ఠతి॥

(వ్యాసభారతం, శాంతిపర్వం, 21వ అధ్యాయం, 2వ శ్లోకం)

‘రాజా! ఒక మనిషి హృదయం పూర్తిగా సంతోషంతో నిండిపోవడం అన్నది ఆ క్షణానికి అతడు స్వర్గాన్ని దక్కించుకోవడం కంటే కూడా మిన్నయైనట్టిది. అందువలన సంతోషమే మనిషి సాధించగలిగిన అన్ని సుఖాల కంటే కూడా చాలా గొప్పది. సంతోషమనే గుణం మనసులో నిత్యమైనదిగా ప్రతిష్ఠించుకున్న మనిషికి, లోకంలో మరి సాధించవలసినదంటూ ఏదీ మిగిలి వుండదు’ అని పై శ్లోకం భావం. అయితే పైన చెప్పిన మాటల్లో దేవగురువైన బృహస్పతి ఉద్దేశించిన ‘సంతోషం’ అనే మాటకు నిజమైన అర్థం ఏమిటో, ఆ సంతోషాన్ని పొందడానికి కావలసిన అర్హతలేమిటో, వ్యాసభారతంలోని శాంతిపర్వం, 26వ అధ్యాయం, 11, 12వ శ్లోకాలలో, ధర్మరాజు అర్జునుడితో చెప్పిన సంగతులలో విశదీకరిస్తాడు. ఎవరైతే క్రోధాన్ని, ఈర్ష్యను జయిస్తారో వారి హృదయంలో మాత్రమే వైరాగ్యంతో నిండినట్టిదైన సంతోషం, పరమ సుఖప్రదమైనదై స్థిరమైనదిగా ఉంటుంది. అట్టివారికి ఉత్తమమైన సిద్ధిని ఆ సంతోషం కలగజేస్తుంది’ అనేది ధర్మరాజు విశదీకరణ సారాంశం.

– భట్టు వెంకటరావు

నేడు వాయుగుండం.. రేపటికి తీవ్రం

- నేడు సీమ, దక్షిణ కోస్తాలకు భారీ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం/వాకాడు: ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్, నికోబార్ దీవులకు ఆనుకుని మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ బుధవారం నాటికి వాయుగుండంగా మారనుంది. ఆపై వాయవ్య దిశగా పయనిస్తూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి కాస్త దూరంలో గురువారం నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో వెల్లడించింది. అనంతరం ఉత్తర, ఈశాన్య దిశగా మలుపు తిరిగి 17వ తేదీకి ఒడిశా తీరానికి చేరుకుంటుందని తెలిపింది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ఆవర్తనం నుంచి అల్పపీడనం ప్రాంతం వరకు మరో ద్రోణి విస్తరించి ఉంది. వీటి ఫలితంగా బుధ, గురువారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు, బుధవారం అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులు సంభవించి.. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉందని, ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రానున్న రెండు రోజులు గంటకు 40–50 కి.మీ.లు, గరిష్టంగా 60 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ల వద్దని హెచ్చరించింది.

దుర్గామల్లేశ్వరుని సేవలో తెలంగాణ సీఎస్



తెలంగాణ సీఎస్ శాంతికుమారికి అమ్మవారి ప్రసాదాలు అందచేస్తున్న ఈవో రామారావు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామివార్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం దర్శించుకున్నారు. శాంతికుమారికి దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితిసింగ్ సాదర స్వాగతం పలికారు. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం సీఎస్‌కు వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను ఆలయ ఈవో అందచేశారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

ప్రవీణ్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ


- తప్పిన ప్రమాదం



కాగజ్‌నగర్ రూరల్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వాహనాన్ని ప్రమాదవశాత్తు లారీ ఢీకొట్టింది. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం పెద్దవాగు సమీపంలో మంగళవారం ముస్లింలు జెండా పండుగ నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తన వాహనాన్ని రహదారి పక్కన నిలిపారు. అదే సమయంలో వెను క నుంచి వచ్చిన లారీ ఆయన వాహనాన్ని ఢీకొట్ట డంతో స్వల్పంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో వాహనంలో ప్రవీణ్‌కుమార్‌తోపాటు ఐదుగురు ఉండగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఈ విషయమై రూరల్ పోలీసులను 'సాక్షి'సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

బీజేపీది సబ్‌కా వికాస్.. బీఆర్‌ఎస్‌ది ఫ్యామిలీకా వికాస్

- నిరుద్యోగభృతి ఇవ్వని కేసీఆర్ సౌభాగ్యలక్ష్మి ఇస్తారా: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ప్రభుత్వం సబ్‌కా వికాస్ నినాదంతో పాలన సాగిస్తుంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం ఫ్యామిలీ వికాస్ కోసమే పనిచేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రజాహితం కోరే పార్టీలు కావని, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు పదేళ్ల అవకాశం ఇస్తే బంగారు తెలంగాణను భిక్షమెత్తుకునే స్థాయికి దిగజార్చారని మండిపడ్డారు. ఈసారి కూడా కేసీఆర్‌కు అవకాశమిస్తే చిప్ప కూడా మిగలదని వాఖ్యానించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఉపఎన్నికల సమయంలో కుర్చీ వేసుకుని పనిచేస్తానన్న సీఎం కేసీఆర్ ఆ తర్వాత అక్కడ మచ్చుకు కూడా కనిపించలేదన్నారు. కేసీఆర్‌ది అంటే ఆగడు, పంటీ లేవడు తత్త్వమని, పదేళ్లలో చేయలేని పనుల్ని పది రోజుల్లో చేస్తాననడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి ఇవ్వని కేసీఆర్ ఇప్పుడు సౌభాగ్యలక్ష్మి పేరుతో మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వివరించారు. బీసీ సీఎం, ఎస్సీ వర్గీకరణ చేస్తామంటే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నాయని వ్యాఖ్యానించారు. రెండ్రోజుల్లో బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేస్తామని తెలిపారు. దళారులు లేని సర్కారు రావాలంటే తెలంగాణలో బీజేపీ సర్కారు రావాలని అందుకు బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

టీడీపీ ఖాతాలోకి రూ. 27 కోట్ల

స్కిల్ స్కామ్ నిధులు

- హవాలా మార్గంలో చేరినట్టు గుర్తించిన సీఐడీ
- ఇతర కుంభకోణాల నిధులు కూడా చంద్రబాబు పార్టీ ఖాతాలోకే
- ఈ నిధుల గుట్టు రట్టు చేసేందుకు విచారణ వేగవంతం
- మొదట స్కిల్ స్కామ్‌లో కార్యాచరణకు ఉపక్రమణ
- టీడీపీ ప్రధాన కార్యాలయానికి నోటీసులు జారీ.. 18న తాము కోరిన వివరాలతో సిట్ కార్యాలయానికి రావాలని పేర్కొన్న సీఐడీ



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అక్రమ నిధుల తరలింపునకు టీడీపీ ప్రధాన కార్యాలయం కేంద్రబిందువుగా మారిందని సీఐడీ గుర్తించింది. వివిధ కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన అక్రమ నిధులను గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి తరలించినట్టు విశ్వసిస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంతోపాటు చంద్రబాబుపై నమోదైన ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, అసైన్డ్ భూములు, మద్యం, ఇసుక కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన ప్రజాధనం హవాలా మార్గంలో టీడీపీ ప్రధాన కార్యాలయానికి చేరింది. ఈ మేరకు సీఐడీ దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం. దీంతో టీడీపీ ఖాతాల్లో చేరిన నిధుల లోగుట్టును రట్టు చేసే దిశగా సీఐడీ దర్యాప్తు వేగవంతం చేస్తోంది. అందులో మొదటగా స్కిల్ స్కామ్ కేసులో కార్యాచరణకు ఉపక్రమించింది. ఈ కేసులో టీడీపీ ప్రధాన కార్యాలయానికి మంగళవారం నోటీసులు జారీ చేసింది. తాము కోరిన వివరాలతో ఈ నెల 18న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కార్యాలయానికి రావాలని ఆ నోటీసుల్లో పేర్కొంది.

హవాలా మార్గంలో రూ.27 కోట్లు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో కొల్లగొట్టిన రూ.241 కోట్లలో రూ.27 కోట్లు టీడీపీ ప్రధాన కార్యాలయానికి చేరినట్టు సీఐడీ గుర్తించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా చెల్లించిన రూ.371 కోట్లలో రూ.241 కోట్లను డిజైన్ టెక్ వివిధ మార్గాల ద్వారా చంద్రబాబుకు చేర్చినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. అందులో రూ.27 కోట్లను టీడీపీ ఖాతాలో జమ చేసినట్టు సీఐడీ ఇటీవల గుర్తించింది. ఆ నిధులు పార్టీ బ్యాంకు ఖాతాలోకి ఎలా వచ్చాయన్నదానిపై స్పష్టత లేకపోవడం గమనార్హం. దీనిపై ప్రాథమిక ఆధారాలు సేకరించాక సీఐడీ నెల క్రితం టీడీపీ ప్రధాన కార్యాలయానికి నోటీసులు జారీ చేసింది. బ్యాంకు ఖాతాల లావాదేవీలు వివరాలు తెలపాలని పోస్టు ద్వారా నోటీసులు పంపించింది. దీంతో కంగుతిన్న టీడీపీ బ్యాంకు లావాదేవీల వివరాలను తెలిపేందుకు నాలుగు వారాల గడువు కావాలని సీఐడీకి సమాధానం ఇచ్చింది. నాలుగు వారాల గడువు ముగిశాక కూడా టీడీపీ ఆ నోటీసులకు సమాధానం ఇవ్వలేదు. అంటే టీడీపీ బ్యాంకు ఖాతాల్లో చేరిన నిధుల్లో ఏదో గూడుపుఠాణి ఉందన్నది స్పష్టమైంది. దాంతో సీఐడీ మరింత దూకుడు పెంచింది. టీడీపీ బ్యాంకు ఖాతాల లావాదేవీల వివరాలను తెలపాలని టీడీపీ ప్రధాన కార్యాలయానికి మంగళవారం నోటీసులు పంపింది. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పేరిట ఆ నోటీసులు జారీ చేసింది.

ఇతర కుంభకోణాలపైనా..

నెల క్రితం పోస్టులో పంపిన నోటీసులపై స్పందించని టీడీపీ.. ప్రస్తుతం ప్రత్యక్షంగా పంపిన నోటీసులపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కేవలం స్కిల్ స్కామ్‌కు సంబంధించిన రూ.27 కోట్ల వివరాలే కాకుండా మొత్తం బ్యాంకు లావాదేవీల వివరాలు వెల్లడించాల్సిన అనివార్యత ఏర్పడింది. తద్వారా టీడీపీ అక్రమ నిధుల తరలింపు నెట్ వర్క్ గుట్టురట్టు కానుంది. ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూములు, మద్యం, ఇసుక కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన ప్రజాధనంలో టీడీపీ ప్రధాన కార్యాలయానికి ఎంతమేర తరలించారో నిగ్గు తేల్చే అవకాశాలున్నాయి. దీంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉండనున్నాయనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

నీళ్లిస్తేనే ఓట్లేస్తాం!



మా బస్తీ ఓట్లు కావాలంటే.. తాగునీరు, చేతిపంపు తదితర మౌలిక వసతులు కల్పించాలని గౌలిపురా మేకలమండి గాంధీనికేతన్ యువజన సంఘం కమిటీ పెద్దలు, బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం తరఫున పోటీ చేస్తున్న వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు అభివృద్ధి పనులు చేస్తామంటేనే రండి అంటున్నారు. తమ బస్తీలో 4,300 ఓట్లు ఉన్నాయని.. అన్ని సౌకర్యాల సదుపాయాలు కల్పిస్తేనే మీ విజయం కోసం పాటుపడతామన్నారు. బస్తీవాసులకు ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా చేతిపంపు వేయించి నీటి వసతి సదుపాయం కల్పిస్తే కలకాలం మీరు పేరు గుర్తుంటుందంటూ ఓ బ్యానర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. – గౌలిపుర (హైదరాబాద్)

టీటీడీ నిధులతో నిర్మాణాలకు పెద్దపీట

- స్విమ్స్‌లో నూతన కార్డియో న్యూరో బ్లాక్ నిర్మాణానికి రూ.74.24 కోట్లు
- స్విమ్స్ ఆసుపత్రి భవనాల ఆధునీకరణ, పునర్నిర్మాణానికి రూ.197 కోట్లు
- టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం
- మీడియాకు వెల్లడించిన టీటీడీ చైర్మన్ భూమన



మాట్లాడుతున్న భూమన

తిరుమల: టీటీడీ నిధులతో వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వెల్లడించారు. మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు హాజరయ్యారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మీడియాకు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

- తిరుపతి సమీపంలోని పుదిపట్ల జంక్షన్ నుంచి వకుళమాత ఆలయం వద్ద జాతీయ రహదారి వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి రూ.21.10 కోట్లతో టెండర్ ఆమోదం. ఇది పూర్తయితే తిరుపతికి పూర్తిగా ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పడుతుంది.
- ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రూ.1.65 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్ అభివృద్ధి పనులకు టెండర్ ఆమోదం.
- తిరుపతిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి రుయా ఆస్పత్రిలో నూతన టీబీ వార్డు నిర్మాణానికి రూ.1.79 కోట్లతో టెండర్ ఆమోదం.
- స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మంది రోగుల సౌకర్యం కోసం రూ.3.35 కోట్లతో ప్రస్తుతం ఉన్న భవనంపై మరో రెండు అంతస్తుల నిర్మాణానికి టెండరు ఆమోదం.
- స్విమ్స్‌లో నూతన కార్డియో న్యూరో బ్లాక్ నిర్మాణానికి రూ.74.24 కోట్లతో టెండర్ ఖరారు.
- స్విమ్స్ ఆస్పత్రి భవనాల ఆధునీకరణకు, పునర్నిర్మాణానికి రూ.197 కోట్లతో చేపట్టే పనులకు పరిపాలనా అనుమతికి ఆమోదం. మూడేళ్లలో దశలవారీగా చేపట్టేందుకు నిర్ణయం.
- నడక దారుల్లో భక్తుల భద్రత కోసం డిజిటల్ కెమెరా ట్రాప్‌లు, వైల్డ్ లైఫ్ మానిటరింగ్ సెల్, కంట్రోల్ రూమ్‌కు అవసరమైన పరికరాల కొనుగోలుకు రూ.3.5 కోట్ల మంజూరుకు ఆమోదం.
- కరీంనగర్‌లో శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.15.54 కోట్ల పనులకు టెండర్ ఆమోదం.

23న విశేష హోమం

- శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ఈ నెల 23న అలిపిరి వద్దగల సప్తగోప్రదక్షిణ మందిరంలో ప్రారంభం. ఇందుకోసం టికెట్ ధర రూ.1000గా నిర్ణయం. ఆన్‌లైన్ తోపాటు ఆఫ్‌లైన్‌లో టికెట్లు కేటాయిస్తారు. ప్రత్యక్షంగా, వర్చువల్‌గా పాల్గొనవచ్చు. ఈనెల 16న టీటీడీ ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల చేస్తారు.
- టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ జీవో 114 విధివిధానాలకు లోబడి టీటీడీలో అమలుకు నిర్ణయం.
- తిరుపతిలోని ఎస్వీ శిల్ప కళాశాలలో సంప్రదాయ కలంకారీ, శిల్పకళలో ప్రాథమిక శిక్షణ సాయంకాలం కోర్సులు ప్రవేశపెట్టాలని నిర్ణయం.

బీటెక్ రవి అరెస్టు

- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు
- కానిస్టేబుల్‌పై దాడి కేసులో అరెస్టు చేసినట్లుగా పోలీసుల వెల్లడి



సాక్షి ప్రతినిధి, కడప: క్రికెట్ బెట్టింగ్ సహా పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అలియాస్ బీటెక్ రవిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. రవిపై వల్లూరు పోలీసుస్టేషన్‌లో ఓ కేసు పెండింగ్‌లో ఉంది. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో డ్యూటీలో ఉన్న ఓ పోలీసుపై దురుసుగా ప్రవర్తించి, కాలు ఫ్యాక్చర్ కావడానికి బీటెక్ రవి కారకుడైనట్లు అప్పట్లో కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రవిని అరెస్టు చేసిన పోలీసులు... రిమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం కడప ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చారు. మేజిస్ట్రేటు14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. నిజానికి ఈ మధ్యే పోరుమామిళ్ల కేంద్రంగా భారీ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం చోటు చేసుకున్నట్లు వెలుగు చూసింది. ఈ వ్యవహారంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయటంతో.. తీగలాగితే డొంక కదిలినట్లు మొత్తం వ్యవహారం బీటెక్ రవి చుట్టూనే చేరింది. క్రికెట్ బెట్టింగ్ విషయాల్లో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ సీరియస్‌గా ఉండటంతో... స్థానికంగా పేరున్న లాడ్జిలను ఆయనే స్వయంగా తనిఖీలు సైతం చేశారు. బెట్టింగ్ అణిచివేతలో భాగంగా మూలాలపై దృష్టి సారించిన క్రమంలో పోరుమామిళ్ల బెట్టింగ్ రాకెట్ మొత్తం బీటెక్ రవి కనుసన్నుల్లో నడిచినట్లు రూఢీ అయ్యింది. పోలీసులకు పక్కా ఆధారాలు దొరకటంతో... బీటెక్ రవి తప్పించుకొని తిరుగుతున్నట్లుగా తెలియవచ్చింది. ఈ క్రమంలోనే యోగివేమన యూనివర్సిటీ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో బీటెక్ రవి ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై నోటీసులు జారీ చేసి, విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రమేష్ కుమార్ జైశ్వాల్ ఎక్కడ?

- అగ్నిప్రమాదం ఘటనపై పోలీసుల గోప్యత
- భవన యజమాని ఎక్కడున్నారో వెల్లడించని వైనం..



నాంపల్లి: బజార్‌ఘాట్‌లో అగ్ని ప్రమాదానికి గురైన బాలాజీ అపార్ట్‌మెంట్ యజమాని రమేష్ కుమార్ జైశ్వాల్ ఆచూకీ లభించడం లేదు. సోమవారం అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో అపార్ట్‌మెంట్‌లో కనిపించిన ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో వెలువడిన (మిథైల్ బెంజిన్) విషవాయువులను పీల్చుకుని స్పృహతప్పి పడిపోయారు. వెంటనే అతడిని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్పృహ కోల్పోయిన ఆయనను ఏ ఆసుపత్రిలో చేర్చారు? ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఏమిటనే విషయం ఎవరికీ అంతు చిక్కడం లేదు. అయితే పోలీసులు సైతం అతడు చికిత్స పొందుతున్న విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై నాంపల్లి పోలీసులను వివరణ కోరగా స్పందించలేదు. ఇదిలా ఉండగా సోమవారం జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనలో ఆయనపై పోలీసులు 304, 285, 286 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

అపార్ట్‌మెంట్‌ను పరిశీలించిన జేఎన్టీయూ నిపుణుల బృందం

అగ్ని ప్రమాదానికి గురైన బాలాజీ అపార్ట్‌మెంట్‌ను జేఎన్టీయూ నిపుణుల బృందం మంగళవారం సాయంత్రం పరిశీలించింది. ఖైరతాబాద్ జోన్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన నిపుణుల బృందం అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్న అపార్ట్‌మెంట్ స్థితిగతులను, పూర్వాపరాలను పరీక్షించింది. భవంతిలోని నాలుగు అంతస్తులను నిపుణుల బృందం, జీహెచ్ఎంసీ అధికారుల బృందం సంయుక్తంగా సుమారు 60 నిమిషాల పాటు పరిశీలన చేసింది. సెల్లారుతో పాటుగా దెబ్బతిన్న అంతస్తులు ఎన్ని? ప్రమాదానికి గురికాని అంతస్తులెన్ని అనే వాటిపై లెక్కలు వేశారు. భవనానికి వినియోగించిన ఇటుకలు, సిమెంటు, ఇసుక, ఇనుము నాసిరకమైనవి వాడినట్లుగా గుర్తించారు. ఒక్కో అంతస్తుకు రెండు ఫ్లాట్స్ చొప్పున నాలుగు అంతస్తులకు ఎనిమిది ఫ్లాట్స్‌ను నిర్మించినట్లు గుర్తించారు. 1998లో జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు పొందారు. జీ+1 నిర్మాణానికి అనుమతులు తీసుకుని నాలుగంతస్తులు నిర్మించారు. 286 గజాల విస్తీర్ణంలో నిర్మించిన భవనానికి ఫైర్ సేఫ్టీ లేదు. క్రోడీకరించిన అన్ని అంశాలను నివేదిక రూపంలో బుధవారం జీహెచ్ఎంసీకి అందజేస్తామని జేఎన్టీయూ నిపుణుల బృందం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ సర్కిల్–12 టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి, టీపీఎస్ నర్సింగ్‌రావు, చైన్‌మెన్లు మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ మూడు పార్టీలు ఒక్కటే..

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, మజ్లిస్‌కు ఓటేస్తే మోసపోతాం
- గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు



మహేశ్వరం: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒకే తాను ముక్కలని, వాటికి ఓటేస్తే మోసం చేస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇక్కడ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో జరిగిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాక ముందు మజ్లిస్ పార్టీని కాంగ్రెస్ పెంచి పోషించిందన్నారు. సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములను గద్దల్లాగా లాక్కుంటున్నారని ఆరోపించారు. ధరణిని అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలను మహేశ్వరం నియోజకవర్గంలో కందుకూరు మండలానికి మళ్లించారని తెలిపారు. కందుకూరు, యాచారం మండలాల్లోని పేదల భూములను ఫార్మా కంపెనీల ఏర్పాటుకు బలవంతంగా లాక్కున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా మంత్రి సబితారెడ్డి ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. మహేశ్వరం నియోజకవర్గం మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పాతబస్తీకి చెందిన మజ్లిస్ గూండాలకు పంపిణీ చేశారని ఆరోపించారు. సబితమ్మ గెలిస్తే మహేశ్వరాన్ని మజ్లిస్‌కు రాసిస్తుందని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ అందుబాటులో ఉండే అందెల శ్రీరాములు యాదవ్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు.

కోస్గిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బాహాబాహీ

- హైదరాబాద్‌కు చెందిన ఓ కార్పొరేటర్ కార్లు ధ్వంసం, పోలీసుల లాఠీచార్జ్



దాడులు చేసుకుంటున్న ఇరు పార్టీల నాయకులు

కోస్గి: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు కోస్గి మండలంలోని సర్జఖాన్‌పేటలో మంగళవారం రాత్రి పరస్పర దాడులకు దిగడంతో పాటు వాహనాలను ధ్వంసం చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌కు చెందిన కార్పొరేటర్ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం రాత్రి తన అనుచరులతో కలిసి వాహనాల్లో సర్జఖాన్‌పేటకు వచ్చి కోస్గి మండల బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మాజీ మేయర్ ఫసియొద్దీన్‌తో కలిసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మొన్నటి వరకు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న సోమశేఖర్‌రెడ్డికి ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ రాకపోవడంతో రేవంత్‌ని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తానని బహిరంగంగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమశేఖర్ పెద్దమొత్తంలో డబ్బులు తెచ్చి పంచుతున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వారిని అడ్డుకోవడంతోపాటు కార్లపై రాళ్లు విసిరి ధ్వంసం చేశారు. ఈ విషయం పార్టీల గ్రూపుల్లో వైరల్ కావడంతో బీఆర్‌ఎస్ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సర్జఖాన్‌పేటకు చేరుకున్నారు. ఇరువర్గాలు తోపులాటలకు దిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇరువర్గాలు కోస్గి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయి. దీంతో పోలీస్ ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగి లాఠీచార్జ్ చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

చీడపీడలు, తెగుళ్లతో 40% దిగుబడుల నష్టం

- పీజేటీఎస్ఏయూలో నేటి నుంచి సదస్సు

సాక్షి, హైదరాబాద్: పంటల సాగులో సస్యరక్షణ, చీడపీడల నియంత్రణ అత్యంత కీలకమైన అంశమని, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా చీడపీడలు, తెగుళ్ల వల్ల 20 నుంచి 40% వరకు పంట దిగుబడులు తగ్గుతున్నాయని దేశ వ్యవసాయ రంగంలో ప్రతిష్టాత్మక సంస్థ ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ బి.శరత్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణ మార్పులు పంటల సాగుపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయని, చీడపీడలు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుండటంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుందన్నారు.

మీ కోసం కొట్లాడిందెవరు?

- రేవంత్, ఉత్తమ్ ఒక్కనాడైనా ఉద్యమించారా! : బండి

హుస్నాబాద్: 'మీ కోసం ఐదేళ్ల కొట్లాడిందెవరు.. లాఠీ దెబ్బలు తిన్నదెవరు, జైలుకు పోయిందెవరు.. రేవంత్, ఉత్తమ్, ఇక్కడున్న పొన్నం ప్రభాకర్ మీ కోసం ఒక్కనాడైనా ఉద్యమించారా'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రజలను ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో యుద్ధం చేసినందుకు రెండుసార్లు జైలుకు వెళ్లానని, తనపై కేసీఆర్ 74 కేసులు పెట్టాడని చెప్పారు. పొరపాటున బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రజలు బిచ్చమెత్తుకోక తప్పదని హెచ్చరించాడు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్‌ను సీఎం చేస్తారని, దీంతో



హుస్నాబాద్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్‌కు వచ్చిన జనం

హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావులు తలో 10 మంది ఎమ్మెల్యేలను తీసుకొని బయటకు వస్తారని, దీంతో ప్రభుత్వం పడిపోతుందన్నారు. అలాగే.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరూ సీఎంలేనని, చివరకు పొన్నం ప్రభాకర్ కూడా సీఎం అంటాడేమోనని ఎద్దేవా చేశారు. వీళ్ల కొట్లాటతో ప్రభుత్వం పడిపోయి ఉప ఎన్నికలు వస్తాయన్నారు. తెలంగాణలో సుస్థిర ప్రభుత్వం రావాలంటే బీజేపీతోనే సాధ్యమని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బండి చెప్పారు. కేసీఆర్ అంతటి గలీజ్ వ్యక్తి ఇంకొకరు లేరని, బీఆర్‌ఎస్ ఓడిపోతుందని తెలిసి, కాంగ్రెస్ అభ్యర్థులకు పైసలిచ్చి గెలిపించుకునే పనిలో పడ్డారన్నారు.

సీఎం అన్నందుకే పదవికి ఎసరు

కాగా, బండి సంజయ్ ప్రసంగం సమయానికి 'సీఎం సీఎం'అని ప్రజలు నినాదాలు చేశారు. దీంతో 'సీఎం సీఎం'అనడంతోనే ఉన్న పదవిని పోగొట్టుకున్నానని.. దయచేసి ఎవరూ సీఎం అని నినాదాలు చేయవద్దని బండి విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

బాలికపై అత్యాచారం, హత్య.. దోషికి మరణ శిక్ష

కొచ్చి: ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి, పాశవికంగా హత్య చేసిన బిహార్ వలస కూలీకి కేరళలోని ప్రత్యేక పోక్సో కోర్టు ఐపీసీ సెక్షన్ 302 కింద మరణ శిక్ష విధించింది. చనిపోయేదాకా అతడిని ఉరి తీయాలని ఆదేశించింది. అంతే కాకుండా దోషికి రూ.7.3 లక్షల జరిమానా విధించింది. నేరం జరిగిన తర్వాత 110 రోజుల్లో ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించింది. అష్ఫాక్ ఆలం(28) బిహార్ నుంచి కేరళకు వలస వచ్చాడు. అలువా పట్టణంలో కూలీగా పనిచేస్తున్నాడు. స్థానికంగా ఉండే ఐదేళ్ల బాలికపై కన్నేశాడు. ఎవరూ లేని సమయంలో ఆమెను అపహరించాడు. బలవంతంగా మద్యం తాగించి, పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి పట్ల రాక్షసంగా ప్రవర్తించాడు. ఆమె చనిపోయిన తర్వాత మృతదేహాన్ని చెత్తకుండీలో దాచిపెట్టాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి, అష్ఫాక్ ఆలంను దోషిగా గుర్తించారు. పోక్సో ప్రత్యేక కోర్టు అతడికి మరణ శిక్ష ఖరారు చేసింది. ఇది అత్యంత అరుదైన కేసు అని న్యాయమూర్తి కె.సోమన్ వెల్లడించారు. కోర్టు తీర్పును కేరళ ముఖ్యమంత్రి కె.విజయన్, మంత్రులు స్వాగతించారు. కోర్టు తీర్పు పట్ల అలువా పట్టణంలో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాలల దినోత్సవం రోజే కోర్టు నుంచి తీర్పు రావడం విశేషం. అంతేకాదు పోక్సో చట్టానికి మంగళవారమే 11వ వార్షికోత్సవం.

ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డివిజనల్ కమిషనర్‌ను తొలగించండి

కేజ్రీవాల్‌కు మంత్రి అతీశీ సిఫార్సు

న్యూఢిల్లీ: భూకుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్, డివిజనల్ కమిషనర్ అశ్వనీ కుమార్‌ను తక్షణమే పదవుల నుంచి తొలగించాలని ఢిల్లీ విజిలెన్స్ మంత్రి అతీశీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మంగళవారం ప్రతిపాదించారు. ఈ మేరకు ఆమె ఒక నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) రైతుల నుంచి భూములు సేకరించింది. బామ్నోలీ గ్రామంలో భూసేకరణలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నరేశ్ కుమార్ కుమారుడు కరణ్ చౌహాన్‌కు చెందిన కంపెనీకి లబ్ధి కలిగేలా నష్టపరిహారాన్ని భారీగా పెంచేశారు. భూములు కోల్పోతున్న రైతులకు వాస్తవంగా ప్రభుత్వం ఇవ్వదల్చుకున్న నష్ట పరిహారం రూ.312 కోట్లు కాగా, దీన్ని ఉద్దేశపూర్వకంగా రూ.850 కోట్లకు పెంచేశారు. ఈ వ్యవహారంపై ఢిల్లీ విజిలెన్స్ శాఖ దర్యాప్తు చేపట్టింది. అవకతవకలు జరిగినట్లు గుర్తించింది.

శ్రీలంకలో భూకంపం

కొలంబో: శ్రీలంకలో మంగళవారం మధ్యాహ్నం 12.31 గంటల సమయంలో సంభవించిన శక్తివంతమైన భూకంపం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.2గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రకంపనలతో భయకంపితులైన ప్రజలు ఇళ్లను వదిలి వీధుల్లోకి పరుగులు తీశారు. రాజధాని కొలంబోకు 1,326 కిలోమీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని చెప్పారు. ప్రాణనష్టం సంభవించినట్లు ఎటువంటి సమాచారం లేదని వెల్లడించారు.

మండల పూజలకు శబరిమల సిద్ధం

తిరువనంతపురం: ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి మొదలయ్యే మండలం-మకరవిలక్కు పూజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర దేవస్వామ్ మంత్రి కె.రాధాకృష్ణన్ చెప్పారు. భక్తుల సందర్శన సజావుగా సాగేందుకు అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నామన్నారు. సన్నిధానమ్, ఆలయ కాంప్లెక్స్‌ల్లో భక్తుల రద్దీని క్రమబద్ధం చేసేందుకు డైనమిక్ క్యూ కంట్రోల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. నీలక్కల్, పంపా, సన్నిధానమ్ ప్రాంతాల్లో భక్తులకు రద్దీని గురించి తెలిపేందుకు వీడియో వాల్‌లను ఏర్పాటు చేశామన్నారు. మరింత సమగ్రమైన ఈ-పూజా సౌకర్యాన్ని కూడా ఈసారి ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ ఆలయాన్ని ఏటా మలయాళీల వృశ్చిక మాసం మొదటిరోజు మొదలు దాదాపు రెండు నెలలపాటు తెరచి ఉంచుతారు.

రన్‌వే పైకి వీధి కుక్క.. వెనక్కి మళ్లిన విమానం

పణజి: రన్‌వే పైకి వీధి శునకం రావడంపై విమానం వెనక్కి వెళ్లిపోయిన సంఘటన గోవాలోని డబోలిమ్ ఎయిర్‌పోర్టులో జరిగింది. విస్తారా యూకే 881 విమానం బెంగళూరులోని కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి సోమవారం మధ్యాహ్నం 12.55 గంటలకు బయలుదేరింది. డబోలిమ్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ, ఈ ఎయిర్‌పోర్టు రన్‌వే పై ఒక శునకం ఉన్నట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. బెంగళూరు నుంచి వస్తున్న విస్తారా విమానం ల్యాండ్ అయ్యేందుకు అనుమతి ఇవ్వలేదు. దాంతో ఆ విమానం వెనక్కి మళ్లింది. మధ్యాహ్నం 3.05 గంటలకు బెంగళూరుకు చేరుకుంది. సమాచారం అందుకున్న డబోలిమ్ ఎయిర్‌పోర్టు సిబ్బంది ఆ శునకాన్ని రన్‌వే నుంచి దూరంగా తరిమేశారు. ఆ తర్వాత ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ క్లియరెన్స్ ఇవ్వడంతో విస్తారా విమానం సాయంత్రం 4.55 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 6.15 గంటలకు డబోలిమ్ ఎయిర్‌పోర్టులో క్షేమంగా ల్యాండయ్యింది.

గాజా.. మరుభూమి!

మృత్యుదిబ్బలుగా ఆస్పత్రులు! అల్ షిఫాలో 179 మృతదేహాల ఖననం

- తీవ్ర అపరిశుభ్రత, ప్రాణాంతక రోగాలు
- పని చేస్తున్నది అల్ అహ్లి ఆస్పత్రి ఒక్కటే
- గాజా పార్లమెంటును ఆక్రమించిన ఇజ్రాయెల్

డెయిర్ అల్ బలాహ్/జెరూసలేం/టెల్ అవీవ్: గాజాలో పరిస్థితులు నానాటికీ విషమిస్తున్నాయి. కరెంటు తదితర సదుపాయాలతో పాటు నిత్యావసరాలన్నీ పూర్తిగా నిండుకోవడంతో కొద్ది రోజుల క్రితం నుంచే పూర్తిగా పడకేసిన ఆస్పత్రులు క్రమంగా మృత్యుదిబ్బలుగా మారుతున్నాయి. రోగులు, నవజాత శిశువుల నిస్సహాయ సామూహిక మరణాలకు వేదికలుగా మారుతున్నాయి. గాజాలోని ప్రధాన ఆస్పత్రి అల్ షిఫాలో మృతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నట్టు తెలుస్తోంది. ఏకంగా 179 మృతదేహాలను ప్రాంగణంలోనే ఒకే చోట సామూహికంగా ఖననం చేసినట్టు ఆస్పత్రి డైరెక్టర్ అబూ సలామియా తాజాగా నిర్ధారించడం పరిస్థితికి అద్దం పడుతోంది! వీరిలో చాలామంది ఐసీయూ రోగులు, నవజాత శిశువులేనని సమాచారం. అక్కడ 30కి పైగా శవాలను ఖననం చేస్తుండగా చూసినట్టు అక్కణ్నుంచి బయటపడ్డ ప్రత్యక్ష సాక్షి కూడా వెల్లడించారు. పలు ఇతర ఆస్పత్రుల్లోనైతే మృతదేహాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఉత్తర గాజాలో అల్ అహ్లి బాప్టిస్ట్ ఆస్పత్రి మాత్రమే కాస్తో కూస్తో పని చేస్తోందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఒక్క మంగళవారమే 500 మందికి పైగా క్షతగాత్రులు అందులో చేరినట్టు వివరించింది. కరెంటు లేకపోవడం, ఆక్సిజన్, ఇంధనంతో పాటు ఆహార పదార్థాలు, నిత్యావసరాలన్నీ నిండుకుంటుండటంతో అది కూడా ఏ క్షణమైనా పూర్తిగా మూతబడే పరిస్థితి నెలకొందని ఆవేదన వెలిబుచ్చింది. మరోవైపు గాజా అంతటా ఎటు చూసినా వ్యర్థాల కుప్పలే కనిపిస్తున్నాయి. ఎటు చూసినా మురుగు నీరు పొంగి పొర్లుతోంది. వాటిద్వారా ఇప్పటికే పలు అంటు రోగాలు ప్రబలుతున్నాయి. ఇవి మరింత విజృంభిస్తే గాజా మరుభూమిగా మారుతుందంటూ ఆందోళన వ్యక్తమవుతోంది. చలి, చెదురుమదురు వర్షాలతో పరిస్థితి మరింతగా దిగజారుతోంది.

జబాలియాలో 30 మంది మృతి: మరోవైపు, గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ బీభత్సం మంగళవారం కూడా యథాతథంగా కొనసాగింది. ఆస్పత్రులతో పాటు ఇంకా చెదురుమదురుగా మిగిలి ఉన్న భవనాలన్నీ క్షిపణి, బాంబు దాడులు, కాల్పులతో అల్లాడిపోయాయి. ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై జరిగిన బాంబు దాడులు మరో 30 మందిని బలిగొన్నట్టు తెలుస్తోంది. గాజాలోని పార్లమెంటు భవనాన్ని ఇజ్రాయెల్ సైనికులు ఆక్రమించారు. భవనం లోపల ఇజ్రాయెల్ పతాకాలతో ఉన్న సైనికుల ఫొటోలు ఆ దేశ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్)కు చెందిన గోల్డెన్ బ్రిగేడ్ గాజా పార్లమెంటును స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. మరోవైపు ఇప్పటిదాకా 100 మందికి పైగా ఐరాస వర్కర్లు యుద్ధానికి బలయ్యారు. మరణించిన పాలస్తీనా వాసుల సంఖ్య 11,550 దాటినట్టు గాజా ఆరోగ్య శాఖ చెబుతోంది. వీరిలో మూడొంతులు మహిళలు, పిల్లలేనని పేర్కొంది.

వాళ్లు రోగులు.. జంతువులు కాదు!

కంటతడి పెట్టిస్తున్న డాక్టర్ ఇంటర్వ్యూ



అల్ షిఫా ఆస్పత్రిని తక్షణం వీడాలన్న ఇజ్రాయెల్ ఆదేశాలను వైద్య సిబ్బంది మంగళవారం కూడా తిరస్కరించారు. 700 మందికి పైగా నిస్సహాయులైన రోగులను ప్రాణాపాయ పరిస్థితుల్లో వదిలి వెళ్లలేమని స్పష్టం చేశారు! ఈ క్రమంలో ఆస్పత్రికి చెందిన హమామ్ అల్లో అనే నెఫ్రాలజిస్టు మరణానికి ముందు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇప్పుడందరినీ కంటతడి పెట్టిస్తోంది. ''ఆస్పత్రిలో, ఐసీయూ వార్డుల్లో అంతమంది ఉన్నారు. వారంతా రోగులు. జంతువులు కారు. నేను వెళ్లిపోతే వారికి చికిత్స అందించేదెవరు? చికిత్స పొందడం వారి హక్కు. వారి కర్మకు వారిని వదిలి వెళ్లలేం. 14 ఏళ్ల పాటు వైద్య విద్య నేర్చుకున్నది ఇలా కేవలం నా జీవితాన్ని కాపాడుకునేందుకు రోగులను నిస్సహాయ స్థితిలో వదిలేసి వెళ్లిపోయేందుకు కాదు'' అంటూ కొద్ది రోజుల క్రితం డెమొక్రసీ నౌ అనే స్వతంత్ర పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కుండబద్దలు కొట్టారు. కుటుంబంతో పాటు దక్షిణ గాజాకు వెళ్లిపోవాలన్న ఇజ్రాయెల్ హెచ్చరికలను హమామ్‌తో పాటు ఆయన కుటుంబం కూడా బుట్టదాఖలు చేసింది. అత్త గారింట్లో ఉండగా ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హమామ్‌తో పాటు ఆయన తండ్రి, మామ, బావమరిది దుర్మరణం పాలయ్యారు! స్వేచ్ఛాయుత పాలస్తీనా కోసం హమామ్ నిత్యం కలలు కనేవాడని గుర్తు చేసుకుంటూ తోటి నెఫ్రాలజిస్టు బెన్ థామ్సన్ కన్నీటి పర్యంతమయ్యాడు.

ఆస్పత్రులను కాపాడాలి: బైడెన్

బందీల విడుదలకు కృషి చేస్తున్నట్టు తాము కూడా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. అల్ షిఫాతో పాటు గాజాలో ఆస్పత్రులన్నింటినీ ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిగా కాపాడాలన్నారు. ఏ ఆస్పత్రి మీదా ఇజ్రాయెల్ సైన్యం దుందుడుకు చర్యలకు పాల్పడరాదని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, పట్టు వీడేందుకు ఇప్పటిదాకా ససేమిరా అంటున్న ఇజ్రాయెల్ కూడా కాస్త దిగొస్తున్నట్టు కన్పిస్తోంది. గాజా ఆస్పత్రుల్లో మృత్యుముఖంలో ఉన్న నవజాత శిశువులను సురక్షితంగా తరలించేందుకు ఇంక్యుబేటర్లను పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తాజాగా ఆ దేశ ఆరోగ్య శాఖ తెలిపింది.

ఆస్పత్రులే కమాండ్ సెంటర్లు: ఇజ్రాయెల్

ఆస్పత్రులను హమాస్ తన స్థావరాలుగా మార్చుకుందని ఇజ్రాయెల్ మరోసారి ఆరోపించింది. ఇందుకు ఆధారాలున్నట్టు పేర్కొంది. రంటిసీ పిల్లల ఆస్పత్రిలో గ్రెనేడ్లు, పేలుడు పదార్థాలతో కూడిన కమాండ్ సెంటర్‌ను గుర్తించామంటూ సంబంధిత వీడియోలు, ఫొటోలు విడుదల చేసింది. ఇజ్రాయెల్ బందీలను కూడా అక్కడే దాచారని అనుమానం వెలిబుచ్చింది. వీటిని హమాస్ మరోసారి ఖండించింది. ఆస్పత్రులపై నిస్సిగ్గు దాడులను సమర్థించుకునేందుకే ఇజ్రాయెల్ నిరాధారణ ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది.



గాజా స్ట్రిప్‌లోని ఖాన్‌యూనిస్ ఆస్పత్రిలో తమ వారిని కోల్పోయి రోదిస్తున్న చిన్నారులు

కాల్పులాపితే బందీల విడుదల: హమాస్

యుద్ధానికి ముగింపు ఇప్పట్లో కనిపించని పరిస్థితుల్లో, కనీసం కాల్పుల విరామం కోసం హమాస్ ప్రయత్నిస్తోంది. ఐదు రోజుల పాటు కాల్పులాపితే తమ వద్ద ఉన్న ఇజ్రాయెలీ బందీల్లో 70 మంది మహిళలు, చిన్నారులను విడుదల చేసేందుకు సంసిద్ధత వెలిబుచ్చింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా దీన్నిప్పటికే ఇజ్రాయెల్‌కు చేరవేసినట్టు తెలిపింది. ఇజ్రాయెల్ చెరలో ఉన్న 200 మంది పాలస్తీనా చిన్నారులు, 75 మంది మహిళలను వదిలేస్తే తమ వద్ద ఉన్న బందీల్లో మహిళలు, పిల్లలను విడుదల చేస్తామని గత వారం కూడా హమాస్ ప్రకటించడం తెలిసిందే. హమాస్ చెరలో 240 మందికి పైగా ఇజ్రాయెలీలున్నట్టు సమాచారం. అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ అధ్యక్షురాలు మిర్జానా స్పొల్జారిక్ మంగళవారం ఇజ్రాయెల్లో వారి కుటుంబాలను కలుసుకుని ధైర్యం చెప్పారు.

మరణానంతర ప్రసవాలు!

ఆస్పత్రులపై ఇజ్రాయెల్ దాడులు అంతులేని దారుణాలతో పాటు పలు విషాదాలకూ కారణంగా మారుతున్నాయి. సౌకర్యాల లేమి తదితరాల కారణంగా ఆస్పత్రుల్లో ఎందరో నిండు గర్భిణులు దుర్మరణం పాలైనట్టు హమాస్ ఆరోగ్య శాఖ ఆవేదన వెలిబుచ్చింది. ''అలాంటి పరిస్థితుల్లో కూడా వైద్యులు తమ వృత్తి ధర్మం మరవలేదు. ఎప్పటికప్పుడు ఆ మృతదేహాలకు హుటాహుటిన సిజేరియన్ చేసి వీలైనంత మంది శిశువులను బయటికి తీసి కాపాడుతూ వచ్చారు'' అని పేర్కొంది. ఇంక్యుబేటర్లతో పాటు ఏ సదుపాయాలూ లేక ఆ నవజాత శిశువులు కూడా మృత్యువుకు చేరువవుతున్నట్టు చెప్పింది.

బయటపడ్డ కశ్మీరీ మహిళ

లుబ్నా నజీర్ షాబూ అనే కశ్మీరీ మహిళ తన కూతురు కరీమాతో పాటు గాజా నుంచి మంగళవారం సురక్షితంగా బయట పడింది. వారిద్దరూ ఈజిప్టు చేరినట్టు భర్త వెల్లడించారు. ఈజిప్టులోని భారత మిషన్ల కృషి వల్లే తాను, తన కూతురు గాజా నుంచి బయట పడ్డట్టు లుబ్నా చెప్పారు. గాజాలో సర్వం నేలమట్టమైందని ఆవేదన వెలిబుచ్చారు.

ప్రియాంకకు ఈసీ షోకాజ్ నోటీసు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ తప్పుడు వ్యాఖ్యానాలు చేశారన్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. గురువారం రాత్రి ఎనిమిది గంటలలోపు వివరణ ఇవ్వాలంటూ ఆమెకు షోకాజ్ నోటీసు ఇచ్చింది. ''ఇటీవల మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారసభలో మోదీపై తప్పుడు ప్రకటనలు చేశారు. బీహెచ్‌ఈఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ తన స్నేహితులైన బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారని సభలో ప్రియాంక ప్రకటించారు' అని ఈసీకి బీజేపీ ఫిర్యాదుచేసింది. దీంతో 'జాతీయ పార్టీలో సీనియర్ నేతలు ప్రజల సమక్షంలో ఏదైనా మాట్లాడితే అవి వాస్తవమే అని ప్రజానీకం భావిస్తారు. అందుకే వాస్తవాలు, ఓటర్లను తప్పుదోవ పట్టించని రీతిలోనే ప్రకటనలు చేయాలి' అని ప్రియాంకకు పంపిన నోటీసులో ఈసీ పేర్కొంది. 'వ్యక్తిత్వ హననానికి పాల్పడకండి. వైరి పక్ష నేతలపై దిగజారుడు వ్యాఖ్యానాలు, ఆరోపణలు చేయకండి. ఎన్నికల క్రతువులో సభ్యతగా ప్రవర్తించండి' అంటూ అన్ని నేతలకు ఈసీ ఇటీవలే హితబోధ చేయడం తెల్సిందే.

కేజ్రీవాల్‌కు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. ప్రధాని మోదీని కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో ఆప్ చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 16వ తేదీలోగా సమాధానమివ్వాలని అందులో పేర్కొంది. ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో ఆప్ విడుదల చేసిన వీడియో అనైతికమని, ఆ పార్టీపై చర్య తీసుకోవాలంటూ బీజేపీ ఈ నెల 10న ఈసీని ఆశ్రయించింది. ''ఆప్ జాతీయ కన్వీనర్‌గా ఉంటూ మరో పార్టీ స్టార్ క్యాంపెయినర్ అయిన పీఎం మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరుతున్నాం. జాతీయ పార్టీకి, ఎన్నికల అభ్యర్థులకు వ్యతిరేకంగా ఆరోపణలు, దూషణల ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు తగిన చర్య ఎందుకు తీసుకోకూడదో తెలపండి'' అని నోటీసులో ఈసీ పేర్కొంది. స్పందించకుంటే వివరణ ఇచ్చేందుకు ఏమీ లేనట్టుగా భావించి తగు చర్యలకు ఉపక్రమిస్తామని వివరించింది.

రష్యా నుంచి ఇగ్లా-ఎస్ కొనుగోలు

భారత అమ్ముల పొదిలో శక్తివంతమైన యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ మిస్సైల్


న్యూఢిల్లీ: రష్యా నుంచి శక్తివంతమైన యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణి వ్యవస్థ 'ఇగ్లా-ఎస్' కొనుగోలుకు రంగం సిద్ధమైంది. ఈ వ్యవస్థ రాకతో భారత్-చైనా, భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత రక్షణ దళాలకు మరింత బలం చేకూరనుంది. ఇగ్లా-ఎస్ కొనుగోలు విషయంలో రష్యా, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు రష్యా వార్తా సంస్థ వెల్లడించింది. కాంట్రాక్టుపై రష్యా సంతకం చేసినట్లు తెలియజేసింది. ఆయుధాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని భారత్ నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ కొన్ని అత్యాధునిక ఆయుధాల కోసం విదేశాలపై ఆధారపడక తప్పడం లేదు. ప్రధానంగా రష్యా నుంచి అధికంగా ఆయుధాలను దిగుమతి చేసుకుంటోంది. 2018 నుంచి 2022 వరకు భారత్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో రష్యా ఆయుధాల వాటా 45 శాతం కాగా, ఫ్రాన్స్ ఆయుధాల వాటా 29 శాతం, అమెరికా ఆయుధాల వాటా 11 శాతంగా ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇగ్లా-ఎస్ యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణి వ్యవస్థ అవసరాన్ని భారత్ గుర్తించింది.

ఏమిటీ ఇగ్లా-ఎస్?

- ఇది శత్రు దేశాల యుద్ధ విమానాలను, హెలికాప్టర్లను కూల్చివేసే వ్యవస్థ
- ఒక వ్యక్తి గానీ, బృందాలు గానీ ఆపరేట్ చేసే ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్.
- తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లను సులభంగా నేలకూల్చవచ్చు.
- క్రూయిజ్ మిస్సైళ్లు, డ్రోన్లను కూడా కచ్చితంగా గుర్తించి, గాల్లోనే ధ్వంసం చేస్తుంది.
- ఒక్కో ఇగ్లా-ఎస్ సిస్టమ్‌లో 9ఎం342 మిస్సైల్, 9పీ522 లాంచింగ్ మెకానిజమ్, 9వీ866-2 మొబైల్ టెస్టు స్టేషన్, 9ఎఫ్719-2 టెస్టు సెట్ ఉంటాయి.

కర్ణాటక మాజీ సీఎంపై విద్యుత్ చౌర్యం కేసు

దొడ్డబళ్లాపురం: దీపావళి సందర్భంగా ఇంటికి విద్యుద్దీపాలంకరణ కర్ణాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామికి చిక్కులు తెచ్చింది. దానికోసం ఇంటి ముందున్న స్తంభం నుంచి అక్రమంగా కనెక్షన్ తీసుకున్నారంటూ విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆయనపై కేసు పెట్టారు. మంగళవారం జేపీ నగరలోని ఇంట్లో తనిఖీలు చేశారు. ఎంత అక్రమ విద్యుత్ వాడారో లెక్కగట్టి అధికారులకు నివేదిస్తామన్నారు. నోటీసిస్తే జరిమానా చెల్లిస్తానని, విషయాన్ని కాంగ్రెస్ సర్కారు పెద్దది చేస్తోందని కుమారస్వామి అన్నారు.



సొరంగం కుప్పకూలిన ఘటన.. డ్రిల్లింగ్ పనుల్లో అంతరాయం

టన్నెల్‌లో ఉన్న తండ్రితో మాట్లాడిన కొడుకు

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్ మార్గంలో సొరంగం కుప్పకూలి 60 గంటలకు పైగా లోపల చిక్కుబడిపోయిన 40 మంది కార్మికులను రక్షించే పనుల్లో మంగళవారం రాత్రి అంతరాయం ఏర్పడింది. కుప్పకూలిన టన్నెల శిథిలాల గుండా ఆగర్ మెషీన్ సాయంతో వెడల్పాటి స్టీల్ పైపులను లోపలికి పంపే పనులు మంగళవారం మొదలైనట్లు తెలిపారు. డ్రిల్లింగ్ పరికరాలను ఉపయోగించి 800, 900 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన స్టీలు పైపులను ఒకదాని తర్వాత ఒకటి లోపలికి పంపించి వాటి గుండా కార్మికులను వెలుపలికి తీసుకురావడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. అన్నీ సజావుగా సాగితే బుధవారాని కల్లా అందరినీ వెలుపలికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అయితే, రాత్రి వేళ డ్రిల్లింగ్ పనులు జరుగుతున్న సమయంలో మరోసారి టన్నెల్ శిథిలాలు విరిగిపడటంతో ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. వారిని వెంటనే అక్కడే ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రులకు ఎలాంటి ప్రమాదం లేనప్పటికీ పనులకు మాత్రం అంతరాయం ఏర్పడిందని అధికారులు చెప్పారు.

ఎటువంటి అపాయం లేదు

సొరంగం లోపల చిక్కుకున్న కార్మికులకు ఆక్సిజన్, మంచి నీరు, టీ, ఆహారం ప్యాకెట్లు, మందులను ట్యూబుల ద్వారా లోపలికి పంపిస్తున్నామని అధికారులు వివరించారు. కార్మికులు 400 మీటర్ల వెడల్పుండే బఫర్ జోన్‌లో చిక్కుబడి పోయారన్నారు. వారు తేలిగ్గా, నడవొచ్చు, గాలి పీల్చుకోవచ్చు అని వివరించారు. అందరూ ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్నారన్నారు. ఛార్‌ధామ్ ప్రాజెక్టులో భాగంగా బ్రహ్మఖాల్-యమునోత్రి జాతీయ రహదారిలో సిల్క్యారా- దండల్‌గావ్ మధ్య నిర్మిస్తున్న సొరంగం ఆదివారం ఉదయం సిల్క్యారా వైపు కూలిన విషయం తెలిసిందే. సొరంగంలో చిక్కుబడిన వారిలో బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులున్నారు.

ధైర్యంగా ఉండండి

టన్నెల్‌లో చిక్కుబడిపోయిన 40 మందిలో ఒకరైన ఉత్తరాఖండ్‌కు చెందిన కార్మికుడితో ఆయన కుమారుడు కొద్ది సెకన్ల పాటు మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నాడు. భయపడాల్సిన అవసరం లేదని, తనతోపాటు ఉన్న తోటి వారికి కూడా ధైర్యం చెబుతున్నానని అతడు పేర్కొన్నాడు. సొరంగం కుప్పకూలడంతో ఆదివారం ఉదయం నుంచి లోపలే ఉండిపోయిన 40 మందిలో ఉత్తరాఖండ్‌లోని కొట్‌ద్వార్‌కు చెందిన గబ్బర్ సింగ్ నేగి కూడా ఉన్నారు. నేగి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఘటనా స్థలి వద్దకు మంగళవారం ఉదయం నేగి కొడుకు ఆకాశ్, అన్న మహరాజ్ చేరుకున్నారు. అధికారులు పైపు ద్వారా ఆకాశ్‌కు తండ్రితో మాట్లాడే అవకాశం కల్పించారు. తమకు ఆక్సిజన్ అందుతోందని, భయపడొద్దని కుమారుడికి నేగి ధైర్యం చెప్పారు. ఇంట్లో వాళ్లకి కూడా ఇదే విషయం చెప్పాలని కోరారు. 'సొరంగం కూలిన ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. మాకు చాలినంత ఆహారం, నీరు అందుతున్నాయి. మరికొద్ది గంటల్లోనే సురక్షితంగా బయటకు వచ్చేందుకు ఇంజినీర్లు కృషి చేస్తున్నారు'అని కూడా నేగి తన కుమారుడికి తెలిపారు.



టన్నెల్ కూలిన ప్రాంతంలో రక్షణ, సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న సిబ్బంది

సునాక్‌కు పదవీ గండం!

- అవిశ్వాస లేఖ రాసిన సొంత పార్టీ ఎంపీ
- పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్

లండన్: తన మంత్రివర్గంలో అనూహ్యంగా మార్పులు చేసి, కొత్త వివాదానికి తెరలేపిన యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్ అవిశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పేలా లేదు. అవిశ్వాస పరీక్షను ఎదుర్కోవాలని, పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ సొంత పార్టీ(కన్జర్వేటివ్) ఎంపీ ఆండ్రియా జెన్‌కిన్స్ తాజాగా '1922 కమిటీ' చైర్మన్ సర్ గ్రాహమ్ బ్రాడీకి లేఖ రాశారు. రిషి సునాక్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి డిమాండ్ తెరపైకి రావడం ఇదే మొదటిసారి. సొంత పార్టీ నుంచే ఆయనపై వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. యూకే మాజీ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్‌ను వీరవిధేయుడిగా పేరుగాంచిన ఎంపీ ఆండ్రియా జెన్‌కిన్స్ రాసిన అవిశ్వాస లేఖ చర్చనీయాంశంగా మారింది. సునాక్ పదవి నుంచి తప్పుకోవాలని, ఆ స్థానంలో అసలు సిసలైన కన్జర్వేటివ్ పార్టీ నాయకుడిని నియమించాలని జెన్‌కిన్స్ తేల్చిచెప్పారు. ''జరిగింది ఇక చాలు. రిషి సునాక్ ఇంటికెళ్లాల్సిన సమయం వచ్చింది'' అని 'ఎక్స్'లో జెన్‌కిన్స్ పోస్టు చేశారు. అవిశ్వాస లేఖను కూడా జతచేశారు. ప్రధానమంత్రిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన బోరిస్ జాన్సన్ పదవి ఊడడానికి ముమ్మాటికీ సునాక్ కారణమని ఆయన ఆరోపించారు. సుయెల్లా బ్రేవర్మన్‌ను హోంమంత్రి పోస్టు నుంచి తొలగించడాన్ని జెన్‌కిన్స్ తప్పుపట్టారు. నిజాలు మాట్లాడినందుకే ఆమెపై వేటు వేశారని ఆక్షేపించారు. సునాక్ రాజీనామా కోసం తన సహచర ఎంపీలు కూడా గళమెత్తుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశం కోసం తాము పోరాడుతున్నామని పేర్కొన్నారు.

అవిశ్వాసం సాధ్యమేనా?

అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపీల్లో 15 శాతం మంది ఎంపీలు అవిశ్వాసాన్ని కోరుతూ లేఖలు రాస్తే సునాక్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. పార్లమెంట్‌లో అవిశ్వాస పరీక్ష ఎదుర్కోక తప్పదు.

నైపుణ్యం, అనుభవానికి పెద్దపీట: సునాక్

మంతివర్గంలో మార్పులపై ప్రధాని రిషి సునాక్ స్పందించారు. తన ప్రతిస్పందనను 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశానికి దీర్ఘకాలంలో అవసరమైన మార్పులకు శ్రీకారం చుట్టడానికి సిద్ధంగా ఉండే ఒక ఉమ్మడి బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నైపుణ్యం, అనుభవం, సమగ్రతకు పెద్దపీట వేశామన్నారు. దేశ కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడానికి ఈ బృందం తోడ్పడుతుందని వివరించారు.

ఎస్సైని ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేశారు

- బిహార్‌లో ఇసుక మాఫియా బరితెగింపు
- ఘటనలో హోం గార్డుకు తీవ్ర గాయాలు
- కొత్తేమీ కాదంటూ మంత్రి వ్యాఖ్యలు

జముయీ: బిహార్‌లో ఇసుక మాఫియా మరోసారి తెగబడింది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు యత్నించిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేసింది. ఈ ఘటనలో హోం గార్డు సైతం తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం బిహార్‌లోని జముయీ జిల్లా గర్హి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇసుక అక్రమ రవాణా విషయం తెలుసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాత్ రంజన్ తన సిబ్బందితో మహులియా టండ్ గ్రామానికి వెళ్లారు. అనుమతి లేకుండా తవ్విన ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించారు. అయితే, డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపకుండా ఆయనపైకి పోనిచ్చారు. ఈ ఘటనలో ఎస్సైతోపాటు ఒక హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎస్సై ప్రభాత్ రంజన్ మృతి చెందారు. హోంగార్డు రాజేశ్‌కుమార్ సావో పరిస్థితి విషమంగా ఉన్నట్లు జముయీ ఎస్పీ శౌర్య సుమన్ తెలిపారు. పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలింపు చేపట్టినట్లు చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. ఘటన సమయంలో ట్రాక్టర్‌పై కూర్చున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎస్సై ప్రభాత్ రంజన్‌కు భార్య, నాలుగేళ్ల కూతురు, ఆరు నెలల కొడుకు ఉన్నారు.

ఇవి జరుగుతూనే ఉంటాయి..!

దాడి ఘటనలు కొత్తేం కావంటూ బిహార్ విద్యా మంత్రి చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి 'ఇలాంటివి కొత్త కాదు. జరుగుతూనే ఉంటాయి. గతంలో యూపీ, మధ్యప్రదేశ్‌ల్లోనూ చోటుచేసు కున్నాయి'అని ఆయన అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కెనడాలో దీపావళి వేళ ఖలిస్తానీల ఆగడాలు

బ్రాంప్టన్: కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారులు మరోసారి పేట్రేగిపోయారు. దీపావళి వేడుకలు జరుపుకుంటున్న హిందువులపైకి రాళ్లు రువ్వారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఖలిస్తానీ జెండాలు పట్టుకున్న కొందరు నేలపై వస్తువులను తీసుకుని, హిందువులపైకి విసురుతుండటం, వారిని పోలీసులు వెనక్కి వెళ్లిపోవాలంటునట్టుగా ఉన్న వీడియోను ఓ వ్యక్తి 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. ఈ ఘటన ఒంటారియో శివారు నగరం బ్రాంప్టన్‌లోని వెస్ట్‌వుడ్ మాల్ వద్ద జరిగినట్లు అతడు తెలిపాడు. దర్యాప్తు చేపట్టినట్లు పీల్ ఏరియా పోలీసులు తెలిపారు. హింసను ప్రేరేపించడం, ప్రార్థనా స్థలాలు, మైనారిటీలపై దాడులు, విద్వేష నేరాలకు తెగబడటం, విద్వేష ప్రసంగాలిస్తూ వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగపరిచే వారిపై చర్యలు తీసుకోవాలని కెనడాను భారత్ కోరింది. గత వారం జెనీవాలో జరిగిన ఐరాస మానవ హక్కుల సంఘం సమావేశంలో భారత్ ప్రతినిధి కేఎస్ మహ్మద్ హుస్సేన్ కెనడాకు సూచించారు.


కొట్టుకుపోయిన కొండాయి బ్రిడ్జి ఇదే..

కొండాయి గ్రామ జనాభా 1860
ఓటర్లు: 1220 | నివాస గృహాలు: 418

ఓటేయాలంటే.. వాగు దాటాలె

గత జూలై వరదలకు కొట్టుకుపోయిన కొండాయి బ్రిడ్జి

మరమ్మతులకు నోచుకోని వైనం

వాగు దాటలేక తంటాలు... ప్రతీ పనికి అవస్థలే..

అలువాల శ్రీనివాస్

బతకడం వేరు. జీవించడం వేరు. వాళ్లు కేవలం బతుకుతున్నారంతే.. జీవించడాన్ని మన పాలకులు వాళ్లకింకా అలవాటు చేయలేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులూ మారుతున్నా.. ఆవిష్కరణలు ఆకాశాన్ని చుట్టేస్తున్నా.. ఇప్పటికీ ములుగు జిల్లాలోని కొన్ని గ్రామాల ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాగులు దాటుతున్నారు. ఈ ఏడాది జూలై 27న వరద ఎనిమిది మందిని మింగింది. ఇప్పటికీ ఆ గ్రామాల్లో ఏ మనిషిని కదిలించినా రోదనలే. అంతు చిక్కని వేదనలే. వారిని 'సాక్షి' పలకరిస్తే వాగంత దుఃఖాన్ని వెళ్లబోసుకున్నారు. వారి ఎజెండా.. ఏమిటో చెప్పుకొచ్చారు.


కడుపులో బిడ్డ అడ్డం తిరిగింది

మా అమ్మగారింటికి(కొండాయి) తొలుసూరు కాన్పు చేయించుకునేందుకు వచ్చిన. వాగుపై బ్రిడ్జి కూలింది. నొప్పులు రావడంతో వాగులో నుంచి నడుములోతుల్లో దాటుకుంటుపోయిన. దొడ్లకు చేరుకొని అక్కడి నుంచి ఏటూరునాగారం, ములుగు వెళ్లేసరికి బిడ్డ అడ్డం తిరిగింది. పెద్దాపరేషన్ చేసి డెలివరీ చేసిండ్లు. మళ్లీ బాలింత నొప్పులతో ఉంటే.. మా అమ్మనాన్న, వాళ్ల మరో పదిమంది కలిసి డొల్ల కట్టుకొని ఇంటికి తీసుకొచ్చారు.

- మానేటి సంధ్యారాణి, బాలింత, కొండాయి

ఐదు నెలల నుంచి అంతులేని వ్యథ

ఈ ఏడాది జూలై 27న ఆకాల వర్షాలకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండల పరిధి హైలెవెల్ బ్రిడ్జి కూలింది. జంపన్న వాగు ఉధృతికి కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఆయా గ్రామాల ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొండాయి గ్రామంలో వరద 8 మందిని జల సమాధి చేసింది. బ్రిడ్జి కొట్టుకుపోవడంతో కొండాయి, మల్యాల, గోవింద రాజుల కాలనీకి పూర్తిగా రాకపోకలు నిలిచాయి. ఐదు నెలల నుంచి ఆయా గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరమయ్యారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగులు దాటుతున్నారు. గర్భిణులు ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు డొల్లాలు కట్టి వాగు దాటిస్తున్నారు. రేషన్ బియ్యం కోసం సైతం కొండాయిలో వేలి ముద్రవేసి.. వాగుదాటి దొడ్లకు వెళ్లి అక్కడి నుంచి బియ్యాన్ని మోసుకుంటూ ఇళ్లకు చేరుకుంటున్నారు.


ఎరువు అందుతలేదు..

పొలం పనుల కోసం కావాల్సిన ఎరువు బస్తాలు, ఇతర సామగ్రిని తెచ్చుకునేందుకు నరకం కనిపిస్తోంది. ఎరువు బస్తాలను వాగులో నుంచి తలపై పెట్టుకొని దాటించడం కష్టంగా మారింది. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఇలా వ్యవసాయ పనిముట్లకు కష్టాలు పడుతూ వాగుదాటాల్సి వస్తోంది.

-బొచ్చు ఉపేందర్, రైతు

ఇంటికి మగదిక్కు లేకుండా పోయింది


ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం. నా భర్త, కొడుకు జంపన్న వాగు ప్రమాదంలో చచ్చిపోయిండ్లు. ఇంటికి మగదిక్కులేకుండా పోయింది. ఇప్పుడు ఒక్కదాన్నే ఉంటున్నా. నాకు ఏ అవసరం వచ్చినా.. ఆదుకునే వారే లేరు. బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న.

- మున్నిబేగం, కొండాయి



పీపుల్స్ ఎజెండా

ఒక్క కొండాయి గ్రామమే కాదు... ఏజెన్సీ పరిధిలోని అనేక ఆదివాసీ గూడేల ప్రజలు వంతెనలు లేక నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఎన్నికల మేనిఫెస్టోల్లో, పోటీలో ఉన్న నేతల హామీల్లో వీరి సమస్యలు ఎక్కడా కనిపించవు. ఏజెన్సీ వాసుల ఇబ్బందులు ఇలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదు లక్షల మంది బీడీ కార్మికులు ఏళ్ల తరబడి సమస్యలతో సతమతమవుతూనే ఉన్నారు. వీరి వెతలు నేతల చెవికెక్కుతాయన్న ఆశతో ఉన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల వేళ... ఈ పీపుల్స్ ఎజెండాకు మోక్షం లభిస్తుందని వారు ఎదురుచూస్తున్నారు.

జంగ్ తెలంగాణ

బీడీ బతుకులు మారలే...

ముజఫర్

మహిళల ఆర్థిక పరిపుష్టి, స్వావలంబనకు ఆసరాగా నిలుస్తున్న బీడీ పరిశ్రమ మసకబారిపోతున్న క్రమంలో తమ బాగుకు పనిచేసే వారి కోసం ఆ కార్మికులు ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపించేంతటి శక్తి ఉన్న తమను ఏ రాజకీయ పార్టీలు ఆదరిస్తాయా.. అని బీడీ కార్మికులు లెక్కలు వేసుకుంటున్నారు. బీడీ కార్మికులకు ఇప్పటి వరకు అందుతున్న జీవనభృతిని నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేలు చేస్తామని వివిధ రాజకీయ పార్టీలు హామీలిస్తున్నాయి. అయితే, కార్మికుల కనీస వేతనం, పింఛన్ పెంపుతో పాటు పూర్తిస్థాయిలో పని దినాలు కల్పించడం, సంక్షేమం, వైద్య సౌకర్యాల అమలు హామీలు దిశగా రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలని కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

4,74,438
రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికులు

బీడీ కార్మికులకు అందని సంక్షేమ పథకాలు.. వైద్యసేవలు

కార్మికులకు వేతనాల పెంపు అంశంలో యాజమాన్యాలు ఆడిందే ఆటగా సాగుతోంది. గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన ప్రధాన కంపెనీలపై స్థానిక సర్కారు అజమాయిషీ అంతంతమాత్రమే కావడంతో న్యాయం జరగడం లేదు. 2010 నవంబర్‌లో వేతనాల పెంపు కోరుతూ కార్మికులు బంద్ పాటించారు. సుమారు 32 రోజులపాటు సమ్మె సాగిన క్రమంలో అప్పటి

కంపెనీలను కట్టడి చేసేదెవ్వరు?

సర్కార్ కార్మికుల కనీస వేతనం రూ.130గా నిర్ణయిస్తూ 2011 డిసెంబర్‌లో జీఓ 41 ద్వారా ఉత్తర్వులు జారీచేసింది. ఈ జీఓ అమలుకు యాజమాన్యాలు ఒప్పుకోలేదు. దాంతో కార్మిక సంఘాలు మరోసారి చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం జీఓ 81 జారీ అయ్యింది. ప్రస్తుతం వేయి బీడీలకు రూ.231 మాత్రమే ఇస్తున్నారు. వాస్తవానికి జీఓ 41 అమలైతే ప్రస్తుత పరిస్థితుల్లో వేయి బీడీలకు కనీసంగా రూ.600 వస్తాయని కార్మికులు చెబుతున్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వస్థాయిలో సైతం ఒత్తిడి తెచ్చి కంపెనీల యాజమాన్యాలను ఒప్పించేలా ఎన్నికల బరిలో ఉన్న పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలన్న డిమాండ్ ఉంది.

తగ్గుతున్న అమ్మకాలు.. పనిదినాలపై ప్రభావం

తెలంగాణలో సుమారు 4,74,438 లక్షల మంది బీడీ కార్మికులున్నారు. ఈ మధ్యకాలంలో మార్కెట్లలోకి వచ్చి చేరుతున్న మినీ సిగరెట్లతో బీడీల అమ్మకాలు పడిపోతున్నాయి. ఫలితంగా కంపెనీలు తమ అవసరాలకు అనుగుణంగా నెలకు పది నుంచి పదిహేను రోజులు మాత్రమే కార్మికులకు ఆకు, తంబాకు ఇస్తూ మిగిలిన రోజుల్లో కంపెనీలు బంద్ చేస్తున్నాయి. కార్మిక చట్టాల ప్రకారం కనీసం ఏడాదికి 312 పనిదినాలు కల్పించాల్సి ఉండగా, యాజమాన్యాలు మాత్రం 100 నుంచి 120 రోజులు మాత్రమే పనిదినాలు కల్పిస్తున్నాయి. వాస్తవానికి సిగరెట్లపై నిబంధనల మేరకు ప్రచారం కల్పిస్తుండగా, బీడీలపై కనీసంగా ప్రచారం లేకపోవడంతోనే అమ్మకాలు తగ్గిపోతున్నాయని, ఫలితంగా తమ పనిదినాలూ తగ్గుతున్నాయని కార్మికులు వాదిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించే దిశగా ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ దృష్టి సారించలేదన్న అసంతృప్తి కార్మికుల్లో నెలకొంది.





ప్రధాన సమస్యలు..

- పని దినాల కుదింపు.. ఫలితంగా వేతనం చాలడం లేదు జీఓ 41(కనీసవేతన చట్టం) అమలు కాలేదు.
- ఈఎస్ఐ వైద్య సౌకర్యం పూర్తిస్థాయిలో లేదు.
- సంక్షేమ పథకాలపై కార్మికులకు అవగాహన కరువు. పట్టించుకోని కార్మికశాఖ.
- 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రధాన హామీ ప్రత్యామ్నాయఉపాధి.. కానీ ఇంతవరకు చూపలేదు.
- బీడీ కట్టపై పుర్రెగుర్తు తొలగింపు అమలుకాలేదు.
- జిల్లాకో ఈఎస్ఐ ఆస్పత్రి ఉండాలని కార్మికుల దీర్ఘకాల డిమాండ్

ఆసరా పింఛన్ రావడం లేదు


నేను ఏడేళ్లుగా బీడీలు చేస్తున్నా. పీఎఫ్ కూడా ఉంది. కానీ ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ రావడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇస్తామని అంటున్నారే తప్ప.. మంజూరు చేయడం లేదు.

– బోండ్ల స్రవంతి, రాచర్లబొప్పాపూర్

ఫెంటాస్టిక్ ఫోర్ పవర్ పోరు

శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి

అవి తెలంగాణకు నాలుగు దిక్కుల్లో ఉన్న శాసనసభ నియోజకవర్గాలు. కులాలు, మతాలతోపాటు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వైరుధ్యం ఉన్న ప్రాంతాలు. కానీ ఎన్నికలొచ్చినప్పుడు మాత్రం ఒక్కటిగానే ఆలోచిస్తున్నాయి. ఒకరికొకరు కూడబలుక్కున్నట్టుగా తీర్పునిస్తున్నాయి. అంతేకాదు 1952 నుంచి 2018 వరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఒక్కసారి మినహాయిస్తే.. మిగిలిన అన్ని ఎన్నికల్లో ఇక్కడ గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపట్టింది. ఇక్కడ గెలిస్తే రాష్ట్రంలో అధికారం ఖాయమన్న సెంటిమెంట్‌కు అచ్చంపేట, అందోల్, సికింద్రాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలు ప్రాతిపదికగా నిలిచాయి. దీంతో ఈసారి కూడా అందరి చూపు ఈ నాలుగు నియోజకవర్గాలపైనే కేంద్రీ కృతమైంది. ఏడు దశాబ్దాల సెంటిమెంట్‌ను బ్రేక్ చేస్తాయా? ఆనవాయితీకే పట్టం కడతాయా? అనేది ఆసక్తికరంగా మారింది.

లక్కీ లిస్ట్‌లో అందోల్, అచ్చంపేట, గజ్వేల్, సికింద్రాబాద్

ఈ 4 నియోజకవర్గాల్లో ఎవరు గెలిస్తే.. ఆ పార్టీదే అధికార పీఠం

రాష్ట్రానికి నాలుగు దిక్కుల్లో ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లు

సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వైరుధ్యం ఉన్న ప్రాంతాలు



1 'అచ్చం' అదే ట్రెండ్..

నల్లమల అడవిని ఆనుకుని ఉన్న అచ్చంపేట నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయం, దాని అనుబంధ ఆదాయాలపైనే ఆధారపడిన ప్రాంతం. అత్యధికంగా ఎస్సీ, ఎస్టీలు ఉన్న ఈ సెగ్మెంట్‌లో అక్షరాస్యులు తక్కువే. నాగర్‌కర్నూల్ ద్విసభ నియోజకవర్గం నుంచి వేరుపడి 1962లో అచ్చంపేటగా ఏర్పడిన అనంతరం 2018 వరకు 13 సార్లు ఎన్నిక జరిగితే. 2009లో ఒక్కమారు మినహా, మిగిలిన అన్ని సందర్భాల్లోనూ ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన అభ్యర్థి పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపట్టడం గమనార్హం. పి.మహేంద్రనాథ్ 1972లో కాంగ్రెస్, 1983, 85లలో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించి ఎన్టీఆర్ కేబినెట్‌లో కీలక పదవులు నిర్వహించారు. 2009లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఇక్కడ మాత్రం టీడీపీ అభ్యర్థి పి.రాములు తన సమీప ప్రత్యర్థి డాక్టర్ వంశీకృష్ణపై 4,831 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ నియోజకవర్గానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఒక అభ్యర్థి, ఒక పార్టీ నుంచి రెండుమార్లు కంటే ఎక్కువగా గెలవకపోవడం.

2 సికింద్రాబాద్.. గెలిస్తే జిందాబాదే

ఆంగ్లో ఇండియన్లకు తోడు తమిళ, మలయాళీలు, పక్కా తెలంగాణ మూలాలున్న అడ్డా కూలీలతో నిండిపోయిన సికింద్రాబాద్ తీర్పు సైతం ఎప్పుడూ ప్రత్యేకమే. 1952 -2018 వరకు 15 సార్లు సాధారణ ఎన్నికలు జరిగితే 14 మార్లు.. ఇక్కడ ఏ పార్టీ కూటమి గెలిస్తే.. అదే పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 1978లో మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్(ఐ) 175 స్థానాల్లో విజయం సాధించి అధికారం చేపట్టినా.. ఇక్కడ మాత్రం జనతా పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన ఎల్.నారాయణ, తన సమీప కాంగ్రెస్(ఐ) అభ్యర్థిపై 8,152 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2004లో కాంగ్రెస్ మద్దతుతో టీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలోనూ 1957, 62, 67 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కె.సత్యనారాయణ మినహాయిస్తే, మరెవరూ వరుసగా మూడుమార్లు విజయం సాధించలేదు.

3 అందోల్ తీరూ అంతే..

కన్నడ-తెలంగాణ సమ్మిళిత సంస్కృతి కనిపించే ఈ నియోజకవర్గంలో ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన వర్గాలే అత్యధికం. 1952లో ద్విసభ నియోజకవర్గంగా ఏర్పడిన అందోల్‌లో 2018 వరకు జరిగిన 15 ఎన్నికల్లో ఒక్కమారు మినహా ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీయే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1983లో రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపడితే, ఇక్కడ మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌జీ.. ఈశ్వరీబాయిపై విజయం సాధించారు. ఇక అత్యల్ప మెజార్టీలతో గెలిచిన అదృష్టవంతులు కూడా ఈ నియోజకవర్గంలోనే ఉండటం గమనార్హం. ఇక్కడ కూడా వరుసగా 3 సార్లు ఎవరూ గెలవకపోవటం విశేషం.

4 గజ్వేల్.. కమాల్

హైదరాబాద్‌కు సమీపాన్నే ఉన్నా.. పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన గజ్వేల్‌లోనూ 1952 నుంచి 2018 వరకు జరిగిన 15 ఎన్నికల్లో గెలిచిన పార్టీనే 13 మార్లు అధికారంలోకి వచ్చింది. 1952లో జరిగిన తొలి ఎన్నికలో కమ్యూనిస్టుల అభ్యర్థి పెండెం వాసుదేవ్, కాంగ్రెస్ అభ్యర్థి మాడపాటి హన్మంతరావుపై 15 వేలకు పైగా ఓట్లతో విజయం సాధిస్తే, 1962లో కాంగ్రెస్ అభ్యర్థి జి.వెంకటస్వామిపై, స్వతంత్ర అభ్యర్థి గజ్వేల్ సైదయ్య 1,035 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ ఇక్కడ గెలిచిన పార్టీలే రాష్ట్రంలోనూ అధికార పగ్గాలు చేపట్టాయి. ఈ నియోజకవర్గం నుంచి మూడుమార్లు గెలిచిన అభ్యర్థిగా గజ్వేల్ సైదయ్య పేరిటే ఇప్పటికీ రికార్డు ఉంది. అయితే 2014, 18లలో విజయం సాధించిన కేసీఆర్..మూడోసారి కూడా ఇక్కడి నుంచే పోటీకి దిగటంతో గజ్వేల్‌పై ఆసక్తి నెలకొంది.

ఒకే తీర్పు..ఒకింత విచిత్రమే..

"ఈ నాలుగు నియోజకవర్గాల ఓటర్లు ఇస్తున్న తీర్పు ఎప్పుడూ ఆసక్తికరమే. ఈ నాలుగు ప్రాంతాల్లో విభిన్న సామాజిక వర్గాలు ఉన్నాయి. భౌగోళికంగానూ చాలా భిన్నమైన ప్రాంతాలు. పెద్దగా ఆశలు, ఆకాంక్షలు లేని వారు అత్యధికంగా ఉండే నియోజకవర్గాలు. కానీ ఎప్పుడూ ఇక్కడ గెలిచిన పార్టీలే దాదాపుగా ప్రతిసారీ అధికారం చేపట్టడం ఒకింత విచిత్రమే అని చెప్పాలి.

– మల్లేపల్లి లక్ష్మయ్య, సామాజిక విశ్లేషకుడు



కోట్లున్నా.. కారుండదు.. ఎందుకు?

నేతల 'అఫిడవిట్లు' వెనుక కారణమిదే

గౌరీభట్ల నరసింహమూర్తి

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన సమయంలో ఓ అంశం సాధారణ ప్రజల్లో కొత్త ఆలోచనను రేపుతుంటుంది. మంత్రులు, మాజీ మంత్రులు, ఇతర కీలక పదవుల్లో ఉన్న కొందరు 'నాకు సొంత కారు లేదు' అని నామినేషన్ల అఫిడవిట్‌లో చూపుతుంటారు. వారి ఆస్తులు మాత్రం రూ.కోట్లలో ఉంటాయి. ఇంత ఆస్తిపరులకు సొంత వాహనం ఎందుకు ఉండదు..?? కోట్లకు పడగలెత్తిన బడా నేతలు సొంత వాహనాన్ని కొనుక్కునే పరిస్థితిలో లేరా..?? వారి ఇళ్ల ఎదుట డజనుకుపైగా కనిపించే ఖరీదైన విలాసవంతమైన కార్లు ఎవరివి..?? ఈ అనుమానాలు చాలా మంది బుర్రలను తొలిచేస్తుంటాయి. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. కొందరు మంత్రులు సహా పలు పార్టీలకు చెందిన బడా నేతలు సొంత కారు లేదని ప్రకటించారు. ఇలా ఎందుకంటే..

ఏ కేసు పెట్టినా.. వెళ్లాల్సిందే...

ఆ వాహనం ఏదైనా వివాదంలో చిక్కుకున్నా, ప్రమాదానికి గురైనా న్యాయపరమైన అంశాల్లో యజమాని పేరు నమోదవుతుంది. ప్రమాదానికి గురైన సందర్భాల్లో యజమాని వాహనంలో ప్రత్యక్షంగా లేకున్నా, కేసులను మాత్రం స్వయంగా ఎదుర్కొనక తప్పదు. పోలీసులు, న్యాయస్థానం ముందు యజమాని ప్రస్తావన రావటంతోపాటు, నేరుగా హాజరు కావాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. వాహన యజమానులు రాజకీయంగా ఉన్నత స్థానాల్లో ఉన్నప్పుడు ఇవి ఇబ్బందికరంగా మారుతాయి. ఇక వాహనాలు నేతల పేర్లతో లేకున్నా, కొన్ని సందర్భాల్లో వాటిపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ స్టిక్కర్లు ఉంటుంటాయి. అలా ఉన్న కార్లు ప్రమాదాలకు గురైనా, ఇతర వివాదాల్లో చిక్కుకున్నా.. ఆ స్టిక్కర్ల వల్ల నేతలకు ఇబ్బందులు ఎదురవుతున్న సందర్భాలు ఎన్నో. కేవలం స్టిక్కర్ల ద్వారానే అలాంటి పరిస్థితి ఎదురైతే, వాహన రిజిస్ట్రేషన్‌లో యజమానిగా నేతల పేర్లు ఉంటే వారికి మరిన్ని ఇబ్బందులు సహజం. ఈ పరిణామాలను ముందుగా ఊహించే కొందరు బడా నేతలు తమ పేర్లతో వాహనాలు కొనటం లేదు. ఇది కేవలంనేతలకే పరిమితం కాలేదు. పారిశ్రామికవేత్తలు, విద్యా సంస్థలవారు, బడా వ్యాపారులు, సినిమా నటులు.. ఇలా చాలా రంగాలకు చెందిన వారిలో ఈ ధోరణి ఉంది. నామినేషన్ వేసిన ఓ మంత్రి తన అఫిడవిట్‌లో సొంత వాహనం లేదని చూపించారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచి ఆయన విద్యా సంస్థల అధిపతిగా ఉన్నారు. అప్పుడు గానీ, ఇప్పుడు గానీ ఆయన వాహనాలను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవటం లేదు.

ఆర్టీఏ కార్యాలయాలకు రావాల్సి రావటం..

వాహన రిజిస్ట్రేషన్ సమయంలో యజమాని ఆర్టీఏ కార్యాలయాలకు రావాల్సి ఉండటం కూడా దీనికి మరో కారణం. అక్కడికి వచ్చి రిజిస్ట్రేషన్ తంతు పూర్తి చేసే వరకు ఉండటం ఇబ్బందిగా భావిస్తున్నారు.

నామ బలం.. అభిమానంతో కొంతమంది..

వాహనాన్ని కొనేప్పుడు ఎవరి పేరుతో కొంటే మంచి జరుగుతుందో అన్న నమ్మకాలు కొందరిలో ఉంటాయి. ప్రతి పనికీ ముహూర్తాలు, నామ బలం చూసుకునే అలవాటు ఉన్నవారు దీనికి ప్రాధాన్యం ఇస్తారు. తమ పేరుతో కలిసి రాదని భావిస్తే వేరేవారి పేరుతో కొంటుంటారు. ఇక కొందరు ఆప్తులుగా భావించే వారిపై ఉన్న అభిమానంతో వారి పేరుతో వాహనాలు కొంటుంటారు. ఇది కూడా వాహనాలు యజమాని పేరుతో కాకుండా ఇతరుల పేరుతో ఉండటానికి కారణమవుతోంది.

ఆదాయ పన్నుల భారం లేకుండా..

ఆయనో పారిశ్రామికవేత్త.. రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ఇంటి ఆవరణలో డజనుకు పైగా విలాసవంతమైన కార్లు ఉంటాయి.. కానీ ఏదీ ఆయన పేరుతో ఉండదు. వాటి ఖర్చు, బ్యాంకు లోన్ల వ్యవహారం ఆయనకు సంబంధం లేదు. అన్నీ ఆయన సంస్థల నుంచే భరిస్తున్నట్టు చూపుతున్నారు. దీంతో ఆదాయపన్నులో ఆ కార్ల ఖాతా ఉండటం లేదు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్న పారిశ్రామిక వేత్తలు, విద్యా సంస్థల అధిపతులు దాదాపు ఇదే సూత్రాన్ని పాటిస్తున్నారు.

సాక్షి



other voice

రాజకీయమార్పులకు వేదికల్లా వర్సిటీలు ఎదగాలి

- నేటి విశ్వవిద్యాలయాలు ఉద్యమాల పురిటిగడ్డలు
- అంబరాన్ని తాకే ఆలోచనలకు అవే వేదికలు
- రాజకీయ విలువలకు విద్యార్థి దశలోనే పునాది
- ఉద్యోగం రావడం కాదు.. ఇవ్వగలిగే నైపుణ్యం ముఖ్యం
- యువతకు ప్రేరణ ఇచ్చే రాజకీయ విధానం అవసరం

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

గౌటె దేవేందర్

వ్యవస్థను మార్చే నిప్పుకణాలకు విశ్వవిద్యాలయాలే పునాదులు వేస్తాయన్నది ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి అభిప్రాయం. ఉప్పొంగే ఆ యువరక్తంలో కనిపించేది ఆవేశమే కాదు... భావితరాల ఆలోచనా విధానం అనేది ఆయన విశ్లేషణ. రాజకీయ చిత్రపటంలో అత్యున్నత శిఖరాల్లో కనిపించే నేటితరం నేతల ఆశయ పునాదులు యూనివర్సిటీల్లో కన్పిస్తాయని విశ్లేషిస్తారాయన. సమ్మిళితమైన చదువు, రాజకీయాలను వేర్వేరుగా చూడలేమన్నది ఆయన భావన. ఉద్యమాల పురిటిగడ్డలైన తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా రాణించిన నేపథ్యం లింబాద్రిది. అంచెలంచెలుగా ఎదిగి, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి అసెంబ్లీ ఎన్నికల వేళ తన మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు. అది ఆయన మాటల్లోనే ...

రాజకీయాలకు విద్యార్థి దశే కీలకం

విలువలతో కూడిన రాజకీయాలకు విద్యార్థి దశే పునాది వేస్తుంది. విద్యతో పాటు రాజకీయ అవగాహన ఉండాలి. మార్పును కోరుకునేదే విద్య. అలాంటప్పుడు రాజకీయ మార్పును ఎందుకు ఆశించకూడదు? యువ చైతన్యాన్ని ఎందుకు స్వాగతించకూడదు? రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఎంతోమందిని చూడండి. ఆకాశాన్ని తాకే వారి ఆలోచనా శక్తి విద్యార్థి నేపథ్యం నుంచే కన్పిస్తుంది. అందుకే యువతరాన్ని రాజకీయాల్లోకి రానివ్వాల్సిందే. ప్రోత్సహించాల్సిందే. నిజానికి రేపటి అభివృద్ధిని అంచనా వేయగలిగేది విద్యార్థి లోకమే. భావితరం ఉన్నతికి బాటలేసేది యువతరమే. ఆ దిశగానే విద్యా బోధన ఉండాలి. సరికొత్త మార్పును ప్రేరేపించే విధానపరమైన లక్ష్యాలు విద్యలో జొప్పించాలి. ఉదాహరణకు సాంకేతికతనే తీసుకోండి. ఎన్ని మార్పులొచ్చాయి. సంప్రదాయ కోర్సుల స్థానంలో టెక్నాలజీ కోర్సుల వైపు యువత మొగ్గుచూపుతున్నారు. విశ్వవ్యాప్తంగా వచ్చిన ఈ మార్పును మనమూ అందిపుచ్చుకోవాలి. ఆ క్రమంలో ఆలోచన విధానంలోనూ మార్పులు తేవాలి. మార్కెట్లో మన శక్తిసామర్థ్యాలు నిరూపించుకునే సత్తా మన యువతరానికి ఉంది. దీన్ని మరింత పెంచగలిగే విధానపరమైన నిర్ణయాలు ప్రజల నుంచి వచ్చే నేతలు చేయాలి. విద్యార్థి దశలోనే రాజకీయ నేపథ్యం ఉన్న నేతకు ఇది మరింత బోధపడుతుందనేది నా అభిప్రాయం.

సర్కారీ కొలువునే ఉద్యోగం అనుకోవద్దు..

ప్రతీ ఎన్నికల్లోనూ యువత, ఉపాధి అవకాశాలు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నాయి. ఈ దిశగా అన్ని పార్టీలూ స్పందిస్తున్నాయి. కానీ వాస్తవాలను యువత తెలుసుకోవాలి. సర్కారీ కొలువునే ఉద్యోగం అనుకోవద్దు. లక్షల్లో గ్రాడ్యుయేట్లు తయారవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు వేలల్లో ఉంటున్నాయి. అంతమాత్రాన ఉపాధి లేకుండా పోతుందా? ఉద్యోగం కావాలనుకునే ప్రతీ వ్యక్తి తన నైపుణ్యాన్ని పెట్టుబడిగా పెట్టి ఉద్యోగాలు సృష్టించాలి. ఆ దిశగా మన ఎన్నికల ప్రణాళికలూ ఉండాలి. ఈ వాస్తవాన్ని నేతలు యువతకు వివరించి చెప్పాలి. ఆలోచనలు రేకెత్తించాలి. నిజానికి ఈ తరహా విద్య వైపు తెలంగాణ అడుగులు వేస్తోంది. ఉద్యోగం రాలేదనే తాత్కాలిక అసంతృప్తిని పక్కనబెడితే... ఉపాధి బాటలు వేయగల సామర్థ్యం ఉందని గుర్తిస్తే చాలు.. శాశ్వత పరిష్కారం దొరికినట్టే.

విద్యారంగ శ్రేయస్సే పార్టీల ఎజెండా కావాలి

విద్యార్థి లోకాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించడంలో ప్రభుత్వాల కృషి మరువలేనిది. ప్రతిభకు దన్నుగా నిలిచే గురుకులాలు, రెసిడెన్షియల్స్, ఊతం ఇచ్చే వివిధ రకాల సంక్షేమాలు అభినందనీయమే. నిజానికి విద్యను భావితరాల పెట్టుబడిగానే చూడాలి. అత్యుత్తమ మానవ వనరులు అందించే కేంద్రంగానే పరిగణించాలి. ఆ దిశగా పార్టీల మేనిఫెస్టోలు ఉండాలి. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రపంచవ్యాప్తంగా మార్పులొస్తున్నాయి. దీన్ని అందుకోవాలంటే బోధన నాణ్యత పెంచాల్సిందే. అందుకు అనుగుణంగా ఖాళీల భర్తీ అనివార్యం. మన విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికీ పెద్ద ఎత్తున ఖాళీలున్న మాట వాస్తవం. వాటి భర్తీకి చేపట్టిన చర్యలు, పారదర్శక నియామక విధాన నిర్ణయం ఆమోదించాల్సిందే. ఈ దిశగా చేపట్టిన కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు మరో అడుగుగానే చెప్పాలి.

ప్రశ్నించే తత్వమే రాజకీయ పునాది


ప్రశ్నించే తత్వం నుంచే ఆలోచనలు ఉద్భవిస్తాయి. నిలదీసే నైజం నుంచే కోరుకున్న మార్పూ సాధ్యమవుతుంది. అది విద్యార్థి దశ నుంచే మొదలవ్వాలి. ఒక్కో విద్యార్థికి ఒక్కో ఆశయం ఉంటుంది. ఆ కలల స్వప్నంలోంచే గొప్ప రాజకీయవేత్తలూ పుట్టుకొస్తారు. పారిశ్రామిక వేత్తలూ ఆవిర్భవిస్తారు. రచయితలు, సైంటిస్టులూ.. రాజకీయ విశ్లేషకులు... ఇలా అన్ని వర్గాల మేధావులు సరికొత్త ఆలోచనల్లోంచే తెరపైకి వస్తారు. విద్యార్థికి రాజకీయాలెందుకు? అనే వాదనలో అర్థం లేదు. నిజానికి ఆ దిశగా విద్యార్థి లోకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరమూ ఉంది. మార్కుల పరుగులే కాదు... రాజకీయ మార్పులకు వేదికల్లా విశ్వవిద్యాలయాలు ఎదగాల్సిందే.

ఇదో ఆధునిక రా.కీ.నే! కుమారులూ... ఏడు చేపల కథ!

ఇదో కథ. తరతరాలుగా తెలిసిందే. ఎంతోమంది రాజకీయ నేతలకు తరచూ అనుభవంలోకి వచ్చిన కథే. తరం తర్వాత తరం... ఇలా తర్వాతితరానికి తెలియాలనే ఉద్దేశంతో విచిత్ర వింత తంత్ర, కాతంత్ర, కుతంత్ర, బహుళతంత్రాలు రాసిన మహామునుల్లాంటి రాజకీయ విశ్లేషకులు దీన్ని గ్రంథస్థం చేసిన కథ. కేవలం ప్రైవేట్ సర్క్యులేషన్‌లో ఉంచిన ఈ ఓపెన్ సీక్రెట్ గాథ సారాంశమేమిటంటే...

అనగనగనగా ఓ రాజకీయనేత. రాజులాంటి ఆ రా.కీ. నేతకు ఏడుగురు కొడుకులు.

ఓ రోజున రా.కీ. నేత ఇలా అన్నాడు. ''కుమారులారా... ఎన్నాళ్లు నా పంచనబడి ఇలా బతికేస్తారు. ఇక మీరు కూడా స్వతంత్రంగా ఓటర్లకు గాలమేసి, వాళ్లను చేపల్లా పట్టుకునే టైమొచ్చింది'' అని చెప్పాడు. ఇలా చెబుతూనే..ఓటర్లను చేపల్లా పట్టేసి, తమ 'బుట్టలో పడేయడానికి' ఏమేమి ఎర వేయాలో, ఎలాంటి ఎరలు వాడాలో లాంటి టెక్నిక్స్ కూడా వివరించాడు.



ఏడుగురు కొడుకులూ గేలాలు తీసుకుని, ఓటర్ల వేటకు బయల్దేరారు. (ఒకడైతే మరీనూ. చేపల్లాంటి తన ఓటర్లను తాను 'కాల్చుకు తినడాని'కంటూ ఓ ప్రెషర్ కుక్కర్‌నూ వెంట తీసుకొని బయల్దేరాడు. సదరు కుక్కరు..చేపల్ని వండుతుంది, పనిలోపనిగా అది వేసే విజిళ్లతో తనకు ఎంకరేజ్‌మెంటూ దక్కుతుందనేది అతడి వాదన. ఒకే పనిలో బహుళ ప్రయోజనాల కోసం ప్లానింగ్ చేసే, అలాంటివాడే తనకు సరైన వారసుడంటూ మురిసిపోతాడా నేత. అది వేరే కథ).

ఆరుగురు రా.కీ.నేత కుమారులకు ఓటర్లు పడ్డారుగానీ... ఒకడికి మాత్రం పడలేదు. అప్పుడా రా.కీ.నేత కుమారుడిలా ప్రశ్నించాడు.

''ఓటరూ..ఓటరూ..నా గేలానికి నువ్వు ఎందుకు పడలేదు?''

''నువ్వు నీ గేలానికి డబ్బు ఎరగా వేయలేదు''

అతడు మళ్లీ తన పీఏ దగ్గరికెళ్లి అడిగాడు.

''పీయ్యే..పీయ్యే.. గేలానికి ఎరగా డబ్బును ఎందుకు పెట్టలేదు?''

''అదే టైముకు ఈడీ, ఇన్‌కమ్‌ట్యాక్సు వాళ్లు దాడులు చేసి, డబ్బు ఫ్రీజ్ చేశారు'' అని జవాబిచ్చాడు పీయ్యే.

ఈసారి రా.కీ. నేత కుమారుడు ఈడీ, ఇన్‌కమ్‌ట్యాక్స్ వాళ్ల దగ్గరికి వెళ్లి అడిగాడు.

''ఈడీ వాళ్లూ, ఐటీ వాళ్లూ... మా మీద దాడి ఎందుకు చేశారు?''

''మా పైవాళ్లు మాకు ఆదేశాలు ఇచ్చారు'' చెప్పారు ఈడీ, ఐటీ సిబ్బంది.

''పైవాళ్లూ..పైవాళ్లూ..ఇలా ఆదేశాలు ఎందుకిచ్చారు?''

''సార్... మేమేముంది చిన్న చీమల్లాంటివాళ్లం. మీకు అధిష్ఠానం ఉన్నట్లే మాకు ప్రధానమైన పైపైవాళ్లు ఒకరుంటారు. వారిని కాదంటే మమ్మల్ని చీమల్లా నలిపేయగలరు కాబట్టి 'చీమల్లాంటివాళ్లం' అంటూ మమ్మల్ని మేము అభివర్ణించుకున్నాం.

ఆ పైపైవారంటే.. వాళ్లు గతంలోలా కాంగ్రెస్ కావొచ్చు, లేదా ఇప్పట్లోలా బీజేపీ కావొచ్చు. అలా పవర్‌లో ఉన్నది యూపీఏ అయినా, లేదా ఎన్‌డీఏ అయినా..కుట్టాల్సింది పొరుగునున్న కర్ణాటక అయినా, పక్కనున్న మహారాష్ట్ర అయినా మరో రాష్ట్రమైనా ఫరక్ పడేదీ ఏదీ ఉండదు, ప్రాసెస్ సేమ్ టు సేమ్.

అసలు కేంద్రంలో అధికారంలో ఉన్నది ఏ ప్రభుత్వమైనా..వాళ్ల స్టార్ క్యాంపెయినర్లం మేమే. ఆ అధికారగణాల బంగారు పుట్టలో ఎవరైనా వేలు పెడితే..వాళ్లను మేం కుట్టకుండా ఉంటామా?'' అంటూ గుట్టు విప్పి, గుసగుసగా చెప్పారు.

షుగర్ & పెప్పర్
..:: యాసీన్

మా భవిత.. మీ చేతుల్లో!

- అందుకే ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి



బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖమ్మంలోని ఓ పాఠశాల విద్యార్థిని ఓటు హక్కు వినియోగం ఆవశ్యకతపై వినూత్నంగా ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆలోచింపజేసింది. తనను తాను ఈవీఎంగా పోలుస్తూ జీవన మనుగడ, ప్రజాస్వామ్య మనుగడకు ప్రతి ఒక్కరూ ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

జంగ్ తెలంగాణ పంచతంత్రం

గిరిజనుల సంక్షేమానికి రూ.24,000 కోట్ల పథకం

- మోదీ గ్యారంటీల ముందు కాంగ్రెస్ హామీలు పని చేయవు
- మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



బేతుల్: గిరిజనుల సంక్షేమ కోసం రూ.24,000 కోట్లతో కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన మంగళవారం మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమని పునరుద్ఘాటించారు. తమ పార్టీ సభలకు జనం భారీ ఎత్తున తరలివస్తున్నారని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తమ పార్టీ పట్ల అపూర్వమైన విశ్వాసం, మమకారం చూపుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం 'జనజాతీయ గౌరవ్ దివస్'ను జరుపుకోబోతున్నామని, జార్ఖండ్‌లో భగవాన్ బిర్సాముండాకు నివాళులు అర్పించబోతున్నానని తెలిపారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా రూ.24,000 కోట్ల పథకాన్ని ప్రటించనున్నట్లు వివరించారు.

మోదీ ఇస్తున్న గ్యారంటీ

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ పరాజయాన్ని ఇప్పటికే అంగీకరించిందని ప్రధాని మోదీ చెప్పారు. మోదీ గ్యారంటీల ముందు కాంగ్రెస్ నకిలీ హామీలు పని చేయవని తేల్చిచెప్పారు. ఆ విషయం కాంగ్రెస్‌కు కూడా తెలుసని అన్నారు. ఆ పార్టీ ఇక అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్ రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం గురించి కాంగ్రెస్ ఏనాడూ ఆలోచించలేదని తప్పుపట్టారు. వాటన్నింటినీ తమ ప్రభుత్వం ఆచరణలో చేసి చూపించిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలు చేస్తామని, ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ అని వ్యాఖ్యానించారు.

మూర్ఖుల సర్దార్ రాహుల్ గాంధీ

ప్రజల జేబుల్లో 'మేడ్ ఇన్ చైనా' ఫోన్లు మాత్రమే కనిపిస్తున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ తిప్పికొట్టారు. మొబైల్ ఫోన్ల తయారీలో మన దేశం ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరుకుందని వెల్లడించారు. అలాంటి మూర్ఖుల సర్దార్ ప్రపంచంలో ఉంటారా? అని రాహుల్‌పై మండిపడ్డారు. భారత్ నుంచి ఏటా రూ.లక్ష కోట్ల విలువైన ఫోన్లు ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. ఆకాశంలో విహరిస్తున్న కాంగ్రెస్ నాయకులకు వాస్తవాలు ఏమిటో తెలియవని ఎద్దేవా చేశారు. మన దేశం సాధిస్తున్న విజయాలను కళ్లతో చూడలేని జబ్బు వారికి ఉందని విమర్శించారు. భారత్ వోకల్ ఫర్ లోకల్‌గా మారిందన్నారు. స్వదేశీ ఉత్పత్తులు మార్కెట్లను ముంచెత్తుతున్నాయని, ఈ పరిణామంపై వ్యాపార, వాణిజ్య వర్గాలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నాయని ప్రధానమంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధ్వంసమే మిగులుతుందని ఓటర్లను అప్రమత్తం చేశారు.

సర్గుజాలో కాంగ్రెస్ ఎదురీత!

ఛత్తీస్‌గఢ్‌లో రాజకీయంగా కీలక ప్రాంతమైన సర్గుజాలో అధికార కాంగ్రెస్ ఈసారి ఎదురీదుతోంది. ఇక్కడ 14 అసెంబ్లీ స్థానాలున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నింటినీ కాంగ్రెసే నెగ్గింది. ఈ ప్రాంతంలో ఒక పార్టీ ఇలా క్లీన్‌స్వీప్ చేయడం రాష్ట్ర చరిత్రలో అదే తొలిసారి. అదే ఊపులో మొత్తం 90 సీట్లకు గాను కాంగ్రెస్ ఏకంగా 68 స్థానాలు నెగ్గి 15 ఏళ్ల అనంతరం బీజేపీని గద్దె దింపింది. కానీ ఈసారి మాత్రం సర్గుజాలో పరిస్థితులు కాంగ్రెస్‌కు అంత సానుకూలంగా లేవన్న అభిప్రాయం వినిపిస్తోంది...!

- ఛత్తీస్‌గఢ్‌లో కీలక ప్రాంతం
- గత ఎన్నికల్లో క్లీన్‌స్వీప్
- ఈసారి అధికార వ్యతిరేకత, అంతర్గత పోరుతో సతమతం

కారణాలెన్నో...

ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లోని సర్గుజా ఉత్తరాన యూపీ, పశ్చిమాన మధ్యప్రదేశ్, తూర్పున జార్ఖండ్‌తో సరిహద్దులు పంచుకుంటుంది! ఒకప్పుడు నక్సల్ ప్రాబల్యముండేది. ఇప్పుడది బాగా తగ్గుముఖం పట్టింది. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కష్టకాలం ఎదుర్కొంటుండటం వెనక పలు కారణాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. వాటిలో ముఖ్యమైనది ఈ ప్రాంతానికి చెందిన డిప్యూటీ సీఎం టి.ఎస్.సింగ్‌దేవ్‌కు ముఖ్యమంత్రి భూపేశ్ బఘెల్‌తో ఉన్న తీవ్ర విభేదాలు. రాచ కుటుంబీకుడైన సింగ్‌దేవ్‌కు సర్గుజాలో తిరుగులేని ఆదరణ ఉంది. అయితే ఈసారి మాత్రం టికెట్లు దక్కని పలువురు అసంతృప్తులు నేరుగా ఆయనపైనే ఆరోపణలు సంధిస్తున్నారు. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యునిగా తమకు అవకాశం రాకుండా అడ్డుపుల్ల వేశారంటూ మండిపడుతున్నారు. పక్కాగా సర్వేలు చేయించి, వాటి ఆధారంగానే టికెట్లిచ్చామని, బృహస్పత్‌సింగ్ వంటి ఒకరిద్దరిని మాత్రం పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు పక్కన పెట్టినట్టు సింగ్‌దేవ్ చెబుతున్నారు. అయితే, ఈసారి సర్గుజాలో కాంగ్రెస్‌కు సీట్లు తగ్గుతాయని ఆయన స్వయంగా అంగీకరించడం విశేషం. ''ఈసారి ఇక్కడ 10 సీట్లకు తగ్గకుండా నెగ్గుతామన్న నమ్మకముంది. ఎందుకంటే క్లీన్‌స్వీప్ అన్నిసార్లూ సాధ్యమా?'' అని సర్మగర్భంగా ప్రశ్నించారు. ప్రతి మ్యాచ్‌లోనూ ట్రిపుల్ సెంచరీ కొట్టలేం కదా అంటూ ముక్తాయించారు!



బరిలోకి బీజేపీ ఎంపీలు

2018లో సర్గుజా ఓటర్లు తనకు పూర్తిగా మొండిచేయి చూపిన నేపథ్యంలో బీజేపీ ఈసారి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఏకంగా ఇద్దరు సిట్టింగ్ ఎంపీలను ఇక్కడ అసెంబ్లీ బరిలో దింపింది. వారిలో ఒకరు కేంద్ర మంత్రి రేణుకా సింగ్ కావడం విశేషం. అలాగే సీతాపూర్ స్థానంలో మంత్రి అమర్జిత్ భగత్‌పై సీఆర్పీఎఫ్‌కు రాజీనామా చేసి రాజకీయ తీర్థం పుచ్చుకున్న 33 ఏళ్ల రామ్‌కుమార్ టొప్పొను బీజేపీ బరిలో దింపింది. ఈ చర్య సీతాపూర్‌తో పాటు సర్గుజాలోని ఇతర అసెంబ్లీ స్థానాల్లో కూడా తమకు భారీగా యువతరం ఓట్లను సాధించి పెడుతుందని ఆశిస్తోంది. సింగ్‌దేవ్ సీఎం అవుతారన్న సంకేతాలివ్వడం గత ఎన్నికల్లో సర్గుజాలో కాంగ్రెస్‌కు భారీగా లాభించింది. తీరా ఫలితాలొచ్చాక బఘేల్‌ను అందలమెక్కించడం సర్గుజావాసులకు బాగా అసంతృప్తి కలిగించిందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. దీనికి తోడు సింగ్‌దేవ్ కంచుకోట అనే ఉద్దేశంతో అక్కడ బఘేల్ ప్రత్యేకించి పెద్దగా అభివృద్ధి పనులేమీ చేయలేదంటున్నారు. ఇది కూడా ఈసారి కాంగ్రెస్‌కు మరింత మైనస్‌గా మారేలా ఉందన్న అభిప్రాయాలు విన్పిస్తున్నాయి.


- సాక్షి, నేషనల్ డెస్క్

ఇదీ సర్గుజా స్వరూపం...	ఈ ప్రాంతంలో మొత్తం జిల్లాలు		అసెంబ్లీ స్థానాలు	ఎస్టీ రిజర్వుడు స్థానాలు
	6	జష్‌పూర్, కోరియా, సూరజ్‌పూర్, సర్గుజా, బలరాంపూర్, మనేంద్రగఢ్-చిర్మరి-భరత్‌పూర్	14	9

సర్గుజాలో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు (మొత్తం అసెంబ్లీ స్థానాలు 14)	పార్టీ	2008	2013	2018
	బీజేపీ	9	7	0
	కాంగ్రెస్	5	7	14

ఐదేళ్లలో ఆస్తులు 'పెంచేసుకున్నారు'

- ఛత్తీస్‌గఢ్‌లో 60 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల ఆస్తుల్లో వృద్ధి
- ఎన్నికల బరిలో 66 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- 5% నుంచి అత్యధికంగా 3,340% వరకు పెరిగిన ఆస్తులు
- రూ.10.33 కోట్లు పెరిగిన సీఎం భూపేశ్ బఘేల్ సంపద



సాక్షి, న్యూఢిల్లీ: గత ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొందరి సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. అసెంబ్లీలోని మొత్తం 90 మందికిగాను 66 మంది తిరిగి పోటీ చేస్తున్నారు. వీరిలో 60 మంది అంటే సుమారు 91 శాతం మంది ఆస్తుల్లో 5 శాతం నుంచి అనూహ్యంగా 3,340 శాతం వరకు పెరుగుదల నమోదు చేసుకుంది. అయితే, ఇందుకు విరుద్ధంగా మిగతా ఆరుగురి సంపదలో తగ్గుదల 4 శాతం నుంచి 35 శాతం వరకు నమోదు కావడం గమనార్హం. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), ఛత్తీస్‌గఢ్ ఎలక్షన్ వాచ్-2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి పోటీ చేస్తున్న 66 మంది ఎమ్మెల్యేలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్లను విశ్లేషించి ఈ మేరకు మంగళవారం నివేదికను విడుదల చేశాయి.

2018లో స్వతంత్రులతో సహా వివిధ పార్టీల తరఫున మరోసారి పోటీ చేసిన ఈ 66 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ రూ.12.98 కోట్లుగా ఉంది. కాగా, 2023లో ఎన్నికల బరిలో నిలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.13.74 కోట్లకు పెరిగింది. అంటే సగటు ఆస్తి వృద్ధి రూ.76.45 లక్షలుగా ఉంది. అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎమ్మెల్యేల జాబితాలో తఖత్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు చెందిన రష్మీ ఆశిష్ సింగ్ మొదటి వరుసలో నిలిచారు. ఈమె ఆస్తుల విలువ అత్యధికంగా రూ.12.70 కోట్ల మేర పెరిగాయి. ఈమె ఆస్తుల విలువ 2018లో రూ.8.73 కోట్లు కాగా 2023లో ఈ విలువ రూ.21.44 కోట్లకు చేరింది. ఆ తర్వాత ఆరాంగ్ (ఎస్సీ) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కి చెందిన డాక్టర్ శివకుమార్ దహరియా ఆస్తులు రూ.2.37 కోట్ల నుంచి రూ.13.37 కోట్లకు చేరడంతో రూ.10.99 కోట్లు పెరుగుదల నమోదైంది. పటాన్ నియోజకవర్గం నుంచి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ సంపద రూ.23.05 కోట్ల నుంచి రూ.33.38 కోట్లకు చేరింది. దీంతో ఆయన ఆస్తుల్లో రూ.10.33 కోట్ల పెరుగుదల నమోదైంది. అదేవిధంగా, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన 49 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల ఆస్తుల్లో 3.19%, ప్రతిపక్ష బీజేపీకి చెందిన 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల సంపదలో 19.05% వృద్ధి నమోదైంది. అయితే, కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజిం సిట్టింగ్ ఎమ్మెల్యే అమితేశ్ శుక్లా ఆస్తుల్లో మాత్రం తగ్గుదల నమోదైంది. ఈయన ఆస్తుల విలువ రూ.74 కోట్ల నుంచి రూ.48 కోట్లకు తగ్గడంతో రూ.25 కోట్ల క్షీణత నమోదైందని ఏడీఆర్ నివేదిక వివరించింది.

మధ్యప్రదేశ్ మాదే: రాహుల్

తమ ఎమ్మెల్యేలను బీజేపీ కొనేసిందని ధ్వజం



భోపాల్: మధ్యప్రదేశ్‌లో విజయం కాంగ్రెస్‌దేనని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 230 సీట్లకు గాను తాము ఏకంగా 150కి పైగా సాధిస్తామని ధీమా వెలిబుచ్చారు. మంగళవారం రాష్ట్రంలోని విదిశలో ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. ''ఐదేళ్ల క్రితం మధ్యప్రదేశ్ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. కానీ మోదీ, అమిత్ షా, శివరాజ్‌సింగ్ చౌహాన్ కలిసి మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని పడగొట్టారు'' అంటూ దుయ్యబట్టారు. ''వారిది విద్వేషపు మార్గం. మేం మాత్రం ప్రేమనే నమ్ముకుని హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకల్లో బీజేపీని మట్టికరిపించాం. కర్ణాటకలో ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్నాం.'' అని వివరించారు. మధ్యప్రదేశ్‌లో 500 పరిశ్రమలు స్థాపించామని మోదీ అడ్డంగా అబద్ధాలాడారని రాహుల్ అన్నారు. యూపీఏ హయాంలో బుందేల్‌ఖండ్ అభ్యున్నతికి రూ.7,000 కోట్ల ప్యాకేజీని ఆమోదిస్తే మోదీ సర్కారు అందులోంచి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని తికంగఢ్ ర్యాలీలో ఆయన ఆరోపించారు. బీజేపీ నేతలే దాన్ని పంచుకు తిన్నారని మండిపడ్డారు. సూటు, బూట్లు వేసుకునే సంపన్నుల కోసం మాత్రమే మోదీ సర్కారు పని చేస్తోందని ఎద్దేవా చేశారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం | 15 | నవంబర్ | 2023



కొండగట్టులో రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి కొండకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ఆకాశదీపం పూజలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో మంగళవారం కార్తీకమాసం వేడుకలు ప్రారంభమయ్యాయి. జేగంట వద్ద స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
32.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై, జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



ఓట్ ఫర్ ష్యూర్

కరీంనగర్ అర్బన్: ఐయామ్ రెడీ ఫర్ ఓట్. ఆర్‌యూ ఓట్ ఫర్ ష్యూర్ అంటున్నారు కలెక్టర్ పమేలా సత్పతి. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఓటు ప్రాధాన్యం తెలియజేసేలా ఏర్పాటు చేసిన వి ఓట్ ఫర్ ష్యూర్ సెల్ఫీ పాయింట్‌ను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ప్రారంభించారు. యువ ఓటర్లు, మహిళా ఓటర్లతో పాటు అందరూ సెల్ఫీ పాయింట్ల వద్ద సెల్ఫీలు దిగుతూ 30 నవంబర్ నాడు విధిగా ఓటు వేయాలని కోరారు. కరీంనగర్, చొప్పదండి ఆర్వోలు కె.మహేశ్వర్, ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

యువతే నిర్ణేత

జంగ్ తెలంగాణ

ఉమ్మడి జిల్లాలో 93,849 మందికి తొలిసారి ఓటుహక్కు

- మొత్తం ఓట్లలో 30–39 ఏళ్లలోపు వారివే అధికం
- ప్రధాన పార్టీల చూపు వారివైపే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు నమోదుకు ఎన్నికల సంఘం పలుమార్లు గడువు ఇవ్వడంతో 18 ఏళ్లు నిండిన వారు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో యువ ఓటర్లు నమోదయ్యారు. దీంతో ప్రధాన పార్టీలన్నీ వారిని ప్రసన్నం చేసుకోవడానికి కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలలో ప్రత్యేక విభాగాలు పని చేస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా 15 రోజుల సమయమే ఉండటంతో ఆయా పార్టీల నాయకులు క్షేత్రస్థాయిలో యువ ఓటర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎలాగైనా వారిని తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ముంచుతారో.. తేల్చుతారోనని భయం

2018 ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థికి, ఓడిన అభ్యర్థికి మధ్య చాలా నియోజకవర్గాల్లో స్వల్ప తేడా మాత్రమే ఉంది. ప్రస్తుతం పెరిగిన యువ ఓటర్ల సంఖ్య దాదాపుగా దీనికి సమానంగా ఉండటంతో ఫలితాలపై వీరి ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అలాగే, మొత్తం ఓటర్లలో 30 నుంచి 39 ఏళ్ల మధ్య వయసున్నవారే అధికంగా ఉన్నారు. వారు తమను ముంచుతారో.. తేల్చుతారోనని అని పార్టీలూ భయపడుతున్నాయి. బయటకు మాత్రం పెరిగిన ఓట్లు తమకే లాభం చేకూరుస్తాయని చెప్పుకుంటున్నప్పటికీ లోపల ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

మంథనిలో ఎక్కువ మంది..

ఓటరు జాబితా ప్రకారం తొలిసారిగా ఓటుహక్కు నమోదు చేసుకున్నవారు మంథనిలో(8,716), 80 ఏళ్ల పైబడినవారు కరీంనగర్‌లో (5,316) ఎక్కువ మంది ఉన్నారు. మొత్తంగా చూసినట్లయితే ఉమ్మడి జిల్లాలో 18 నుంచి 39 ఏళ్లలోపు వారి ఓట్లే అధికం. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వీరి ఓట్లు 50 శాతానికి పైనే ఉన్నాయి. వారిని మచ్చిక చేసుకుంటే గెలుపు నల్లేరుపై నడకేనని భావిస్తున్న పార్టీలు తమ వైపు తిప్పుకోవాలని చూస్తున్నాయి.



నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్లు..

18–19 ఏళ్లవారు: కోరుట్లలో 8,178, జగిత్యాలలో 7,744, ధర్మపురిలో 7,483, రామగుండంలో 5,990, మంథనిలో 8,716, పెద్దపల్లిలో 8,530, కరీంనగర్‌లో 8,598, చొప్పదండిలో 6,165, వేములవాడలో 6,246, సిరిసిల్లలో 6,735, మానకొండూర్‌లో 5,863, హుజూరాబాద్‌లో 9,008, హుస్నాబాద్‌లో 7,293 మంది ఉన్నారు.

20–29 ఏళ్లవారు : కోరుట్లలో 50,192, జగిత్యాలలో 48,116, ధర్మపురిలో 47,928, రామగుండంలో 44,226, మంథనిలో 51,575, పెద్దపల్లిలో 51,851, కరీంనగర్‌లో 69,457, చొప్పదండిలో 46,862, వేములవాడలో 47,132, సిరిసిల్లలో 48,857, మానకొండూర్‌లో 42,820, హుజూరాబాద్‌లో 52,478, హుస్నాబాద్‌లో 48,332 మంది ఉన్నారు.

30–39 ఏళ్లవారు : కోరుట్లలో 57,837, జగిత్యాలలో 50,807, ధర్మపురిలో 53,451, రామగుండంలో 64,456, మంథనిలో 63,667, పెద్దపల్లిలో 66,875, కరీంనగర్‌లో 90,160, చొప్పదండిలో 54,030, వేములవాడలో 55,914, సిరిసిల్లలో 62,727, మానకొండూర్‌లో 57,107, హుజూరాబాద్‌లో 64,862, హుస్నాబాద్‌లో 66,026 మంది ఉన్నారు.

40–49 ఏళ్లవారు : కోరుట్లలో 50,166, జగిత్యాలలో 45,345, ధర్మపురిలో 43,805, రామగుండంలో 44,859, మంథనిలో 44,406, పెద్దపల్లిలో 49,862, కరీంనగర్‌లో 76,432, చొప్పదండిలో 44,057, వేములవాడలో 42,463, సిరిసిల్లలో 48,046, మానకొండూర్‌లో 42,206, హుజూరాబాద్‌లో 48,866, హుస్నాబాద్‌లో 46,238 మంది ఉన్నారు.

50–59 ఏళ్లవారు : కోరుట్లలో 37,945, జగిత్యాలలో 38,322, ధర్మపురిలో 34,766, రామగుండంలో 33,977, మంథనిలో 33,608, పెద్దపల్లిలో 34,998, కరీంనగర్‌లో 54,631, చొప్పదండిలో 36,660, వేములవాడలో 33,003, సిరిసిల్లలో 36,249,మానకొండూర్‌లో 32,519, హుజూరాబాద్‌లో 34,136, హుస్నాబాద్‌లో 34,294 మంది ఉన్నారు.

60–69 ఏళ్లవారు : కోరుట్లలో 22,606, జగిత్యాలలో 23,644, ధర్మపురిలో 22,576, రామగుండంలో 19,230, మంథనిలో 20,760, పెద్దపల్లిలో 24,414, కరీంనగర్‌లో 33,230, చొప్పదండిలో 25,432, వేములవాడలో 21,982, సిరిసిల్లలో 24,130, మానకొండూర్‌లో 23,475, హుజూరాబాద్‌లో 23,359, హుస్నాబాద్‌లో 23,981 మంది ఉన్నారు.

70–79 ఏళ్లవారు : కోరుట్లలో 10,928, జగిత్యాలలో 12,672, ధర్మపురిలో 12,580, రామగుండంలో 6,901, మంథనిలో 10,691, పెద్దపల్లిలో 13,592, కరీంనగర్‌లో 17,230, చొప్పదండిలో 14,473, వేములవాడ లో 11,752, సిరిసిల్లలో 13,145, మానకొండూర్‌లో 13,148, హుజూరాబాద్‌లో 12,357, హుస్నాబాద్‌లో 14,017 మంది ఉన్నారు.

80+ ఏళ్లవారు : కోరుట్లలో 3,003, జగిత్యాలలో 4,818, ధర్మపురిలో 4,291, రామగుండంలో 1,380, మంథనిలో 3,019, పెద్దపల్లిలో 4,144, కరీంనగర్‌లో 5,316, చొప్పదండిలో 5,311, వేములవాడలో 3,759, సిరిసిల్లలో 4,537, మానకొండూర్‌లో 4,475, హుజూరాబాద్‌లో 4,492, హుస్నాబాద్‌లో 2,001 మంది ఉన్నారు.



ప్రచారమేదైనా అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ఎ.సతీశ్‌గణేశ్, పాల్గొన్న అధికారులు

- విస్మరిస్తే ఫిర్యాదుకు ప్రత్యేక నంబర్లు
- వివరాలు గోప్యంగా ఉంచుతాం
- కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ ఎ.సతీశ్‌గణేశ్

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రచారం కోసం తప్పనిసరిగా అనుమతి పొందాల్సిందేనని కేంద్ర ఎన్నికల జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎ.సతీశ్‌గణేశ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకులు జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎవరైనా సరే వారి ఎన్నికల ప్రచారం కోసం వాహనం, మైక్‌ల ఏర్పాటు, బహిరంగ సభ నిర్వహించినా, ఇంటింటి ప్రచారం చేసినా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పనిసరిగా 24 గంటల ముందు అనుమతి పొందాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తిస్తే అందుకు సంబంధించిన వీడియోను, ఫొటోను వాట్సాప్ ద్వారా లేదా సంక్షిప్త సందేశం (ఇంగ్లిష్, హిందీ) రూపంలో పోలీస్ వ్యయపరిశీలకులు ఎ.సతీశ్‌గణేశ్ 9455717500, జనరల్ అబ్జర్వర్లు డా.సి.ఆర్.ప్రసన్న 9846442277, ఎంఆర్. రవి కుమార్ 9148374888, వ్యయపరిశీలకులు శివ్ శంకర్ 8977073453, చిట్టే యోగేష్ సుగ్దే 8977073451 నంబర్‌లకు తెలియజేయాలని కోరారు. ఫిర్యాదును పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. విదేశాలలో విద్యా, ఉద్యోగం కోసం వెళ్లిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం లేదని, వారు పోలింగ్ రోజు నేరుగా వారి పోలింగ్ కేంద్రానికి వెళ్లి మాత్రమే వారి ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఫ్రీ అండ్ ఫేయిర్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎక్కడ అక్రమంగా మద్యం పంపిణీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. జనరల్ అబ్జర్వర్లు సి.ఆర్.ప్రసన్న, ఎం.ఆర్.రవికుమార్, వ్యయ పరిశీలకులు శివ్ శంకర్, చిట్టే యోగేష్ సుగ్దే, చొప్పదండి, కరీంనగర్ ఆర్‌వోలు ప్రఫుల్ దేశాయ్, మహేశ్వర్, డీఆర్‌వో పవన్ కుమార్, జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు తేలనున్న అభ్యర్థుల లెక్క

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏడు నామినేషన్లు ఉపసంహరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నామినేషన్ల పరిశీలనంతరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 261 మంది అభ్యర్థులు ఆమోదం పొందగా, మంగళవారం ఏడుగురు తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం 254మంది పోటీదారులుగా ఉన్నారు. వీరిలో ఎవరెవరు పోటీనుంచి తప్పుకుంటారో బుధవారం సాయంత్రానికి తేలిపోనున్నది. మంగళవారం మానకొండూర్ అసెంబ్లీలో ఒకరు, చొప్పదండిలో 2, మంథనిలో 2, కోరుట్లలో 1, వేములవాడలో 1 చొప్పున మొత్తం ఏడుగురు తమ నామినేషన్లు ఉపసహరించుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో 15మంది కన్నా మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి వస్తుందని, పోటీలో నిలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థులతో మంతనాలు కొనసాగిస్తున్నారు. వారిని పోటీ నుంచి తప్పుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. దీంతో నేడు ఉపసంహరణ గడువు ముగిసేలోపు మరికొంతమంది తమ నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉంది.

ఇప్పటివరకు బరిలో ఉన్నవారు

కరీంనగర్ నియోజకవర్గం పరిధిలో 31 మంది, చొప్పదండిలో 15, మానకొండూర్‌లో 12, పెద్దపల్లి 25, మంథని 22, రామగుండం 26, జగిత్యాల 19, కోరుట్లలో 19, ధర్మపురి నుంచి 18, హుజూరాబాద్ 25, సిరిసిల్లలో 23, వేములవాడ నుంచి 19 మంది మొత్తంగా ఇంకా 254 మంది బరిలో ఉన్నారు.

న్యూస్‌రీల్

గ్రంథాలయాలు స్ఫూర్తి కేంద్రాలు



కరీంనగర్ సిటీ: గ్రంథాలయాలు నిత్య చైతన్య స్ఫూర్తి కేంద్రాలుగా పనిచేస్తాయని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. కళాశాలలోని శాతవాహన గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విషయ పరిజ్ఞానంతో పాటు, విజ్ఞాన వికాసాలను అందించే కాంతి వలయాలని అన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్ రంగానాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రంథాలయాధికారి కే.సురేందర్, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ వి.శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, జి.శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తిమ్మాపూర్: రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వేగంగా తూకంవేసి మిల్లులకు తరలించాలని సివిల్ సప్లై కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఆదేశించారు. తిమ్మాపూర్ మండలం రేణికుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కల్లాల నుంచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కేంద్రాల్లో ప్యాడీక్లీనర్లు, మాయిశ్చర్లు, గన్నీసంచులు అందుబాటులో ఉంచాలని అన్నారు. వర్షాల నుంచి ధాన్యాన్ని సంరక్షించేలా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజిరెడ్డి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

కొనుగోళ్లపై సమీక్ష

కరీంనగర్ అర్బన్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ అనిల్‌కుమార్ అధికారులకు నిర్దేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో సమావేశమై కొనుగోళ్ల తీరును ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసేలా మిల్లర్లతో సమీక్షించాలని కోరారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మంగాళరపు రజనీ కాంత్, డీఎస్వో సురేశ్‌రెడ్డి ఉన్నారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డా.సి.ఆర్.ప్రసన్న కుమార్



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

కరీంనగర్ అర్బన్: స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని కరీంనగర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డా.సి.ఆర్.ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్‌లు ప్రసన్నకుమార్, రవికుమార్ పాల్గొని మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. అవసరం మేరకు మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ టీంకు తగు సూచనలు చేయవచ్చని తెలిపారు. పోలింగ్ ఆరంభం నుంచి ముగిసే వరకు జరిగిన సంఘటనలు అన్ని ఎప్పటికప్పుడు ఆయా నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్లకు తెలియజేయాలని, ఓటింగ్ తరువాత ఓటరు తన ఓటు ఎవరికి వేశాననే రహస్యాన్ని బయటపెట్టకుండా చూడాలని, వారికి కేటాయించిన క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో వసతులు ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికలలో హింసాత్మక సంఘటనలు, బెదిరింపులకు పాల్పడడం, నిర్దిష్ట అభ్యర్థికి అనుకూలంగా అసాధారణంగా అధిక ఓటింగ్ జరగడం మొదలైన వాటి ఆధారంగా క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్‌లు, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, స్టిల్ ఫొటోగ్రఫీ వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే చర్యలు

- పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి



సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

గన్నేరువరం: పాత నేరస్తులు, రౌడీషీటర్లు ఎన్నికల ప్రక్రియకు, విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి హెచ్చరించారు. గన్నేరువరంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అవసరమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్, రూట్‌మార్చ్, వాహనాల తనిఖీ చేపట్టాలని సూచించారు. మోడల్ కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టాలని, అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయాలని అన్నారు. వీటిని ఉల్లంఘిస్తే పూచికత్తు సొమ్ము మొత్తాన్ని సప్త చేయడంతో పాటు జైలుశిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. ఎస్సై చందా నరసింహారావు, ఏఎస్సై లక్ష్మీనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ సంపత్ గౌడ్ పాల్గొన్నారు.

సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన సీపీ

జమ్మికుంట: ఈ నెల 17న జమ్మికుంటలో జరిగే సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను సీపీ అభిషేక్ మహంతి పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని, నాయిని చెరువు వద్ద గల హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించి, బారికేడ్లు, పార్కింగ్, రూట్ మ్యాప్‌పై పలు సూచనలిచ్చారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐ రమేశ్, ఎస్‌ఐలు శ్రీధర్, రాజేశ్ ఉన్నారు.

పద్మానగర్ చెక్‌పోస్టు తనిఖీ

కరీంనగర్‌క్రైం: పద్మానగర్ బైపాస్‌రోడ్డు వద్ద గల స్టాటిక్ సర్వేలెన్స్ టీం చెక్‌పోస్టును సీపీ అభిషేక్ మహంతి తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు శోభారాణి



మాట్లాడుతున్న శోభారాణి

కరీంనగర్: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు హనుమాన్ల శోభారాణి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడే బాధ్యత కేవలం కమిషన్ పైనే కాకుండా ప్రతి ఒక్కరి పైనా ఉందని అన్నారు. కోవిడ్‌తో అనాథలైన అనేకమంది చిన్నారులకు ఈ కమిటీ ద్వారా విద్యా, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న చిన్నారులను కాపాడేందుకు జిల్లా చైల్డ్‌లైన్ పని చేస్తుందని, 1098కి ఫోన్ చేయడం ద్వారా సత్వరసాయం అందుతుందన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగిన పిల్లల ఆలోచన శక్తి పెరుగుతుందని అన్నారు. పిల్లలు ఎలాంటి దుష్ప్రభావాలకూ అలవాటు పడకుండా తల్లిదండ్రులు, సంరక్షకులు చూడాలని సూచించారు. కార్యక్రమానంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. బాల భవన్ చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితాదేవి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కళింగ శేఖర్, రాధ, అర్చన, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, డీసీపీవో శాంత, బాలభవన్ సూపరింటెండెంట్ మంజుల, సఖి అడ్మిన్ లక్ష్మి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

'ఔట్' సోర్సింగ్ సేవలు!

- ప్రభుత్వం నుంచి జీతాలు
- పెద్దల ఇంట్లో సేవలు
- బల్దియా ఉద్యోగుల బాగోతం
- క్షేత్రస్థాయిలో కనిపించని వైనం



మొత్తం పారిశుద్ధ్య కార్మికులు: 1,092
రెగ్యులర్ కార్మికులు: 76
ఔట్‌సోర్సింగ్ కార్మికులు: 1016
ఇతరత్రా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు : 200 (దాదాపుగా)

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో కనీసం 300 మంది ఉద్యోగులు కనిపించడం లేదు. నిత్యం నగరవ్యాప్తంగా వివిధ సేవలందించాల్సిన ఉద్యోగులు క్షేత్రస్థాయిలో మాత్రం కానరావడం లేదు. ఇందులో 99శాతం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నారు. అందులో పారిశుద్ధ్య విభాగానికి చెందిన కార్మికులే అధికులు. వందలమంది ఉద్యోగులు కనిపించకుండా పోవడమేమిటీ? వీరంతా...ఎక్కడున్నారంటూ ఆశ్చర్యపోకండి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ల ఇళ్లలోకి వెళ్తే వీరు దర్శనమిస్తారు. మరికొంతమంది కాగితాల్లోనే కనిపిస్తారు. వారిని చూసే భాగ్యం సంబంధిత అధికారులకు కూడా దక్కదు.

1,016 మంది పారిశుద్ధ్య కార్మికులు

నగరపాలకసంస్థలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వ్యవస్థ ఓ ప్రహసనంలా మారింది. రెగ్యులర్ నియామకాలు లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలిసిందే. వేలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బల్దియాలో పనిచేస్తున్నారు. ఒక్క పారిశుద్ధ్య విభాగంలోనే 1,092 మంది కార్మికులు ఉండగా, అందులో కేవలం 76 మంది మాత్రమే రెగ్యులర్ కార్మికులు. మిగతా 1,016 మంది ఔట్‌సోర్సింగ్. వీరితో పాటు కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు దాదాపు 200 మంది ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమితులయ్యారు. ఇందులో ఎక్కువగా కంప్యూటర్ ఆపరేటర్ల కింద నియామకం పొందిన వాళ్లే. నగరప్రజలకు సేవలందించేందుకు నియమితులైన ఈ ఉద్యోగులంతా సేవలు మాత్రం ప్రైవేట్‌గా చేస్తున్నారు. కనీసం 300 నుంచి 400 మంది ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఎప్పుడూ కనిపించరంటే అతిశయోక్తి కాదు. వీరంతా కూడా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కొంతమంది కార్పొరేటర్ల ఇళ్లలో పనిచేస్తుండడం గమనార్హం. మరికొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులకు, వారి కుటుంబసభ్యుల కార్లకు డ్రైవర్లుగా ఉన్నారు.

ఉన్నట్లా...లేనట్లా...

మరికొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నగరపాలకసంస్థ పరిధిలో ఎప్పుడూ కనిపించరు. వారిపేర్లు మాత్రం రికార్డుల్లో ఉంటాయి. జీతాలు అకౌంట్లో పడుతుంటాయి. అసలు వాళ్లు ఉన్నారా... లేరా...ఉంటే ఎక్కడున్నారు...లేకుంటే వారి జీతాలు ఎవరు తీసుకొంటున్నారు...అనే చిక్కు ప్రశ్నలకు ఇక్కడ సమాధానాలు దొరకవు. అలాంటి ఉద్యోగులను చూసే భాగ్యం సంబంధిత అధికారులకు కూడా దక్కదు.

సేవలకు అంతరాయం

డంప్‌యార్డ్ నిత్యం తగలబడుతోంది. రోడ్లపై చెత్తా చెదారం, డ్రైనేజీల్లో సిల్ట్ పేరుకుపోతోంది. అపరిశుభ్ర రోడ్లు, శివారు డివిజన్‌లలో అధ్వానంగా పారిశుద్ధ్యం. ఇలా సమస్యలెన్నో. కానీ పరిష్కరించేందుకు సరిపడా సిబ్బంది కరువు. వందలాది మంది ఉద్యోగులు ప్రైవేట్ పనుల్లో బిజీగా ఉండడంతో, ప్రభుత్వ సేవలు అందకుండా పోతున్నాయి. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రైవేట్ పనులు చేస్తున్న ఉద్యోగుల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి పెడితే, నగరం మరింత పరిశుభ్రంగా మారనుంది.

క్లుప్తంగా

మూడు కిలోల కణతి తొలగింపు



కరీంనగర్‌టౌన్‌: నగరంలోని కార్ఖానగడ్డకు చెందిన నస్రీం సుల్తానాకు మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్‌)లో ఆపరేషన్‌ చేసి, కడుపులో నుంచి మూడు కిలోల కణతి తొలగించినట్లు వైద్యులు తెలిపారు. కడుపునొప్పి, రక్తస్రావంతో బాధ పడుతున్న ఆమెను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. స్కానింగ్‌ చేసి, కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించామన్నారు. మంగళవారం ఆపరేషన్‌ చేసి, తొలగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. వైద్యులు నిఖిలపర్వీన్‌, మంజుల, సుధ, శ్రీకాంత్‌రెడ్డి, సృజన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

జమ్మికుంట (హుజూరాబాద్‌): ఓ వ్యక్తి భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని మడిపల్లిలో చింతల మోహన్‌రెడ్డికి చెందిన భూమిలోకి అతని అన్న కుమారులు చింతల మహేందర్‌రెడ్డి, కోమల్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలు మంగళవారం అక్రమంగా ప్రవేశించి, ఒడ్లపై గడ్డి మందు పిచికారీ చేశారు. అడిగినందుకు మోహన్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించి, చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బసంత్‌నగర్‌లో ఐదుగురిపై..

పాలకుర్తి(రామగుండం): ఓ వ్యక్తిపై దాడి చేసిన నలుగురితోపాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్‌ ఎస్‌ఐ వెంకటేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బసంత్‌నగర్‌ శివారులోని వైన్స్‌ వద్ద సోమవారం రాత్రి జీడీనగర్‌కు చెందిన సంపంగి ప్రశాంత్‌, ముద్దంగుల నరేశ్‌, ఒల్లెపు ప్రభాకర్‌, బోదాసు సారయ్యలు పాత గొడవలు మనసులో పెట్టుకొని, పెద్దపల్లి మండలంలోని కురుమపల్లికి చెందిన బీటి శేఖర్‌పై దాడి చేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, ఈ ఘర్షణ సమయంలో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన కానిస్టేబుల్‌ సురేశ్‌తో సంపంగి రాజు దురుసుగా ప్రవర్తించి, ఆయన విధులకు ఆటంకం కలిగించాడు. ఈ మేరకు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపిక

కరీంనగర్‌: మహబూబ్‌నగర్‌ జిల్లాలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన హ్యాండ్‌బాల్‌ రాష్ట్రస్థాయి పోటీల్లో ట్రినిటీ కళాశాల విద్యార్థి పులిరూటి రతన్‌ ప్రతిభ కనబరిచాడని విద్యాసంస్థల చైర్మన్‌ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. హరియాణాలోని హిస్సార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయిలోనూ రాణించి, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం రతన్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్‌ దయాకర్‌రెడ్డి, వాలీబాల్‌ అసోసియేషన్‌ సెక్రటరీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

శుభకార్యాలు.. ప్రచారాలు

- నిత్యం పరామర్శలు
- మరో రెండు రోజుల్లో మొదలు కానున్న పెళ్లిళ్ల జోరు





జగిత్యాల: నామినేషన్ల ఘట్టం ముగిసిపోవడంతో బుధవారం ఎవరెవరు అభ్యర్థులు బరిలో ఉంటారో తెలుస్తుంది. ఈసారి స్వతంత్రులు అధికంగానే ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో ఎవరి దారిలో వారు ప్రచారం చేపడుతున్నారు. ప్రతి ఒక్క ఓటు ఎంతో విలువైంది కావడంతో ప్రధాన అభ్యర్థుల నుంచి స్వతంత్రుల వరకు నియోజకవర్గంలో ఎక్కడ ఏం జరిగినా అక్కడకు వెళ్తున్నారు. ఎవరైనా మరణించినా, ఏమైనా సంఘటనలో గాయపడ్డా ఉదయమే అక్కడకు వెళ్లి పరామర్శిస్తున్నారు. గతంలో రాని నాయకులు ఈసారి ప్రతిదానికి వెళ్లడంతో ప్రజలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఓటు విలువ ఎంత ఉందో తెలుస్తుంది.

ఈనెల 16 నుంచి మంచి ముహూర్తాలు

- రానున్న రెండురోజుల్లో వివాహ వేడుకలు సైతం ఊపందుకోనున్నాయి.
- కార్తీకమాసం ప్రారంభం కానుండటంతో 8 నుంచి 10 రోజుల పాటు వివాహాలు జరగనున్నట్లు పండితులు పేర్కొంటున్నారు.
- ఈనెల 30న పోలింగ్‌ ఉండగా, ఇంతకంటే ముందే వివాహ వేడుకలు అత్యధికంగా ఉండటంతో ప్రతీ వేడుకకు హాజరయ్యేందుకు అభ్యర్థులు సైతం ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించుకుంటున్నారు.
- గతంలో వివాహ వేడుకలకు రావాలని స్వయాన కుటుంబ సభ్యులు శుభలేఖలు అందజేసినా సమయం ఉంటేనే వెళ్లేవారు. ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో ప్రతి ఒక్కరిని ఆకట్టుకోవడం కోసం పిలవకపోయినా వివాహ వేడుకలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.
- దాదాపు పెళ్లిల్లో చాలా జనాలు ఉంటారు కాబట్టి వివాహ వేడుకలకు హాజరైతే ఓట్లు వచ్చే అవకాశాలుంటాయని అభ్యర్థులు ఆలోచిస్తున్నారు.
- ఒకవైపు పరామర్శించడంతో పాటు, మరోవైపు శుభకార్యాల్లో పాల్గొంటూ నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు.
- ఈనెలలో 16 నుంచి 29 వరకు మంచి ముహూర్తాలు ఉండటంతో ఆ సమయంలోనే ప్రచారం హోరెత్తనుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ప్రతి ఒక్క అభ్యర్థి ఇంటింటికీ వెళ్తూ అవ్వలను, మహిళలను, వృద్ధులను, యువతను కలుస్తూ ఓటు తమకే వేయాలంటూ వేడుకుంటున్నారు.
- ఎన్నికలకు మరో మరో 15 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఉదయం 4 నుంచి 5 గంటల లోపే గ్రామాలు, మండలాల్లో ప్రచారం ప్రారంభిస్తున్నారు.
- మున్సిపాలిటీల్లో రాత్రిపూట విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఏదేమైనా అభ్యర్థులకు ప్రచారంలో ముచ్చెమటలు పడుతున్నాయి.

ఓట్లు రాలేదా.. డిపాజిట్‌ గోవిందా

- ఎన్నికల్లో డిపాజిట్లు దక్కితేనే అభ్యర్థులకు గౌరవప్రదమైన ఓటమి
- ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో 326 మంది నామినేషన్‌ దాఖలు



కథలాపూర్‌(వేములవాడ): ఎదుటి పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావు.. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తరుచూ అంటున్న మాటలివి. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం అభ్యర్థులకు తమ డిపాజిట్‌ డబ్బులు తిరిగి వస్తే అది గౌరవప్రదమైన ఓటమిగా భావిస్తారు. ఆ డబ్బులు తిరిగి రాకపోతే అభ్యర్థి చిత్తుగా ఓడిపోయినట్లే లెక్క.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే..

శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే రూ.10 వేలు డిపాజిట్‌గా ఎన్నికల సంఘం అధికారులు నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్‌ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్‌ అధికారి వద్ద ఈ డబ్బులను డిపాజిట్‌ చేస్తారు. సదరు అధికారి ఈ మొత్తాన్ని ఎస్టీవోలోని ప్రత్యేక ఖాతాలో జమ చేస్తారు. నామినేషన్‌ దాఖలు చేసినప్పటి నుంచి అభ్యర్థుల వ్యక్తిగత వివరాల పరిశీలన, సర్టిఫికెట్లు, ఈవీఎంలపై గుర్తుల కేటాయింపు, సర్వీస్‌ ఓటర్లకు బ్యాలెట్‌ పేపర్లపై గుర్తులను ముద్రించడం వంటి ప్రతీ అంశంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంటుంది. అభ్యర్థికి సంబంధించిన ప్రచార ఖర్చులు, ప్రతీ కదలికపై ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక అధికారుల బృందాలు నిశిత పరిశీలన చేస్తారు. అభ్యర్థులు ఏదో నామమాత్రంగా పోటీ చేస్తే ఎన్నికల సంఘానికి అనవసర ఖర్చు పెరగడంతోపాటు అధికారుల విలువైన సమయం వృథా అవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం పోటీచేసే అభ్యర్థుల నుంచి షరతులతో కూడిన తిరిగి చెల్లించే సెక్యూరిటీ డిపాజిట్లను స్వీకరిస్తోంది.

ఆరోవంతు ఓట్లు సాధిస్తేనే..

ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థి నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లలో ఆరో వంతు ఓట్లను సాధించాల్సి ఉంటుంది. ఆరో వంతు ఓట్లు వచ్చిన అభ్యర్థికి ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం రిటర్నింగ్‌ అధికారి డిపాజిట్‌ తిరిగి చెల్లిస్తారు. లేకపోతే ఆ డబ్బులను ఎన్నికల సంఘం అధికారులు స్వాధీనం చేసుకుంటారు.

విత్‌ డ్రా, స్క్రూటినిలో తిరస్కరించినవారికి..

అభ్యర్థులు నామినేషన్‌ దాఖలు చేసినప్పటికీ పలు కారణాలతో విత్‌ డ్రా చేసుకుంటే వారు చెల్లించిన డిపాజిట్‌ తిరిగి చెల్లిస్తారు. నామినేషన్ల పరిశీలనలో తిరస్కరణకు గురైన వారికి డిపాజిట్‌ డబ్బులు తిరిగి చెల్లిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఏదేమైనా ఎన్నికల్లో బరిలో నిలవడం ఒక ఎత్తయితే.. డిపాజిట్‌ గల్లంతు అనేది అభ్యర్థులను కొన్నిరోజుల పాటు నిరాశ చెందేలా చేస్తుందని నాయకులు పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

రాయికల్‌(జగిత్యాల): మండలంలోని అల్లీపూర్‌ గ్రామానికి చెందిన జోగుల బాలయ్య (56) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై అజయ్‌ తెలిపారు. ఈనెల 13న బాలయ్య మండలంలోని శ్రీరాంనగర్‌ గ్రామంలో ఐకేపీ సెంటర్‌లో చెట్టుపైకెక్కి కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణా షాపు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

రాయికల్‌(జగిత్యాల): రాయికల్‌ పట్టణంలోని సహార కిరాణా షాపులో సోమవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పెట్రోలింగ్‌ చేస్తున్న పోలీసులు గ్రహించి దుకాణ యజమానికి, ఫైర్‌ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అందుబాటులో ఫైర్‌ స్టేషన్‌ లేకపోవడంతో జగిత్యాల నుంచి ఫైరింజన్‌ వచ్చేసరికి దుకాణంలో రూ.10 లక్షల విలువగల వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయని యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటన స్థలాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ మోర హన్మండ్లు సందర్శించారు. ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వేధిస్తున్న భర్తపై కేసు

సారంగాపూర్‌(జగిత్యాల): బీర్‌పూర్‌ మండల కేంద్రానికి చెందిన రవి తన భార్య రజితను వేధిస్తుండడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గౌతంపవార్‌ కథనం ప్రకారం.. రజితకు 20 ఏళ్ల క్రితం రవితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్నిరోజులుగా రవి అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధిస్తున్నాడు. భర్త వేధింపులు భరించలేక రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో వెలసిన గుడిసెలు



ప్రభుత్వ స్థలంలో గుడిసెలు

జగిత్యాలజోన్‌: జగిత్యాల రూరల్‌ మండలం నర్సింగాపూర్‌ శివారు నూకపల్లి హౌజింగ్‌ కాలనీ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఓ గుట్ట ఉంది. ఆ గుట్టను ఇటీవల చదును చేయగా.. కొందరు వ్యక్తులు చీరలతో గుడిసెలు వేసుకున్నారు. దీనిపై కొందరు స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు వేచి చూసే ధోరణి ప్రదర్శిస్తున్నారు.

మాకు ఎలాంటి సంబంధం లేదు


జగిత్యాల: జగిత్యాల రూరల్‌ మండలం నర్సింగాపూర్‌ శివారు సర్వేనంబరు 437 లో భూ పట్టాలు ఇస్తామని గుడిసెలు వేయించడం లాంటి కార్యక్రమాలు సీపీఐ చేయడం లేదని, కొందరు అనవసరంగా తమ పార్టీ పేరు చెప్పి రాద్ధాంతం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్‌ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఇలాంటి దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కన్వీనర్‌ శ్రీనివాస్‌, వెన్న మహేశ్‌ ఉన్నారు.

ఓసీపీలో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు

- పరిస్థితి విషమం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్‌–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో మంగళవారం ప్రమాదం జరిగింది. పీసీ పటేల్‌ ప్రైవేట్‌ ఓబీకి చెందిన వాహనం ఢీకొట్టడంతో ప్రైవేట్‌ బోలెరో నడుపుతున్న అంశాల శ్రావణ్‌ అనే ఎంవీ డ్రైవర్‌ తీవ్రంగా గాయపడ్డాడు. క్వారీలోని ఫోర్‌సీమ్‌ ఏరియాలో ఆ వాహనానికి సాంకేతిక సమస్య తలెత్తడంతో డ్రైవర్‌ ఆపి, పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో ప్రైవేట్‌ ఓబీకి చెందిన తుఫాన్‌ వాహనాన్ని డ్రైవర్‌ రివర్స్‌లో తీసుకువచ్చి, ఢీకొట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో శ్రావణ్‌ ప్రక్కటెముకలు విరిగి, తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌ ఆస్పత్రికి రెఫర్‌ చేశారు. అంతర్గతంగా రక్తస్రావం కావడంతో శ్రావణ్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ సంఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తాపడిన కారును పరిశీలిస్తున్న పోలీసులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ గ్రామ శివారులో మంగళవారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మర్రిగడ్డ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో కారులో డ్రైవర్‌తో పాటు ఓ యువతి ఉన్నట్లు సమాచారం. డ్రైవర్‌తోపాటు యువతి స్వల్ప గాయాలతో ఘటన స్థలం నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్‌ తన సిబ్బందితో హుటాహుటినా ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఘటన స్థలంలో ఎవరూ లేకపోవడంతో కారు రిజిస్ట్రేషన్‌ నంబర్‌కు లింకైనా ఫోన్‌ నంబర్‌కు ఎస్సై కాల్‌ చేయగా స్విచాఫ్‌ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా కారు నంబర్‌ రిజిస్ట్రేషన్‌ అడ్రస్‌ మాత్రం వేములవాడ రూరల్‌ మండలం రుద్రవరం గ్రామానికి చెందినదిగా గుర్తించారు. అయితే ప్రమాద సమయంలో కారులో ఉన్నవారు ఎవరనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతుంది.

ఖరీదైన వైద్యం చేయించుకోలేక నిరుపేద మృతి



లక్ష్మణ్‌ (ఫైల్‌)

చందుర్తి(వేములవాడ): ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఓ నిరుపేద వ్యక్తి మృతిచెందిన ఘటన చందుర్తి మండలం కట్టలింగంపేటలో మంగళవారం విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కట్టలింగంపేటకు చెందిన మల్లారపు లక్ష్మణ్‌(55) నెల రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. లక్ష్మణ్‌ను వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పాడయ్యాయని, డయాలసిస్‌ చేయించుకోవాలని సూచించారు. నాలుగైదుసార్లు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీలో డయాలసిస్‌ చేయించుకున్నాడు. కూలీ పని చేసుకుని జీవించే ఈ కుటుంబానికి రవాణా ఖర్చులే భారంగా మారాయి. మంగళవారం డయాలసిస్‌ చేయించుకునేందుకు కరీంనగర్‌ వెళ్లాడు. చికిత్స అందుతున్న క్రమంలోనే లక్ష్మ ణ్‌ మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య మల్లవ్వ, కూతురు మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గేదె దాడిలో ఒకరు..

వీణవంక(హుజూరాబాద్‌): ఇప్పలపల్లికి చెందిన ముదిగంటి రాజిరెడ్డి(50) తన గేదె దాడిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజిరెడ్డి మంగళవారం తన ఇంటి సమీపంలో గేదెకు వరిగడ్డి వేస్తున్నా డు. ఆ సమయంలో అది ఒక్కసారిగా కొమ్ములతో పొడవడంతో పక్కనున్న బండరాళ్లపై ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆసిఫ్‌ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు కాగా, ఒకరికి వివాహమైంది.

కరెంట్‌ షాక్‌తో గృహిణి..

సిరిసిల్లటౌన్‌: కరెంట్‌ షాక్‌తో ఓ గృహిణి మృతిచెందిన సంఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఉడుత లావణ్య(40) మంగళవారం ఉదయం బట్టలు ఉతికి ఇంటి ముందర వైరుపై ఆరవేస్తుండగా కరెంట్‌ వైర్లకు ఉన్న జేవైరు తగిలి షాక్‌తో మృతిచెందింది. మృతురాలి మేనమామ అన్నల్‌దాస్‌ నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌ సీఐ ఉపేందర్‌ తెలిపారు.

కోడి కూయకముందే వాట్సప్‌ మోతలు

- సెల్‌ఫోన్లలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్న పార్టీలు



పెగడపల్లి(ధర్మపురి): ఒకప్పుడు కోడి కూతతో నిద్ర లేచేవారు. సెల్‌ఫోన్లు వచ్చాక వాటి అలారం అలవాటుగా మారింది. ప్రస్తుతం ఎన్నికల పుణ్యమా అని అలారంతో అవసరం లేకుండా వేకువజామున 3 గంటల నుంచే వాట్సాప్‌ గ్రూపుల్లో వస్తున్న మెస్సేజుల చప్పుళ్ల నిద్ర లేపుతున్నాయి. సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఊరూరా ప్రచార రథాలతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నా ప్రచార గడువు తక్కువగా ఉన్న తరుణంలో ఈ పార్టీ, ఆ పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీలు వాట్సాప్‌ గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. దీంతో పాటు జిల్లా, నియోజకవర్గం, మండలంతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఎక్కడ ఏ పార్టీ నాయకుడు మాటల్లో తూలినా వాట్సాప్‌ గ్రూపుల్లో తెగ వైరల్‌ చేస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా.. ఎన్నికల వేళ సాంకేతిక పరి(అ)జ్ఞానం మితి మీరిపోతోంది. ప్రధానంగా వాట్సప్‌ గ్రూపులు ఏర్పాటు చేసి చేస్తున్న ప్రచారం సగటు ఓటర్లను ఇబ్బంది పెడుతోందని చెప్పవచ్చు. ఫొటోలు, వీడియోలు, సమావేశాల సమాచారాన్ని పదుల సంఖ్యలో పోస్టు చేస్తుండటం సగటు మనిషికి విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో ప్రధాన పార్టీల నాయకులు వారికి తెలిసిన నంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేశారు. తమ గ్రూపులో ఎక్కువ మంది ఉన్నారని చెప్పుకోవడానికి తమ వద్ద ఉన్న నంబర్లన్నీ కలుపుతున్నారు. దీంతో అవసరం ఉన్నా లేకపోయినా సదరు గ్రూపుల్లో వచ్చే ఎన్నికల సందేశాల గోల రోజూ అర్ధరాత్రి వరకు భరించడం సెల్‌ఫోన్‌ వాడకపుదారుల వంతవుతుంది.

గ్రూప్‌లో ఉండలేక.. మొహమాటానికి వెళ్లలేక..

ఏదైన పార్టీకి చెందిన వాట్సాప్‌ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్‌ చేస్తే ఇష్టమున్నా లేకున్నా మొహమాటంతో పోస్టులను చూడలేక చదవలేక సతమతమవుతున్నారు. చేసేదేమీ లేక పొరపాటున ఎగ్జిట్‌ అయితే పార్టీ మనిషి కాదనే అవకాశం ఉంటుందని గమ్మున ఉంటున్నారు. కాగా ఒకే గ్రూపులోనే పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా పోస్టులు పెడుతుండటంతో సామాన్య ఓటరు అయోమయానికి గురవుతున్నారు. పార్టీల ప్రచార ఫొటోలు, వీడియోలతో సెల్‌ఫోన్లో నెట్‌ డాటా తొందరగా అయిపోతుందని, మళ్లీ డాటా రీచార్జీకి డబ్బులు ఖర్చువుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనా ఈ ఎన్నికల సీజన్‌లో చెవిలో జోరిగలా వాట్సప్‌, ఫేస్‌బుక్‌, యూట్యూబ్‌ ప్రచార లొల్లితో తిప్పలు తప్పేలా లేవని సామాన్య ఓటరు సతమతమవుతున్నాడు.

మధుమేహంపై నిర్లక్ష్యం వద్దు

- మెడికవర్‌ ఆస్పత్రిలో అవగాహన కల్పించిన వైద్యులు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌ నాగరాజు

కరీంనగర్‌టౌన్‌: వయసు, వంశపారపర్యంతో సంబంధం లేకుండా షుగర్‌ వ్యాధి వస్తుందని, దాన్ని నిర్లక్ష్యం చేయవద్దని మెడికవర్‌ ఆస్పత్రి జనరల్‌ ఫిజీషియన్‌ డాక్టర్‌ నాగరాజు అన్నారు. మధుమేహాన్ని అదుపులో ఉంచాలంటే చికిత్స కంటే నివారణ చర్యలు మేలని తెలిపారు. వరల్డ్‌ డయాబెటిస్‌ డే సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లోని ఆస్పత్రిలో షుగర్‌ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహం తగ్గడానికి ఆహారం, వ్యాయామ నియమాలు పాటించాలన్నారు. కొందరు వీటిని పట్టించుకోకపోవడం వల్ల ట్యాబ్లెట్ల నుంచి ఇన్సులిన్‌ వాడే పరిస్థితులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులకు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమన్నారు. జాగ్రత్తలు తీసుకుంటే షుగర్‌ నియంత్రణ పెద్ద సమస్యేమీ కాదని తెలిపారు. మెడికవర్‌ సెంటర్‌ హెడ్‌ గుర్రం కిరణ్‌, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపోలో రీచ్‌ ఆధ్వర్యంలో..

వరల్డ్‌ డయాబెటిక్‌ డే సందర్భంగా అపోలో రీచ్‌ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్‌ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం కరీంనగర్‌ రన్నర్స్‌ అండ్‌ సైక్లిస్ట్‌ భాగస్వామ్యంతో అవగాహన సదస్సు, వ్యాయామ ప్రాధాన్యత తెలియజేస్తూ ఒక కిలోమీటర్‌ పరుగు పందెం చేపట్టారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు చంద్రశేఖర్‌, తిరునాధర్‌, అనిల్‌ మూల్వార్‌, సుబ్రత్‌ కుమార్‌, వాసు, అజయ్‌ ఖండల్‌, రాజకుమార్‌, నాగ సతీశ్‌, మహేశ్‌ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



ఆర్టీసీ సిబ్బందికి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

విద్యానగర్‌(కరీంనగర్‌): ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్‌–2 డిపో, కరీంనగర్‌ బస్‌స్టేషన్‌ ఆవరణలో అసోసియేషన్‌ ఆఫ్‌ ఫిజీషియన్స్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు షుగర్‌ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రయాణికులతో కలిపి మొత్తం 453 మందికి బీపీ చెక్‌ చేసి, పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ (ఆపరేషన్స్‌) ఎస్‌.భూపతి రెడ్డి, డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ (మెకానికల్‌) కె.సత్యనారాయణ, కరీంనగర్‌–2 డిపో మేనేజర్‌ వి.మల్లయ్య, పర్సనల్‌ ఆఫీసర్‌ ఎం.చంద్రయ్య, అసిస్టెంట్‌ ట్రాఫిక్‌ మేనేజర్‌ పి.రజనీ కృష్ణ, వైద్యులు ఎం.విజయమోహన్‌ రెడ్డి, రఘురామన్‌, ఆర్‌.వెంకటేశ్వర్లు, పి.చైతన్య రెడ్డి, ఆర్టీసీ సీనియర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ ఎం.మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

వీర్నపల్లి(సిరిసిల్ల): వనపల్లికి చెందిన కాదాస్‌ సాగర్‌ (20) సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సాగర్‌ హైదరాబాద్‌లోని ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్లే క్రమంలో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాగర్‌ మృతితో వనపల్లిలో విషాదం నెలకొంది.

పోలింగ్‌ కేంద్రాల సందర్శన

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్‌లోని 3 పోలింగ్‌ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా మంగళవారం సందర్శించారు. జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లోని 11, 12, 13 డు కేంద్రాల్లో ఓటర్లు, సిబ్బందికి వసతుల కల్పన తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. అంతర్గాం రెవెన్యూ పరిశీలకుడు రాజేందర్‌ రెడ్డి, బూత్‌ లెవల్‌ ఆఫీసర్‌ పెండ్యాల విమల, హెచ్‌ఎం గంగ్ర రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో కొత్త పథకం

- వార్షిక ప్రీమియం రూ.399, రూ.396లతో రూ.10 లక్షల బీమా
- 18 నుంచి 65 ఏళ్ల వారికి వర్తింపు



జ్యోతినగర్‌(రామగుండం): కరోనా తర్వాత ప్రజల్లో హెల్త్‌ ఇన్సూరెన్స్‌పై అవగాహన బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖలో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రమాద బీమాను గ్రూప్‌ యాక్సిడెంట్‌ గార్డ్‌ పాలసీ పేరుతో ప్రారంభించింది. ఏడాదికి రూ.399, రూ.396 చెల్లిస్తే రూ.10 లక్షల బీమా వర్తిస్తుంది. పోస్టల్‌ పేమెంట్‌ బ్యాంక్‌ ద్వారా దీన్ని చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ ప్రీమియంతో అనేక ప్రయోజనాలు కల్పించారు. ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా పరిధిలో పెద్దపల్లి, హుజూరాబాద్‌లలో హెడ్‌ పోస్టాఫీసులు, 37 సబ్‌ పోస్టాఫీసులు, శాఖలు 353 ఉన్నాయి.

ప్రయోజనాలు ఇవీ..

ఇండియా పోస్ట్‌ పేమెంట్స్‌ బ్యాంక్‌ తన కస్టమర్లకు గ్రూప్‌ యాక్సిడెంట్‌ బీమా పాలసీ అందిస్తోంది. 18 నుంచి 65 ఏళ్ల వయసు కలిగినవారు దీన్ని తీసుకోవచ్చు. ప్రమాదంలో మరణించినా.. శాశ్వత వైకల్యం ఏర్పడినా, అవయవం కోల్పోయినా, పక్షవాతం వచ్చినా రూ.10 లక్షలు చెల్లిస్తారు. పాలసీ తీసుకున్న వ్యక్తి ప్రమాదం జరిగి, వైద్యం కోసం ఆస్పత్రిలో చేరితే ఐపీడీ కింద రూ.60 వేలు, ఔట్‌ పేషెంట్‌కు రూ.30 వేలు ఇస్తారు. విద్య ప్రయోజనానికి గరిష్టంగా ఇద్దరు పిల్లలకు రుసుములో 10 శాతం లేదా రూ.లక్ష వరకు ఎంచుకోవచ్చు. కుటుంబ ప్రయోజనాలకు రూ.25 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు ఇస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



పోస్టాఫీసు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి. సేవింగ్‌ ఖాతాలను కూడా అందిస్తున్నాం. ఏటీఎం కార్డు సౌకర్యం ఉంది. ప్రమాద బీమా పాలసీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. గతేడాది పాలసీ తీసుకున్న వారు ఈ నెలలో రెన్యువల్‌ చేయించుకోవాలి.

– ఎం.శ్రీనివాస్‌, ఇన్‌స్పెక్టర్‌ పోస్ట్స్‌ గోదావరిఖని సబ్‌ డివిజన్‌

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- బూత్ లెవల్ కమిటీ సమావేశంలో బోయినపల్లి, గంగుల పిలుపు
- బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నిజస్వరూపం ఎండగట్టాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్/కొత్తపల్లి(కరీంనగర్): కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని, కాంగ్రెస్, బీజేపీల కల్లబొల్లి మాటలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకుసాగాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పద్మనాయక కల్యాణ మండపంలో మంగళవారం కరీంనగర్ నియోజకవర్గ బూత్‌లెవల్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటేసేలా ప్రజలను జాగృతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేయాలని, మేనిఫెస్టో అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు హరిశంకర్, పొన్నం అనిల్‌కుమార్, మధు, రాజు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే నట్టేట ముసుగడమే

కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో వచ్చేది లేదు..సచ్చేది లేదని, నమ్మి ఓటేస్తే నట్టేట మునుగడమేనని, పదేళ్లలో అభివృద్ధిని చూసి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని బోయినపల్లి వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లోభాగంగా 33, 34, 35వ డివిజన్ల పరిధిలోని భగత్‌నగర్, గోదాంగడ్డ, సప్తగిరికాలనీ, రాంచంద్రాపూర్‌కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని, ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించి సీఎం కేసీఆర్ నాయకత్వానికి అండగా నిలవాలని కోరారు. ఎలాంటి ఇక్కట్లు లేకుండా ప్రజలు జీవనం సాగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర సంపదపై కన్నేసి మరోసారి కుట్రలకు, కుతంత్రాలకు తెరలేపుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిపై 36 భూకబ్జా కేసులు ఉన్నాయి, ఆయనకు ఓటేస్తే అంధకారమే, నాలుగున్నరేళ్లుగా ఎంపీగా ఉండి నయాపైసా అభివృద్ధి చేయని బండి సంజయ్ బీజేపీ ఎమ్మెల్యేగా గెలిపించాలని వస్తున్నాడు అయన చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలు నిలదీయాలని కోరారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పోరాటం చేసి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు మంచి జరుగుతుందన్నారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు బీఆర్ఎస్‌ను గెలిపించాలని, బీజేపీ, కాంగ్రెస్ కుమ్ములాటలతోనే సతమతమవుతాయి, ఆ పార్టీల వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ వై.సునీల్‌రావు, చాడగొండ బుచ్చిరెడ్డి, బర్కత్ అలీ, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, ఎంఐఎం పట్టణ అధ్యక్షులు అహ్మద్ హుస్సేన్,గడ్డం ప్రశాంత్ రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అడుగడుగునా ఘన స్వాగతం

బీజేపీ, కాంగ్రెస్ దొంగలకు ఓటేస్తే ఢిల్లీ వెళ్లడంతో పాటు తద్వారా ఓటు వృథా అవుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ అన్నారు. కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్, మల్కాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు అడుగడుగునా ఘన స్వాగతం పలకగా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో గంగుల మాట్లాడుతూ.. కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని, నిరంతర అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఆంధ్రోళ్ల ఢిల్లీ పార్టీలతో కుమ్మక్కై తెలంగాణను దోచుకునేందుకు సిద్ధమయ్యారని. తాను చేసిన అభివృద్ధి పనులు.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపిస్తే నాలుగున్నర ఏళ్లుగా ప్రజలకు చేసిందేమీ లేదని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేసేదేమీ ఉండదన్నారు. బీజేపీకి రెండు సీట్లు వచ్చే అవకాశం లేదన్నారు. కాంగ్రెస్ బీజేపీ నాయకులు దొంగలు..మోసగాళ్లని వారి పట్ల తస్మాత్ జాగ్రత్తగా ఉండాలన్నారు. బీఆర్ఎస్‌కు ఓటువేసి ఐదేళ్లు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలత మహేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జెడ్పీ కో ఆప్షన్ సాబీర్ పాషా, ఏఎంసీ చైర్మన్ మధు, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ గంగమ్మ, నాయకులు లస్మయ్య, చందు, జనార్దన్, ఈశ్వర్ గౌడ్, మల్లేశం, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.


గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజల కోసం పోరాడే మనిషిని

- బీజేపీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలది భూకబ్జా, అవినీతి లొల్లి
- ఈ గడ్డపై ఏ జెండా ఎగరేయాలో తేల్చుకోండి


బొమ్మకల్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్: : 'ఇసుక కుప్పలు కన్పిస్తే పైసలు గుంజుతున్నరు... ఖాళీ జాగా కన్పిస్తే కబ్జా చేస్తున్నరు.. ప్రజల రక్తం తాగుతున్నరు. బీజేపీ అధికారంలోకి వస్తే ఒక్కొక్కరి సంగతి తేలుస్తాం.. అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతల రౌడీయిజం, అవినీతి తారాస్థాయికి చేరిందని మండిపడ్డారు. శ్మశాన వాటికల్లో గడ్డి పెరిగిందని దొంగ బిల్లులు పెట్టి లక్షల రూపాయలు దండుకున్న నీచులని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు భూకబ్జా, అవినీతికి పాల్పడటం తప్ప చేసిందేమీ లేదని, పొరపాటున రెండు పార్టీల్లో ఎవరు గెలిచినా ప్రజల రక్తం తాగుతారని అన్నారు. ఓడిపోతాననే భయంతో ఓవైసీ వద్ద మోకరిల్లి పచ్చ జెండా పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. పువ్వు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికల్లో భాగంగా మంగళవారం భగత్‌నగర్, రామచంద్రాపూర్, అంజనాద్రి కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. బండి సంజయ్‌రాకతో జనం భారీ ఎత్తున తరలివచ్చారు. ప్రజలు తిలకం దిద్ది, పూలు చల్లి నీరాజనం పలికారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరిదీ భూకబ్జాలు, అక్రమ దందా, అవినీతి లొల్లి అన్నారు. నేను ఎవరి భూములను కబ్జా చేయలే. అవినీతికి పాల్పడలే... ప్రజల కోసం పోరాడే మనిషిని. నన్ను గెలిపిస్తే వాళ్ల సంగతి తేలుస్తా. కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తే... కనీసం నన్ను పిలవకుండా కొబ్బరికాయకొట్టి తానే నిధులు తెచ్చినట్లుగా ఫోజులు కొడుతున్నడు. కమలం గుర్తుపై గుద్దితే బీఆర్ఎస్ బాక్సులు బద్దలు కావాలని పిలుపునిచ్చారు. గంగులకు మూడుసార్లు ఓట్టేస్తే దోచుకోవడం దాచుకోవడం తప్ప ఆయన చేసిందేమీ లేదు. ఎంపీగా గెలిపిస్తే మీకోసం యుద్ధ చేసిన, డబుల్ ఇండ్లు ఇస్తే నేనెందుకు కొట్లాడతా, మీ పిల్లలకు ఉద్యోగాలిచ్చారా? ఒక్కరికైనా ఇవ్వలేదే... వాళ్ల కోసం నేను కొట్లాడితే నన్ను అర్ధరాత్రి జైల్లో వేసిర్రు. రైతుల కోసం, ఉద్యోగుల కోసం పోరాడిన. నేను నాలుగున్నరేళ్లుగా మీకోసం కొట్లాడుతూనే ఉన్నా, మీరంతా ఆలోచించి గెలిపించకపోతే యువకుల పక్షాన పోరాడేవారు ఉండరు. పొరపాటున గంగులను గెలిపించినా, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చినా నరకం చూపిస్తడు. కేంద్ర నిధులన్నీ దోచుకుపోతడు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఊళ్లల్లో భూములను కబ్జా చేసుకుంటడు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే నగరంలోని భూములను, గుట్టలను మాయం చేస్తడు. మీ అందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్న. తప్పుడు సమాచారం నమ్మకండి. పిల్లలు, యువకులు గంజాయికి అలవాటు పడి మత్తులో మునుగుతున్నారు, కుటుంబాల్లో గంగుల చిచ్చు పెట్టిండు. ఎన్నికల్లో ఓడిపోతాననే భయంతో లక్ష సెల్‌ఫోన్లు పంచేందుకు, ఓటుకు రూ.10 వేలు ఇచ్చేందుకు రెడీ అయ్యిండు. గంగుల.. నువ్విచ్చే పైసలు, సెల్‌ఫోన్లు తీసుకుంటరు. నీ అరాచకాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తారు, నిన్ను ఓడించడం ఖాయమన్నారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే అభివృద్ధి

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే, కేసీఆర్ సిగ్గు లేకుండా తానే పనులు చేయిస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నాడని బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సంజయ్‌కు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి బొట్టుపెట్టి ఆశీర్వదించారు. సంజయ్ మామా నువ్వు ఎమ్మెల్యేగా గెలువాలంటూ శ్రీనిత అనే చిన్నారి కిడ్డీబ్యాంకులో దాచుకున్న డబ్బులు అందించింది. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ...ఎంపీగా గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళల కోసం కేసీఆర్ సర్కార్‌పై పోరాడి జైలుకు పోయాను,రూ.8వేల కోట్లకు పైగా నిధులను తెచ్చి అభివృద్ధి చేశాను, నేను ఎక్కడ ప్రచారం చేసిన కరెంట్ కట్ చేస్తున్నారు, మరో 15 రోజుల్లో కేసీఆర్ పవర్ కట్ అవుతుందన్నారు. బండి సంజయ్ ఎమ్మెల్యేగా గెలవకుండా సీఎం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుకను కాపాడుకునేందుకు ఆలోచించి ఓటేసి గెలిపించాలని కోరారు. మంత్రి గంగుల కమలాకర్ పదేళ్ల కాలంలో కొత్త రేషన్‌కార్డులు ఇచ్చారా, కేంద్రం 2.4లక్షల ఇండ్లు మంజూరీ చేస్తే పేదలకు ఎందుకు ఇవ్వలేదో నిలదీయాలని సూచించారు. ఎన్నికల్లో గంగులకు గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ డి.శంకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్,గంద్ర నళిని, నందకుమార్ పాల్గొన్నారు.


గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

ఘనంగా బాలల దినోత్సవం

కరీంనగర్: నగరంలోని కోతి రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. అచీవర్స్ యాక్టివ్ స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పారమిత ఉన్నత, పారమిత హెరిటేజ్, ఎక్స్‌ప్లోరిక, ఐరిశ్ వరల్డ్ స్కూల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. హనుమాన్‌నగర్ వసంత్ వ్యాలీ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు.

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని విద్యాసంస్థలను అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు వివిధ రకాల దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

విద్యానగర్(కరీంనగర్): పట్టణంలోని ది ప్లే స్కూల్‌లో విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. వావిలాలపల్లి సెయింట్ పాల్స్ హై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు.

కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లి, భగత్‌నగర్, కొత్తపల్లిలలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి నెహ్రూ సేవలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులను డీర్‌పార్కుకు తీసుకెళ్లారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉత్సాహం పెంపొందించారు. బావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. రేకుర్తిలోని ప్యారడైజ్ హైస్కూల్‌లో నెహ్రూ విగ్రహానికి విద్యా సంస్థల చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి నివాళులర్పించారు. వేడుకల్లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


కొత్తపల్లి: బాపుపేట హైస్కూల్‌లో స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు


విద్యానగర్(కరీంనగర్): ఫుడ్ ఫెస్టివల్‌లో వివిధ వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


అల్ఫోర్స్‌లో నిర్వహించిన బాలల దినోత్సవంలో విద్యార్థులతో డా.నరేందర్ రెడ్డి


మానేరులో కేక్ కట్‌చేస్తున్న చైర్మన్ అనంతరెడ్డి


భగవతిలో...


పారమిత స్కూల్‌లో...


సిద్ధార్థలో చిన్నారుల నృత్య ప్రదర్శన

నెహ్రూ ఆలోచనలతోనే దేశం అభివృద్ధి


నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆలోచనల విధానంతోనే దేశాభివృద్ధి సాధ్యమైందని పీసీసీ నాయకుడు వైద్యుల అంజన్ కుమార్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మంగళవారం డీసీసీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ మాట్లాడుతూ.. నెహ్రూ చేసిన కార్యక్రమాలే దేశాన్ని ప్రగతి వైపు నడిపించేందుకు దోహదం చేశాయన్నారు. ఆయన ముందుచూపుతోనే నాగార్జునసాగర్, బాక్రాంనంగల్, శ్రీరాంసాగర్ వంటి ప్రాజెక్టులు నిర్మించారన్నారు. రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ అంబేడ్కర్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి నెహ్రూ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడుపు మోహన్, మునిగంటి అనిల్, ముస్తాక్ హైమద్, బొబ్బిలి విక్టర్, మన్నే జీవన్, సలీముద్దీన్, వంగల విద్యాసాగర్, నాగుల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

కరీంనగర్‌టౌన్: బాలల దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఆశాజ్యోతి పాజిటివ్ పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ చేతుల మీదుగా అనాథ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ, సొసైటీ అధ్యక్షురాలు మమత, సీఎస్‌సీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఏఆర్‌టీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.


కేక్‌కట్ చేస్తున్న ఆశాజ్యోతి సొసైటీ బాధ్యులు

ఈసారి టార్గెట్ తక్కువే..

- ఒక్కో నర్సరీలో ఐదువేల మొక్కల పెంపకం
- గత హరితహారంలో భారీగా మిగిలిన మొక్కలు
- మట్టి తరలింపు పనులు ప్రారంభం


చేగుర్తి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించే నర్సరీల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పథకం కింద నర్సరీలను ప్రభుత్వ స్థలాల్లోనే నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. నాణ్యమైన ఎర్రమట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపడానికి నర్సరీలకు తరలిస్తున్నారు.

ఒక్కో నర్సరీలో ఐదువేల మొక్కలు...

వానాకాలంలో నిర్వహించిన తొమ్మిదో విడత హరితహారానికి ప్రతి నర్సరీలో పదివేల మొక్కలు పెంచారు. అయితే నర్సరీల్లో మొక్కలు ఎక్కువ సంఖ్యలో మిగిలిపోవడంతో రాబోయే పదో విడత హరితహారం కోసం ఒక్కో నర్సరీలో ఐదువేల మొక్కలు మాత్రమే పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరీంనగర్ మండలంలోని 17 గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నల్లగుంటపల్లిలో ప్రభుత్వస్థలం అందుబాటులో లేకపోవడంతో మిగితా 16 గ్రామాల్లో నర్సరీల నిర్వహణకు ప్రభుత్వం అనుమతిచ్చింది. గోపాల్‌పూర్‌లో ప్రైవేట్ స్థలం నుంచి సెగ్రిగేషన్‌షెడ్ ఆవరణలోకి నర్సరీని తరలించగా బొమ్మకల్‌లో ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు బొమ్మకల్, జూబ్లీనగర్ తదితర గ్రామాల్లోని నర్సరీలకు ఎర్రమట్టిని తరలించారు. మరో నాలుగైదు రోజుల్లో మిగతా నర్సరీలకు మట్టిని పంపించనున్నారు. వివిధ రకాల మొక్కల విత్తనాలను గ్రామ పంచాయతీలు ముందుగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మట్టినింపి విత్తనాలు మొలకెత్తడానికి ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లను అధికారులు సరఫరా చేయనున్నారు.


బొమ్మకల్ నర్సరీలో ఎర్రమట్టి అన్‌లోడింగ్

త్వరలో పనులు ప్రారంభం

అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టాం. రెండు, మూడు రోజుల్లో నర్సరీలకు ఎర్రమట్టి తరలింపు పూర్తి చేసి కవర్లలో మట్టినింపే పనులు ప్రారంభిస్తాం. విత్తనాలు నాటేందుకు నర్సరీలకు ప్లాస్టిక్‌సంచులను సరఫరా చేస్తాం.

– శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

పోస్టర్ ఆవిష్కరణ



విద్యానగర్ (కరీంనగర్): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్‌శాఖ ఆధ్వర్యంలో 'ఓటుహక్కు విలువ' 'ప్రాముఖ్యత'వివరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో షోయబ్ అహ్మద్ ఖాన్, జమాతే ఇస్లామీ ,జిల్లా అధ్యక్షులు హబీబ్ ఉన్నిస లతీఫ్, జమాత్ ఇస్లామీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ మహమ్మద్, మహమ్మద్ కై రుద్దీన్, మహమ్మద్ మొయిద్ హమీద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



కరీంనగర్‌రూరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ మండలం నగునూరులో మంగళవారం ఉచిత డయాబెటీస్ వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి రక్తపరీక్షలు చేసి 20 మందికి బీపీ, 15 మందికి షుగర్ ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి పాల్గొన్నారు.

చిత్ర కథ: కొత్త గేటు ఏర్పాటు చేయండి



కరీంనగర్ మండలం ఫకీర్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గేటు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కలు, పశువులు యథేచ్ఛగా పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. ఉన్న ఇనుపగేటు తుప్పు పట్టి ఖాళీ రాడ్లు మాత్రమే ఆనవాళ్లుగా మిగిలాయి. దశాబ్దకాలంగా విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా కొత్త గేటు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

- నియామకం

కొత్తపల్లి: కాంగ్రెస్ పార్టీ కొత్తపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చింతకుంటకు చెందిన పిట్టల హరికృష్ణను నియమించినట్లు మండల అధ్యక్షుడు స్వామిగౌడ్ తెలిపారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు.


రోహిత్ శర్మ
విలియమ్సన్

సెమీస్ 'ప్రతీకార' సమయం

నేడు ప్రపంచకప్ తొలి సెమీఫైనల్ • న్యూజిలాండ్‌తో భారత్ ఢీ
అద్భుత ఫామ్‌లో టీమిండియా • ఆత్మవిశ్వాసంతో కివీస్ బృందం
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

9 మంది ప్రత్యర్థులు... 9 విజయాలు... అదిరిపోయే బ్యాటింగ్ బలగం... పేసర్ల అద్భుత ప్రదర్శన... స్పిన్నర్ల జోరు... ఫీల్డింగ్ మెరుపులు... వెరసి ఇప్పటివరకు టీమిండియా అజేయ యాత్ర సాగిపోయింది. ఏమాత్రం పోటీ, ఎదురన్నదే లేకుండా దూసుకుపోయి ప్రపంచకప్ లీగ్ దశను అజేయంగా ముగించిన భారత్ జట్టు అసలైన సమరానికి సిద్ధమైంది. లీగ్ దశలో చూపించిన జోరును మరో రెండు మ్యాచ్‌లలో కొనసాగిస్తే చాలు... భారత్ మూడోసారి వరల్డ్ కప్ సగర్వంగా గెలిచి కోట్లాది అభిమానుల కోరిక నెరవేరడం ఖాయం. అయితే ఇప్పుడు గత 9 మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేదు. మళ్లీ కొత్తగా మొదలు పెట్టాల్సిందే. తీవ్ర ఒత్తిడి, ఒక్క క్షణం కూడా అలసత్వం ప్రదర్శించినా కోలుకునే అవకాశం ఉండని నాకౌట్ మ్యాచ్‌లో పూర్తి స్థాయిలో సత్తా చాటాల్సిందే.

ఎదురుగా ఉన్నది అణువణువూ పోరాటతత్వం నింపుకున్న న్యూజిలాండ్ జట్టు. ప్రత్యర్థి ఎవరైనా ఆఖరి బంతి వరకు పట్టు వీడని కివీస్‌తో పోరు అంత సులువు కాదు. నాలుగేళ్ల క్రితం సెమీఫైనల్లోనే కివీస్ కొట్టిన దెబ్బను సగటు భారత క్రికెట్ అభిమాని మరచిపోలేదు... ప్రత్యర్థితో పోలిస్తే మన జట్టుదే అన్ని రకాలుగా పైచేయిగా కనిపిస్తున్నా కీలక సమయంలో పట్టుదలగా నిలవడమే ప్రధానం. ఈ నేపథ్యంలో ప్రపంచకప్ తొలి సెమీఫైనల్‌కు రంగం సిద్ధమైంది. వరుసగా గత రెండు ప్రపంచకప్‌లలో సెమీఫైనల్‌కే పరిమితమైన భారత్ ఈసారి ఈ అడ్డంకి దాటి ఫైనల్ చేరుతుందా లేక గత రెండు టోర్నీల్లో ఫైనల్లోనే ఓడిన న్యూజిలాండ్ మరోసారి తుది పోరుకు అర్హత సాధిస్తుందా అనేది ఆసక్తికరం.

ముంబై: ప్రపంచకప్‌లో భారత్ గెలిచిన 9 మ్యాచ్‌లలో కాస్త ఇబ్బంది పడిన, తడబాటుకు గురైన మ్యాచ్ ఏదైనా ఉందంటే అది న్యూజిలాండ్‌తోనే. 274 పరుగుల లక్ష్యఛేదనలో చివరికి 4 వికెట్ల తేడాతో మ్యాచ్ గెలిచి టీమిండియా గట్టెక్కింది. ఇప్పుడు అదే న్యూజిలాండ్‌తోనే రోహిత్ బృందం సెమీఫైనల్లో అమీతుమీకి సై అంటోంది. వాంఖెడే మైదానంలో నేడు జరిగే తొలి సెమీస్ పోరులో కివీస్‌తో భారత్ తలపడుతుంది. లీగ్ దశ ఆరంభంలో అద్భుతంగా ఆడి ఆ తర్వాత వెనుకబడినా చివర్లో రాణించి టాప్-4లో చోటు దక్కించుకున్న న్యూజిలాండ్ మరోసారి సెమీస్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. టీమిండియా ఫేవరెట్‌గా కనిపిస్తున్నా నాకౌట్ మ్యాచ్ కావడంతో అంచనాలకు భిన్నంగానూ సాగే అవకాశం ఉంది.

మార్పుల్లేకుండా...


బుమ్రా, షమీ

వరల్డ్‌కప్‌లో తొలి నాలుగు మ్యాచ్‌ల తర్వాత ధర్మశాలలో న్యూజిలాండ్ జరిగిన ఐదో మ్యాచ్ కోసం టీమిండియా స్వల్ప మార్పులు చేసింది. ఆ తర్వాతి నుంచి ఎలాంటి మార్పు లేకుండా అదే తుది జట్టును కొనసాగిస్తోంది. జట్టు ఫామ్‌ను బట్టి చూస్తే ఇప్పుడూ అదే కొనసాగించడం ఖాయం. టీమ్ మొత్తం తమదైన రీతిలో సత్తా చాటి జట్టును నడిపిస్తున్నారు. ఎలాంటి ఆందోళన లేకుండా ఏ విషయంలోనూ లోపాలు లేకుండా జట్టు గొప్పగా కనిపిస్తోంది. విరాట్ కోహ్లి టోర్నీలో టాప్ స్కోరర్‌గా (594 పరుగులు) కొనసాగుతుండగా, రోహిత్ శర్మ 503, శ్రేయస్ 421 పరుగులతో జట్టు బ్యాటింగ్‌ను నడిపిస్తున్నారు. గిల్, రాహుల్‌లకు కూడా విజయాల్లో ప్రధాన భాగస్వామ్యం ఉంది. మిడిలార్డర్‌లో సూర్యకుమార్, జడేజాల బ్యాటింగ్ భారత్‌కు అదనపు బలంగా మారింది. ముగ్గురు పేసర్లు బుమ్రా, షమీ, సిరాజ్‌లను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు దాదాపు అసాధ్యంగా మారగా... కుల్దీప్, జడేజా స్పిన్‌ను కూడా వారు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇలాంటి స్థితిలో భారత్‌ను నిలువరించాలంటే ఏ జట్టయినా అసాధారణ ఆటతీరు కనబర్చాల్సి ఉంటుంది.

ఆల్‌రౌండ్ నైపుణ్యంతో...


మిచెల్, రచిన్

న్యూజిలాండ్ కూడా అంచనాలకు మించి రాణించి భారత్‌ను ఓడించాలని పట్టుదలగా ఉంది. ఆటగాళ్లంతా పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. ఓపెనర్లు కాన్వే, రచిన్ రవీంద్ర వరుసగా జట్టుకు శుభారంభాలు అందిస్తున్నారు. రచిన్ 565 పరుగులతో మూడో స్థానంలో ఉండగా, మిడిలార్డర్ బ్యాటర్ డరైల్ మిచెల్ కూడా 418 పరుగులు సాధించాడు. 359 పరుగులు చేసిన కాన్వే దూకుడుగా ఆడటంలో మేటి. కెప్టెన్ కేన్ విలియమ్సన్ తన బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను సమర్థంగా నడిపించగలడు. టామ్ లాథమ్ కూడా చక్కటి బ్యాటర్ కాగా... మెరుపు బ్యాటింగ్ చేయగల ఫిలిప్స్, చాప్‌మన్ ఆ జట్టు మిడిలార్డర్‌లో ఉండటం అదనపు బలం. స్పిన్నర్ సాన్‌ట్నర్‌పై భారత్‌పై మంచి రికార్డు ఉండగా... కివీస్ కూడా తమ పేస్ బలాన్ని నమ్ముకుంటోంది. ముఖ్యంగా ఆరంభ ఓవర్లలో ట్రెంట్ బౌల్ట్ చెలరేగితే భారత్‌కు కష్టాలు తప్పవు. ఫెర్గూసన్ కూడా ఫామ్‌లో ఉండగా సౌతీ అనుభవం జట్టుకు ఉపయోగపడగలదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, కేఎల్ రాహుల్, సూర్యకుమార్, జడేజా, షమీ, కుల్దీప్, బుమ్రా, సిరాజ్. న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), కాన్వే, రచిన్ రవీంద్ర, మిచెల్, లాథమ్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, సౌతీ, ఫెర్గూసన్, బౌల్ట్.

4 నేడు న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌తో విరాట్ కోహ్లి అత్యధికంగా నాలుగుసార్లు (2011, 2015, 2019, 2023) వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లు ఆడిన భారత ప్లేయర్‌గా గుర్తింపు పొందుతాడు. సచిన్ టెండూల్కర్ (1996, 2003, 2011), ధోని (2011, 2015, 2019) మూడుసార్లు చొప్పున వరల్డ్‌కప్ సెమీఫైనల్స్ ఆడారు.

11 మూడు వరల్డ్‌కప్ సెమీఫైనల్స్‌లో కలిపి కోహ్లి చేసిన పరుగులు. 2011 పాక్‌తో సెమీస్‌లో 9 పరుగులు... 2015 ఆస్ట్రేలియాతో సెమీస్‌లో 1 పరుగు... 2019 న్యూజిలాండ్‌తో సెమీస్‌లో 1 పరుగు చేశాడు. ఈ మూడు సెమీఫైనల్స్‌లో ఎడంచేతి వాటం పేస్ బౌలర్ల (వహాబ్ రియాజ్, మిచెల్ జాన్సన్, ట్రెంట్ బౌల్ట్) చేతిలోనే కోహ్లి అవుట్ కావడం గమనార్హం.



117 భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటి వరకు 117 వన్డేల్లో తలపడ్డాయి. 59 మ్యాచ్‌ల్లో భారత్... 50 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలిచాయి. ఒక మ్యాచ్ 'టై' అయింది. 7 మ్యాచ్‌లు రద్దయ్యాయి.

8 వన్డే ప్రపంచకప్ చరిత్రలో భారత జట్టుకిది ఎనిమిదో సెమీఫైనల్ కానుంది. మూడుసార్లు (1983లో ఇంగ్లండ్‌పై; 2003లో కెన్యాపై; 2011లో పాకిస్తాన్‌పై) సెమీఫైనల్స్‌లో నెగ్గిన భారత్.... నాలుగుసార్లు (1987లో ఇంగ్లండ్ చేతిలో; 1996లో శ్రీలంక చేతిలో; 2015లో ఆస్ట్రేలియా చేతిలో; 2019లో న్యూజిలాండ్ చేతిలో) సెమీఫైనల్లో ఓటమి పాలైంది.

9 వన్డే ప్రపంచకప్ చరిత్రలో న్యూజిలాండ్ జట్టుకిది తొమ్మిదో సెమీఫైనల్ కానుంది. రెండుసార్లు (2015లో దక్షిణాఫ్రికాపై, 2019లో భారత్‌పై) నెగ్గిన న్యూజిలాండ్.. ఆరుసార్లు (1975లో వెస్టిండీస్ చేతిలో; 1979లో ఇంగ్లండ్ చేతిలో; 1992లో పాకిస్తాన్ చేతిలో; 1999లో పాకిస్తాన్ చేతిలో; 2007లో శ్రీలంక చేతిలో; 2011లో శ్రీలంక చేతిలో) పరాజయం పాలైంది.

5 వాంఖెడే స్టేడియంలో భారత్ ఇప్పటి వరకు ఐదుసార్లు వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడింది. 3 మ్యాచ్‌ల్లో (1987లో జింబాబ్వేపై, 2011లో శ్రీలంకపై, 2023లో శ్రీలంకపై) నెగ్గి, 2 మ్యాచ్‌ల్లో (1987లో ఇంగ్లండ్ చేతిలో, 1996లో ఆస్ట్రేలియా చేతిలో) ఓటమి పాలైంది.

9 వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో భారత్, న్యూజిలాండ్ జట్లు 9 సార్లు ముఖాముఖిగా తలపడ్డాయి. 4 మ్యాచ్‌ల్లో భారత్... 5 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ విజయం సాధించాయి.

1 వాంఖెడె స్టేడియంలో భారత్‌తో జరిగిన ఏకైక మ్యాచ్‌లో (2017లో) న్యూజిలాండ్ గెలిచింది.



21 వాంఖెడే స్టేడియంలో భారత జట్టు ఇప్పటి వరకు 21 మ్యాచ్‌లు ఆడింది. 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 9 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

"భారత్‌తో మ్యాచ్ మాకు పెద్ద సవాల్ అనేది వాస్తవం. ఆ టీమ్ చాలా బాగా ఆడుతోంది. అయితే టోర్నీలో ప్రతీ మ్యాచ్ భిన్నమైందే. తమదైన రోజున ఏ జట్టయినా ఎలాంటి జట్టునైనా ఓడించగలదు. జట్టు బలంతో పాటు అప్పటి పరిస్థితులు, వాటి ప్రభావం కూడా అందుకు కారణమవుతాయి. లీగ్‌లో ఎంత కష్టపడి ఇక్కడికి వచ్చామన్నది ముఖ్యం కాదు. నాకౌట్ దశను మళ్లీ కొత్తగా మొదలు పెట్టాల్సిందే. వరుసగా గత రెండు వరల్డ్ కప్‌లలో మేం ఫైనల్ చేరినా మమ్మల్ని ఇంకా అండర్‌డాగ్స్‌గానే చూస్తుంటారు. మేం వీటికి అలవాటుపడిపోయాం కాబట్టి ఇబ్బందేమీ లేదు. మా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తే ఇక్కడా గెలవగలం కాబట్టి ఏదైనా జరగొచ్చు. 2019లాగే ఈసారి కూడా మైదానంలో అంతా భారత అభిమానులే ఉంటారు. మాకు మద్దతు పలకకపోయినా ఆ వాతావరణం మాత్రం చాలా బాగుంటుంది. మా జట్టులో చాలా మందికి ఇది అలవాటే. అయినా భారత గడ్డపై భారత్‌తో సెమీస్‌లో తలపడటమే ఎంతో ప్రత్యేకం. -కేన్ విలియమ్సన్, న్యూజిలాండ్ కెప్టెన్

నాడు ఏం జరిగిందంటే...

2019 జూన్ 9-10... మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానం... భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీస్ మ్యాచ్... భారత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు కివీస్ 46.1 ఓవర్లలో 5 వికెట్లకు 211 పరుగులు చేసింది. అయితే వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోవడంతో తర్వాతి రోజు ఆట కొనసాగగా, చివరకు 50 ఓవర్లలో 8 వికెట్లకు 239 పరుగులతో న్యూజిలాండ్ ముగించింది. ఎలా చూసినా ఇది టీమిండియా ఛేదించదగ్గ స్కోరే. అయితే 5 పరుగులకే రోహిత్, కోహ్లి, రాహుల్ వెనుదిరగడంతో పేలవ ఆరంభం లభించగా... ఒకదశలో జట్టు 92/6తో ఓటమికి చేరువైంది. జడేజా 59 బంతుల్లోనే 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో ఎదురుదాడి చేయడంతో గెలుపుపై ఆశలు రేగాయి. అయితే కివీస్ తమ బౌలింగ్‌తో మళ్లీ మ్యాచ్‌ను అదుపులోకి తెచ్చుకుంది. 14 బంతుల్లో 32 పరుగులు చేయాల్సిన స్థితిలో జడేజా వెనుదిరగ్గా... మరో మూడు బంతుల తర్వాత ధోని రనౌట్ భారత అభిమానుల గుండె పగిలేలా చేసింది. అయితే ఏ దశలోనూ దూకుడు చూపించని, అభిమానులు కూడా నివ్వెరపోయేలా సాగిన ధోని ఇన్నింగ్స్ (72 బంతుల్లో 50; 1 ఫోర్, 1 సిక్స్) ఓటమికి కారణాల్లో ఒకటనేది వాస్తవం!



ధైర్యవంతులకే అదృష్టం కూడా అండగా నిలుస్తుంది. మేం ఇప్పుడు పూర్తి నమ్మకంతో, ధైర్యంతో బరిలోకి దిగుతున్నాం. ఇలాంటప్పుడే కాస్త అదృష్టం కూడా కలిసి రావాలి. టోర్నీలో తొలి ఐదు మ్యాచ్‌లలో మేం లక్ష్యాన్ని ఛేదించగా, తర్వాతి నాలుగు మ్యాచ్‌లలో ముందుగా బ్యాటింగ్ చేశాం. కాబట్టి అన్ని రకాలుగా మమ్మల్ని మేం పరీక్షించుకున్నట్లే. వాటితో పోలిస్తే ఈ మ్యాచ్ ప్రాధాన్యత ఏమిటో మాకు తెలుసు. అయినా సరే మేం ఏమీ కొత్తగా ప్రయత్నించాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు ఎలా ఆడామో అలా ఆడితే చాలు. ఒత్తిడి కొత్త కాదు. ప్రపంచకప్‌లో సెమీస్ అయినా లీగ్ మ్యాచ్ అయినా ఒత్తిడి ఎలాగూ ఉంటుంది. భారత క్రికెటర్లపై ఇది మరీ ఎక్కువ. ఆటగాళ్లంతా ఆ స్థితిని దాటుకునే వచ్చారు కాబట్టి ఆడటమే అన్నింటికంటే ముఖ్యం. న్యూజిలాండ్ ఎంతో తెలివైన, క్రమశిక్షణ బాగా కలిగిన జట్టు. ప్రత్యర్థిని బాగా అర్థం చేసుకొని తమ వ్యూహాలు సిద్ధం చేసుకుంటారు. 1983లో భారత్ వరల్డ్ కప్ గెలిచినప్పుడు ప్రస్తుత జట్టులో ఎవ్వరూ పుట్టనే లేదు. 2011లో సగం మంది క్రికెట్ మొదలు పెట్టలేదు. కాబట్టి ఈ జట్టు సభ్యులంతా గతం గురించి కాకుండా వర్తమానంపై, తమ ఆటపై మాత్రమే దృష్టి పెడుతున్నారు. గతంలో నాకౌట్ మ్యాచ్‌లలో, నాలుగేళ్ల క్రితం ఏం జరిగిందనేది కూడా మాకు అనవసరం. -మీడియా సమావేశంలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

పిచ్, వాతావరణం

ఈ వరల్డ్ కప్‌లో వాంఖెడే మైదానంలో పరుగుల వరద పారింది. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో అన్ని జట్లూ భారీ స్కోర్లు చేశాయి. రెండో అర్ధ భాగం ఆరంభంలో పేస్ బౌలింగ్‌కు పిచ్ అనుకూలిస్తోంది. సెమీస్ ఒత్తిడిని కూడా దృష్టిలో ఉంచుకొని చూస్తే టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం. వర్ష సూచన లేదు. ఒకవేళ అవాంతరం ఎదురైనా సెమీస్‌కు రిజర్వ్ డే కూడా ఉంది.

బోపన్న జోడీ ఓటమితో మొదలు



టురిన్ (ఇటలీ): పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌ను రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఓటమితో ప్రారంభించింది. రాజీవ్ రామ్ (అమెరికా)-జో సాలిస్‌బరీ (బ్రిటన్) జోడీతో జరిగిన రెడ్ గ్రూప్ తొలి లీగ్ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 3-6, 4-6తో ఓడిపోయింది. గంటపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించి తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది.

తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ జోడీకి చుక్కెదురు



కుమమోటో: జపాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంక్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 21-16, 18-21, 16-21తో ప్రపంచ 21వ ర్యాంక్ జంట లూ చింగ్ యావో-యాంగ్ పో హాన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలైంది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్ తొలి గేమ్ గెలిచినా ఆ తర్వాత తడబడి మూల్యం చెల్లించుకున్నారు. నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ కొడాయ్ నరోకా (జపాన్)తో లక్ష్య సేన్; లీ చెయుక్ యి (హాంకాంగ్)తో హెచ్ఎస్ ప్రణయ్; లిన్ చున్‌యి (చైనీస్ తైపీ)తో ప్రియాన్షు రజావత్ తలపడతారు.

కివీస్ నుంచి సవాల్ తప్పదు!

గౌతమ్ గంభీర్

సెమీఫైనల్లో కచ్చితంగా భారత జట్టే ఫేవరెట్. ఈ టోర్నీలో ప్రత్యర్థుల్ని కంగుతినిపించడమే కాదు... భారత్‌తో ఢీ అంటేనే కష్టం అనిపించేలా మనోళ్ల జైత్రయాత్ర సాగించారు. ముఖ్యంగా ఈ టోర్నీలో భారత బౌలింగ్ నన్ను ఆకట్టుకుంది. బౌలర్లు జట్టు భారాన్ని తమ భుజాలపై మోశారు. ఈ ప్రపంచకప్ గెలిస్తే మాత్రం దేశంలో బౌలింగ్ విప్లవం ఖాయం. ఇంతవరకు మనలో చాలామంది సచినో, కోహ్లినో కావాలనుకునే క్రికెట్‌లో అడుగుపెట్టేవారు. కానీ ఈ వరల్డ్‌కప్ తర్వాత బౌలర్ల లక్ష్యంతో అకాడమీలు కళకళలాడుతాయంటే ఆశ్చర్యం లేదు. కేఎల్ రాహుల్ బ్యాటింగ్ కళ్లప్పగించేలా చేసింది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై బాదిన శతకం (102) అయితే హైలైట్ అని చెప్పొచ్చు. చక్కని ఫుట్‌వర్క్, పరిణతితో కూడిన ఫ్లిక్ షాట్స్‌తో ఫోర్లు, సిక్సర్లు అదరగొట్టాడు. మణికట్టు స్ట్రోక్‌ప్లేతో పరుగులు సాధించిన తీరు అద్భుతం. దీంతో రాహుల్‌ను ఇప్పుడు 360 డిగ్రీ ప్లేయర్ అనొచ్చు. 160 స్ట్రయిక్‌రేట్ అతని టాప్‌గేర్‌ను సూచిస్తోంది. అలాగని శ్రేయస్ అయ్యర్ ఏం తక్కువ కాదు. డచ్‌పై అతని ఆయుధం పుల్ షాట్‌లే. 128 పరుగుల్లో 42 ఆ షాట్లతో వచ్చినవే! అవే అతని సెంచరీని తేలిక చేశాయి. షార్ట్‌పిచ్ బంతులపై అయ్యర్ కనబరిచిన నైపుణ్యం మురిపించింది. ఏ బంతుల్ని ఎలా ఆడాలో... ఏవి వదిలేయాలో వివేకం చూపించాడు. అయితే కివీస్‌తో జరిగే సెమీస్‌లో మాత్రం అతనికి బౌన్స్, స్వింగ్ పరీక్షలు ఎదురవొచ్చు. తప్పకుండా న్యూజిలాండ్ నుంచి భారత్‌కు సవాల్ ఎదురవుతుంది. ప్రపంచకప్ కోసం బాగా సన్నద్ధమై వచ్చారు. వంద శాతం నిబద్ధతతో మెగా ఈవెంట్ ఆడుతున్నారు. బౌలింగ్, ఫీల్డింగ్‌లో న్యూజిలాండ్ మోహరింపు కట్టుదిట్టంగా ఉంటోంది. భారత టాప్-3 కోసం ఇదివరకే కసరత్తు చేసే వుంటారు. ఇందులో ఏ సందేహం లేదు. బౌలింగ్ ఫ్రెండ్లీ వాంఖెడే పిచ్‌పై భారత బ్యాటర్లకు చేజింగ్ కాస్త ఇబ్బందికరంగా మారొచ్చు. అయితే మనవాళ్లు బాగా ఆడితే ఎవరైనా ఏమీ చేయలేరు.

సినిమా

స్నేహానికి వ్యాపారాన్ని ముడిపెట్టలేను
- స్వాతీరెడ్డి గునుపాటి


• స్వాతీ రెడ్డి గునుపాటి, సురేశ్ వర్మ

పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమర్ ప్రధాన పాత్రధారులుగా, నందితా శ్వేత, దివ్యా పిళ్లై, రవీంద్ర విజయ్, అజయ్ ఘోష్, శ్రీ తేజ్, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మంగళవారం'. అజయ్ భూపతికి చెందిన 'ఏ' క్రియేటివ్ వర్క్స్, ముద్ర మీడియా వర్క్స్‌పై స్వాతీరెడ్డి గునుపాటి (వ్యాపారవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ కుమార్తె), ఎం. సురేష్ వర్మ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ చిత్రనిర్మాతలు మాట్లాడారు.

స్వాతీరెడ్డి గునుపాటి మాట్లాడుతూ – ''అజయ్ భూపతిగారు చెప్పిన 'మంగళవారం' కథ విని, ఈ సినిమా చేస్తే బాగుంటుందనిపించి చేశాను. ఓ సెన్సిటివ్ ఇష్యూని ఆయన సందేశాత్మకంగా చెప్పిన విధానం నాకు నచ్చింది. పాయల్‌కు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఈ సినిమా కోసం ఎంతగానో కష్టపడింది. అజనీష్ మ్యూజిక్ బాగుంటుంది. ఇండస్ట్రీలో నాకు అల్లు అర్జున్, రామ్ చరణ్.. ఇలా అగ్రతారలతో పరిచయం ఉంది. నేను అడిగితే వారు నాతో సినిమాలు చేస్తారు. కానీ నిర్మాతగా ముందు నన్ను నేను నిరూపించుకోవాలి. వాళ్ల స్థాయికి తగ్గ సినిమాలను నిర్మించే అవకాశం ఉన్నప్పుడు వారితో నేను సినిమాలు చేస్తాను. ఎందుకంటే స్నేహాన్ని, వ్యాపారాన్ని ముడిపెట్టడం ఇష్టం లేదు'' అన్నారు.

మరో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ– ''మంగళవారం' సినిమాలో లవ్, కామెడీ, యాక్షన్.. ఇలా అన్ని రకాల భావోద్వేగాలు ఉన్నాయి. ఈ సినిమా తొలి రోజు నుంచే అల్లు అర్జున్‌గారు మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఇక చిన్నతనం నుంచి చిరంజీవిగారికి నేను పెద్ద అభిమానిని. ఆయన మా ట్రైలర్‌ను విడుదల చేయడం మర్చిపోలేని అనుభూతి'' అన్నారు.

ఫైట్‌తో ప్రారంభం


• నాని

'అంటే..సుందరానికీ!' చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా 'సరిపోదా శనివారం'. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య ఓ కీలక పాత్రధారి. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఓ యాక్షన్ సీక్వెన్స్‌తో మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఫైట్ మాస్టర్ రామ్-లక్ష్మణ్ ఈ ఫైట్ ఎపిసోడ్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని యాక్షన్ సన్నివేశాలతో పాటు నాని, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్.



నాగార్జున హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్‌లో నాగార్జున, కీరవాణి, పాటల రచయిత చంద్రబోస్ కలిశారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీ 2024 సంక్రాంతికి రిలీజ్ కానుంది.

ఆ రోజు సౌండ్ పార్టీ

వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా నటించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. శివన్నారాయణ, అలీ, సప్తగిరి, థర్టీ ఇయర్స్ పృథ్వీ, 'మిర్చి' ప్రియ కీలక పాత్రల్లో నటించారు. సంజయ్ శేరి దర్శకత్వంలో జయశంకర్ సమర్పణలో రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 24న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ మంగళవారం ప్రకటించింది. ''ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. సినిమా కూడా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు దర్శక- నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: మోహిత్ రెహమానిక్.


• 'సౌండ్ పార్టీ' పోస్టర్

సాక్షి బిజినెస్
బుధవారం
15-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
326	82
64,934	19,444

విదేశీ సూచీలు (సోమ, మంగళ వారం)			
నాస్‌డాక్	14,048	△	280
డోజోన్స్	34,784	△	446
ఎఫ్‌టీఎస్ఈ 100	7,440	△	15
డాక్స్	15,614	△	269
షాంఘై	3,056	△	10
నికాయ్	32,696	△	111

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.55	84.22
£	బ్రిటన్ పౌండ్		100.29	103.62
€	యూరో		87.53	90.64
¥	జపాన్ ఎన్ (100)		54.14	55.81
AUS	ఆస్ట్రేలియా డాలర్		51.92	54.21
S$	సింగపూర్ డాలర్		60.29	62.24
SAR	సౌదీ రియాల్		21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్		21.79	23.59
¥	చైనా యువాన్		10.31	12.38

800 మందికి టాటా స్టీల్ ఉద్వాసన

న్యూఢిల్లీ: నిర్మాణాత్మక పోటీతత్వం, లాభదాయకతలో భాగంగా టాటా స్టీల్ కీలక నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్‌లో 800 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వీరిలో 300 మంది తాత్కాలిక సిబ్బంది ఉన్నారు. టాటా స్టీల్ యూరప్ నుండి రెండు స్వతంత్ర కంపెనీలుగా టాటా స్టీల్ యూకే, టాటా స్టీల్ నెదర్లాండ్స్‌ను వేరు చేసే ప్రక్రియను 2021 అక్టోబరులో టాటా స్టీల్ పూర్తి చేసింది. నెదర్లాండ్స్‌లో కంపెనీకి ఏటా ఏడు మిలియన్ టన్నుల సామర్థ్యంగల తయారీ ప్లాంట్ ఉంది.

తెలుగులో ఆహార నాణ్యత ప్రమాణాల పోర్టల్



న్యూఢిల్లీ: ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల పాటింపు వ్యవస్థ (ఎఫ్‌ఓఎస్‌సీఓఎస్) పోర్టల్‌ను నాలుగు ప్రాంతీయ భాషల్లో ఆవిష్కరించింది. దీంతో హిందీ, ఇంగ్లిష్ సహా ఇకపై తెలుగు, తమిళం, గుజరాతీ, మరాఠీ భాషల్లో ఇది అందుబాటులో ఉంటుంది. త్వరలోనే కన్నడ, పంజాబీ తదితర భాషల్లోనూ పోర్టల్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనలను పాటించడంలో స్థానిక ఆహార విక్రేతలకు ఇది సహాయకరంగా ఉంటుందని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-11-2023	
విశాఖ	540-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
14-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

టాప్‌గేర్‌లో టెస్లా దిగుమతులు..!

- భారత్ నుంచి రెట్టింపు...
- కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి
- అమెరికాలో కంపెనీ ప్లాంటు సందర్శన



టెస్లా ప్లాంట్ సందర్శనలో కారును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా.. భారత్ నుంచి ఆటో విడిభాగాల దిగుమతిని రెట్టింపు చేసుకునే యోచనలో ఉంది. నాలుగు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్ (కాలిఫోర్నియా)లోని కంపెనీ ప్లాంటును సందర్శించిన సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ఈ విషయం తెలిపారు. అనారోగ్య కారణాల రీత్యా గోయల్‌ను టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ కలవలేకపోయారు. 'టెస్లా అధునాతన ప్లాంటును సందర్శించాను. మొబిలిటీ ముఖచిత్రాన్ని మారుస్తున్న టెస్లా వృద్ధి ప్రస్థానంలో పలువురు భారతీయ ఇంజనీర్లు, ఫైనాన్స్ నిపుణులు సీనియర్ల స్థాయిలో పాలుపంచుకుంటూ ఉండటం సంతోషం కలిగించింది. అలాగే టెస్లా సరఫరా వ్యవస్థలో భారతీయ ఆటో విడిభాగాల సరఫరా సంస్థలకు ప్రాధాన్యం పెరుగుతుండటం గర్వకారణం. భారత్ నుంచి టెస్లా దిగుమతులను రెట్టింపు చేసుకునే దిశగా ముందుకెడుతోంది. మస్క్ వేగంగా కోలుకోవాలని ఆశిస్తున్నాను' అని సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్‌లో గోయల్ ట్వీట్ చేశారు. 'మీరు టెస్లా ప్లాంటును సందర్శించడం సంతోషం కలిగించింది. కాలిఫోర్నియాకు రాలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. భవిష్యత్తులో మిమ్మల్ని తప్పకుండా కలుస్తాను' అని దానికి ప్రతిస్పందనగా మస్క్ ట్వీట్ చేశారు. టెస్లా 2022లో భారత్ నుంచి 1 బిలియన్ డాలర్ల విలువ చేసే విడిభాగాలను దిగుమతి చేసుకోగా, ఈసారి 1.9 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని భావిస్తున్నట్లు గోయల్ ఇటీవలే తెలిపారు.

పరిశీలనలో మినహాయింపులు..

టెస్లా భారత మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా దిగుమతులతో ప్రారంభించి ఇక్కడ డిమాండ్‌ను బట్టి ప్లాంటును నెలకొల్పే యోచనలో ఉన్నట్లు రెండేళ్ల క్రితం మస్క్ చెప్పారు. అయితే, భారీ స్థాయి దిగుమతి సుంకాల విషయంలో భారత్ తమకు కొంత మినహాయింపు కల్పించాలని కోరారు. కానీ, టెస్లా కూడా ఇతర సంస్థల బాటలోనే రావాల్సి ఉంటుందని కేంద్రం అప్పట్లో స్పష్టం చేసింది. ఈ ఏడాది జూన్‌లో అమెరికాలో ప్రధాని మోదీతో మస్క్ సమావేశం అనంతరం.. దిగ్గజ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీలను ఆకర్షించేందుకు తగిన విధానాన్ని రూపొందిస్తామంటూ కేంద్రం వెల్లడించడం గమనార్హం. దీనితో టెస్లా ఎంట్రీకి మార్గం సుగమం చేసేలా కంపెనీకి వెసులుబాట్లునిచ్చే అవకాశాలు ఉన్నాయంటూ అంచనాలు నెలకొన్నాయి.

సుబ్రతా రాయ్ కన్నుమూత



ముంబై: సహారా ఇండియా పరివార్ వ్యవస్థాపకుడు సుబ్రతా రాయ్ కన్నుమూశారు. 75 సంవత్సరాల రాయ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బీహార్‌లోని అరారియాలో జన్మించిన రాయ్ భారతీయ వ్యాపార రంగంలో ప్రముఖ వ్యక్తి. ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, మీడియా, హాస్పిటాలిటీతో సహా వివిధ రంగాలలో ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. గోరఖ్‌పూర్‌లోని ప్రభుత్వ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో విద్యను అభ్యసించడంతో రాయ్ కెరీర్ ప్రారంభమైంది. 1976లో కష్టాల్లో ఉన్న చిట్ ఫండ్ కంపెనీ సహారా ఫైనాన్స్‌ను సొంతం చేసుకున్నారు. 1978 నాటికి ఈ సంస్థను సహారా ఇండియా పరివార్‌గా మార్చారు. ఈ సంస్థ భారత్‌లోని అతిపెద్ద వ్యాపార దిగ్గజ సంస్థల్లో ఒకటిగా ఎదిగింది.

వ్యాపార విస్తరణ..

రాయ్ నేతృత్వంలో సహారా అనేక వ్యాపారాల్లోకి విస్తరించింది. ఈ సంస్థ 1992లో హిందీ భాషా వార్తాపత్రిక రాష్ట్రీయ సహారాను ప్రారంభించింది. 1990ల చివరలో పూణే సమీపంలో ప్రతిష్టాత్మకమైన ఆంబీ వ్యాలీ సిటీ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. సహారా టీవీతో టెలివిజన్ రంగంలోకి ప్రవేశించింది. తర్వాత దీనిని సహారా వన్‌గా మార్చారు. 2000వ దశకంలో సహారా లండన్‌లోని గ్రోస్వెనర్ హౌస్ హోటల్, న్యూయార్క్ నగరంలోని ప్లాజా హోటల్ వంటి ఐకానిక్ ప్రాపర్టీలను కొనుగోలు చేయడంతో అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది. సహారా ఇండియా పరివార్‌ను టైమ్ మ్యాగజైన్ ఒకప్పుడు భారతీయ రైల్వేల తర్వాత భారతదేశంలో రెండవ అతిపెద్ద ఉపాధి సంస్థగా ప్రశంసించింది. దాదాపు 12 లక్షల మంది శ్రామిక శక్తిని కలిగిఉన్న సంస్థగా ఎదిగింది. భారతీయ కుటుంబాల్లో గణనీయమైన భాగస్వామ్యంతో 9 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడిదారులను కలిగి ఉన్నట్లు ఒకప్పుడు సగర్వంగా సంస్థ ప్రకటించింది. అయితే రెండు గ్రూప్ సంస్థలు– నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా దాదాపు రూ.25,000 కోట్లు వసూలు చేశాయన్న ఆరోపణలు, ఈ మొత్తం తిరిగి వసూళ్ల దిశలో ఆయన తీహార్ జైలుకు వెళ్లడం రాయ్ ప్రతిష్టను దెబ్బతీశాయి.

టోకు ద్రవ్యోల్బణం.. 7వ నెలా రివర్స్..

అక్టోబర్‌లో మైనస్ 0.52 శాతం



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా ఏడవనెల అక్టోబర్‌లోనూ మైనస్‌లోనే నిలిచింది. సమీక్షా నెల్లో సూచీ మైనస్ (-)0.52 వద్ద ఉంది. సూచీలో అసలు పెరుగుదల లేకపోగా, క్షీణతలో ఉండే ఈ తరహా పరిస్థితిని ప్రతిద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. కొన్ని కీలక ఉత్పత్తుల ధరలు పెరక్కపోవడం ఈ పరిస్థితికి ప్రధాన కారణం. వ్యవస్థలో తగిన డిమాండ్ లేని పరిస్థితితో పాటు, వార్షికంగా హైబేస్ కూడా ఈ పరిస్థితికి కారణంగా ఉంటుంది. ఇక్కడ గత ఏడాది అక్టోబర్‌ను చూస్తే టోకు ద్రవ్యోల్బణం 8.67 శాతం (హైబేస్‌తో)గా ఉంది.

అసెట్ మానిటైజేషన్‌తో రూ. 4 వేల కోట్లు

వైజాగ్ స్టీల్ ఆశాభావం



కోల్‌కతా: రుణ భారం తగ్గించుకుని, ఉత్పత్తిని పెంచుకోవడం, టర్న్‌అరౌండ్ సాధించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు వైజాగ్ స్టీల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ – ఆర్ఐఎన్ఎల్) సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫోర్జ్డ్ వీల్ ప్లాంటు, విశాఖలోని స్థలాల మానిటైజేషన్‌తో పాటు వ్యయ నియంత్రణ చర్యలతో దాదాపు రూ. 3,000– 4,000 కోట్లు సమీకరించుకోగలిగితే ఇందుకు సహాయకరంగా ఉండగలదని ఆయన చెప్పారు. ఉక్కు, మెటలర్జీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా సంస్థ సీఎండీ అతుల్ భట్ ఈ విషయాలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే మానిటైజేషన్ (విక్రయం, లీజుకివ్వడం తదితర మార్గాల్లో అసెట్లపై ఆదాయం ఆర్జించడం) చేపట్టగలిగితే ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 2022–23లో ఆర్ఐఎన్ఎల్ సుమారు రూ. 3,000 కోట్లు నష్టం నమోదు చేసింది. అంతర్జాతీయంగా మందగమనంతో నిల్వలు పేరుకుపోవడం, ఉక్కుపై ఎగుమతి సుంకాలు, ముడి వనరుల లభ్యతకు భద్రత లేకపోవడం తదితర అంశాలు ఇందుకు కారణమని భట్ వివరించారు. ఓపెన్ మార్కెట్ నుంచి ముడి ఇనుము కొనాల్సి రావడం వల్ల ప్రతి టన్నుకు రూ. 6,000 మేర ఎక్కువ వెచ్చించాల్సి వస్తోందని, దీనికి తోడు రూ. 23,000 కోట్ల భారీ రుణ భారం ఉందని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో మానిటైజేషన్ ప్రణాళికతో రుణభారం తగ్గి, నిర్వహణ మూలధన పరిస్థితి మెరుగుపడగలదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ఉన్న ఫోర్జ్డ్ వీల్ ప్లాంటుపై ఆర్ఐఎన్ఎల్ రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేసింది.

ఒబెరాయ్ ఇక లేరు



న్యూఢిల్లీ: హోటల్ పరిశ్రమలో సుపరిచితుడు, దిగ్గజ పారిశ్రామికవేత్త, ఒబెరాయ్ హోటల్స్ గౌరవ చైర్మన్ పృథ్వీరాజ్ సింగ్ (పీఆర్ఎస్) ఒబెరాయ్, 94 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. 'బికీ'గా అందరూ పిలుచుకునే పీఆర్ఎస్ ఒబెరాయ్ తండ్రి వారసత్వాన్ని పుచ్చుకుని హోటల్ వ్యాపారంలోకి ప్రవేశించారు. తన తండ్రి, ఒబెరాయ్ గ్రూప్ వ్యవస్థాపకుడు రాయ్ బహదూర్ మోహన్ సింగ్ ఒబెరాయ్ నుంచి 1984లో హోటళ్ల వ్యాపారాన్ని స్వీకరించారు. ఆ తర్వాత పీఆర్ఎస్ ఒబెరాయ్ తన గ్రూప్‌ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. ఒబెరాయ్ గ్రూప్ ఇప్పుడు ఏడు దేశాల్లో హోటల్స్, క్రూయిజ్‌లు, రిసార్ట్‌లు కలిగి ఉంది. ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్, ట్రిడెంట్ హోటల్స్, మెయిడెన్ హోటల్ బ్రాండ్లపై ఆతిథ్య సేవలను అందిస్తోంది.

నాట్కో డివిడెండ్ రూ.1.25

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ నాట్కో ఫార్మా 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రెండవ మధ్యంతర డివిడెండ్ కింద రూ.1.25 ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం ఆరింతలకుపైగా పెరిగి రూ.57 కోట్ల నుంచి రూ.369 కోట్లకు చేరింది. టర్నోవర్ 134 శాతం అధికమై రూ.452 కోట్ల నుంచి రూ.1,061 కోట్లను తాకింది.

ఎన్ఎండీసీ లాభం అప్

క్యూ2లో రూ. 1,025 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2లో) నికర లాభం 16 శాతం ఎగసి రూ. 1,025 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 886 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం రూ. 3,755 కోట్ల నుంచి రూ. 4,335 కోట్లకు జంప్ చేసింది.

జాబ్ పాయింట్

సిడ్బీ, లక్నోలో 50 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ ఎ జనరల్ స్ట్రీమ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **అర్హత:** ఏదైనా డిగ్రీ,బీఈ/బీటెక్,ఎల్ఎల్‌బీ లేదా సీఏ/సీఎస్ /సీడబ్ల్యూఏ/సీఎఫ్ఏ /సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.90,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 28.11.2023.
» **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేదీలు:** డిసెంబర్ 2023/జనవరి 2024.
» **వెబ్‌సైట్:** www.sidbi.in

ఢిల్లీ జ్యుడీషియల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2023

ఢిల్లీ హైకోర్టు,ఢిల్లీ జ్యుడీషియల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2023కు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 53
» **అర్హత:** న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ చేసినవారై ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష (ప్రిలిమ్స్, మెయిన్స్) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.11.2023.
» **పరీక్ష తేది:** 10.12.2023.
» **వెబ్‌సైట్:** delhihighcourt.nic.in

ఐఓబీ, చెన్నైలో 66 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

చెన్నైలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ).. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 66
» **పోస్టుల వివరాలు:** మేనేజర్-59, సీనియర్ మేనేజర్-05, చీఫ్ మేనేజర్-02.
» **అర్హత:** లా, బీఈ/బీటెక్/ఎంటెక్, బీఆర్క్, ఏదైనా డిగ్రీ, సీఏ/ఎంసీఏ /ఎమ్మెస్సీ/ఎంబీఏ/ పీజీడీబీఎం, సీబీసీఏ/సీఏ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25 నుంచి 40 ఏళ్ల లోపు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.11.2023.
» **వెబ్‌సైట్:** www.iob.in

మెయిన్‌లో మార్పులు... సన్నద్ధత ఇలా!

» జేఈఈ-మెయిన్-2024లో కీలక మార్పులు
» మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో సిలబస్ కుదింపు
» జనవరి 24-ఫిబ్రవరి 1,2024 వరకు తొలి సెషన్
» 2024 ఏప్రిల్ 1-15 వరకు రెండో సెషన్ పరీక్ష
» కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్‌తోనే విజయం

జేఈఈ-మెయిన్.. దేశవ్యాప్తంగా లక్షల మంది పోటీ పడే పరీక్ష! ఈ పరీక్షలో స్కోర్‌తో ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐల్లో.. బీటెక్‌లో ప్రవేశాలు పొందే అవకాశం లభిస్తుంది! మరోవైపు ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు కూడా ఇదే ప్రామాణికం! దీంతో.. విద్యార్థులు జేఈఈ-మెయిన్‌లో బెస్ట్ స్కోర్ కోసం ఇంటర్(ఎంపీసీ) తొలిరోజు నుంచే ప్రిపరేషన్ ప్రారంభిస్తారు! ఇప్పుడు వీరంతా తమ కసరత్తును మరింత ముమ్మరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది!! కారణం.. జేఈఈ-మెయిన్- 2024 పరీక్ష తేదీలు వెలువడడంతోపాటు దరఖాస్తు ప్రక్రియ సైతం మొదలైంది! ఈ నేపథ్యంలో.. జేఈఈ-మెయిన్-2024 సిలబస్ మార్పులు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..


జేఈఈ-మెయిన్-2024

జేఈఈ-మెయిన్.. జాతీయ స్థాయిలో దాదాపు 12 లక్షల మందికిపైగా పోటీ పడే పరీక్ష. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి 1.5 లక్షల మంది వరకూ ఉంటారు. వీరంతా ఇప్పుడు మారిన సిలబస్‌కు అనుగుణంగా తమ ప్రిపరేషన్ శైలిని మార్చుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే.. జేఈఈ మెయిన్ సిలబస్‌లో ఎన్‌టీఏ కీలక మార్పులు చేయడమే!

అర్హతలు

ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సు 2022, 2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. 2024లో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం

- జేఈఈ-మెయిన్‌ను పేపర్-1,పేపర్-2ఎ, పేపర్-2బిలుగా నిర్వహిస్తారు. బీటెక్ అభ్యర్థులకు పేపర్-1,బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అభ్యర్థులకు పేపర్-2ఎ, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల అభ్యర్థులకు పేపర్-2బి పరీక్ష ఉంటుంది.
- **పేపర్-1(బీటెక్/బీఈ) ఇలా:** ఈ పేపర్‌ను మొత్తం మూడు సబ్జెక్ట్(మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లలో రెండు సెక్షన్లుగా నిర్వహిస్తారు. ప్రతి సబ్జెక్టులో సెక్షన్ ఏలో 20 ప్రశ్నలు, సెక్షన్ బీలో 10 ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్ బీలోని 10 ప్రశ్నల్లో ఐదింటికి సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులు చొప్పున మొత్తం 90 ప్రశ్నలు-300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. సెక్షన్-ఎ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో (ఎంసీక్యూలతో) ఉంటుంది. సెక్షన్-బీలో న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలుంటాయి. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి 1 మార్కు తగ్గిస్తారు.

సిలబస్ కుదింపు

జేఈఈ-మెయిన్-2024లో కీలక మార్పు..సిలబస్ కుదింపు. పరీక్షలో సబ్జెక్ట్‌లుగా ఉండే మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో సిలబస్‌ను తగ్గించారు. కోవిడ్ కారణంగా గత రెండేళ్లుగా ఇంటర్మీడియెట్, +2 స్థాయిలో 30 శాతం సిలబస్‌ను కుదించిన సంగతి తెలిసిందే. దీన్ని పరిగణనలోకి తీసుకుని.. జేఈఈ నిర్వాహక సంస్థ ఎన్‌టీఏ సిలబస్‌లో కుదింపు చేసింది. సబ్జెక్ట్ వారీగా కొన్ని టాపిక్స్‌ను సిలబస్ నుంచి తొలగించింది.

తొలగించిన అంశాలివే

- కెమిస్ట్రీ నుంచి అత్యధికంగా 12 అంశాలను తగ్గించారు. అదే విధంగా మ్యాథమెటిక్స్‌లో మ్యాథమెటికల్ రీజనింగ్‌ను తొలగించారు. ఫిజిక్స్‌లో కమ్యూనికేషన్ సిస్టమ్స్‌ను పూర్తిగా తొలగించారు. సబ్జెక్టుల వారీగా తొలగించిన అంశాలు..
- **ఫిజిక్స్:** కైనమాటిక్స్, గ్రావిటేషన్, ప్రాపర్టీస్ ఆఫ్ సాలిడ్స్ అండ్ లిక్విడ్స్, ఆసిలేషన్ అండ్ వేవ్స్, థర్మోడైనమిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిక్ ఎఫెక్ట్స్ ఆఫ్ కరెంట్ అండ్ మ్యాగ్నటిజం, ఎలక్ట్రో మ్యాగ్నటిక్ ఇండక్షన్ అండ్ ఆల్టర్నేటింగ్ కరెంట్స్, ఆప్టిక్స్, డ్యూయల్ నేచర్ ఆఫ్ మేటర్ అండ్ రేడియేషన్, ఆటమ్స్ అండ్ న్యూక్లియై, కమ్యూనికేషన్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ డివైజెస్.
- **కెమిస్ట్రీ:** బేసిక్ కాన్సెప్ట్స్‌లో కొన్ని అంశాలు (ఫిజికల్ క్వాంటిటీస్ అండ్ మెజర్‌మెంట్స్, ప్రెసిషన్, యాక్యురసీ, సిగ్నిఫికెంట్ ఫిగర్స్, ఎస్.ఐ. యూనిట్స్, డైమెన్షనల్ అనాలిసిస్), అటామిక్ స్ట్రక్చర్, స్టేట్స్ ఆఫ్ మేటర్, సర్ఫేస్ కెమిస్ట్రీ (మొత్తం చాప్టర్ తొలగింపు), పి-బ్లాక్ ఎలిమెంట్స్. అదే విధంగా జనరల్ ప్రిన్సిపిల్స్ అండ్ ప్రాసెషన్ ఆఫ్ ఐసోలేషన్ ఆఫ్ మెటల్స్, హైడ్రోజన్, ఎస్-బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, పాలిమర్స్, కెమిస్ట్రీ ఇన్ డైలీ లైఫ్‌లను పూర్తిగా తొలగించారు.
- **మ్యాథమెటిక్స్:** ఈ సబ్జెక్ట్‌లో మ్యాథమెటికల్ రీజనింగ్, మ్యాథమెటికల్ ఇండక్షన్స్, డైమెన్షనల్ జామెట్రీలను తొలగించారు. అదే విధంగా సిలబస్‌లోని ఇతర యూనిట్స్‌లోనూ కొన్ని టాపిక్స్‌ను తొలగించారు.

మార్పులకు అనుగుణంగా

సిలబస్‌లో జరిగిన మార్పులకు అనుగుణంగా అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను మార్చుకోవాలి. తాజా సిలబస్‌ను పరిశీలించి.. చదవాల్సిన టాపిక్స్‌పై స్పష్టత పెంచుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌లు-టాపిక్స్‌కు ఉన్న వెయిటేజీకి అనుగుణంగా ప్రిపరేషన్ సమయం కేటాయించుకోవాలి.

సబ్జెక్ట్‌ల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌లో రెండేళ్ల సిలబస్‌కు సంబంధించి ప్రతి చాప్టర్‌ను అధ్యయనం చేయాలి. ప్రాధాన్యం ఇవ్వాల్సిన అంశాలు.. కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్. వీటితో పాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలను కనీసం ఒక్కసారైనా పూర్తిచేయాలి.

ఫిజిక్స్

ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన పెంచుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. ఆయా అంశాల ప్రాథమిక భావనలను వాస్తవ పరిస్థితులతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

కెమిస్ట్రీ

కెమికల్ బాండింగ్, పిరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలపై పట్టు సాధించాలి. మోల్ కాన్సెప్ట్, కో ఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

అప్లికేషన్ ఆధారిత ప్రిపరేషన్

విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లకు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగిస్తే జేఈఈ-మెయిన్‌లో బెస్ట్ ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది. ప్రధానంగా సదరు సబ్జెక్ట్‌ల బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాటిని వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా చదివే సమయంలోనే ముఖ్యమైన ఫార్ములాలు, కీ పాయింట్స్‌ను షార్ట్ నోట్స్‌గా రూపొందించుకోవాలి. ఇది ఇంటర్, జేఈఈ -మెయిన్ రెండు పరీక్షలకు రివిజన్ పరంగా ఎంతో కలిసొస్తుంది.

ప్రాక్టీస్‌తో పర్‌ఫెక్ట్‌గా

విద్యార్థులు ప్రతిరోజు తాము చదివిన సబ్జెక్ట్‌కు సంబంధించి.. ప్రశ్నలు అడిగే ఆస్కారం ఉన్న అంశాలను ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయాలి. జేఈఈ-మెయిన్ సిలబస్‌లో అధిక శాతం అంశాలు ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం టాపిక్స్ నుంచే ఉన్నాయి. కాబట్టి ప్రస్తుతం ఇంటర్ ద్వితీయం సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం అంశాలను కూడా అవలోకనం చేసుకోవాలి. మొదటి సంవత్సరం అంశాలను, రెండో సంవత్సరం టాపిక్స్‌తో అనుసంధానం చేసుకుంటూ అధ్యయనం సాగించాలి. ఫలితంగా సంబంధిత అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన లభించడంతోపాటు ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

న్యూమరికల్ ప్రశ్నలకు

జేఈఈ-మెయిన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్.. ఈ మూడు సబ్జెక్ట్‌ల నుంచీ అయిదు ప్రశ్నలు చొప్పున న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలు వస్తాయి. విద్యార్థులు అప్లికేషన్ ఆధారిత ప్రిపరేషన్‌కు, ఆయా సబ్జెక్ట్‌లలో న్యూమరిక్స్ ఆధారంగా సమాధానం సాధించాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

మాక్ టెస్ట్‌లు, ప్రీ-ఫైనల్ టెస్ట్‌లు

జేఈఈ-మెయిన్ అభ్యర్థులు మాక్ టెస్ట్‌లకు హాజరవడం, ఇంటర్ ప్రీ-ఫైనల్ టెస్ట్‌లు రాయడం , వాటి ఫలితాలను విశ్లేషించుకోవడం ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా ఏప్రిల్ సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈ వ్యూహాన్ని అనుసరించాలి. జనవరి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ప్రస్తుతం దాదాపు నెలరోజుల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో వీరు అధిక సమయాన్ని పునశ్చరణకు, వీక్లీ టెస్ట్‌లకు, మాక్ టెస్ట్‌లకు కేటాయించాలి. ఫలితంగా ఇంటర్ పరీక్షలతోపాటు, జేఈఈ-మెయిన్‌లోనూ మెరుగైన ప్రతిభ కనబర్చే అవకాశం లభిస్తుంది.

టైమ్ మేనేజ్‌మెంట్

ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివే విధంగా ప్లాన్ చేసుకోవాలి. ప్రతి సబ్జెక్ట్‌కు కనీసం రెండు గంటల సమయం కేటాయించేలా చూసుకోవాలి. తమకు బాగా సులభమైన సబ్జెక్ట్‌కు కొంత తక్కువ సమయం కేటాయించి.. క్లిష్టంగా భావించే సబ్జెక్ట్‌లకు కొంత ఎక్కువ సమయం కేటాయించడం మేలు. ఇలా పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే మెరుగైన స్కోర్ సాధించేందుకు అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **జనవరి సెషన్ దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 30, 2023.
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు నుంచి;
- **జనవరి సెషన్ పరీక్ష తేదీలు:** 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు;
- **ఫలితాల వెల్లడి:** 2024, ఫిబ్రవరి 12.
- **రెండో సెషన్ దరఖాస్తు తేదీలు:** 2024, ఫిబ్రవరి 2 నుంచి మార్చి 2 వరకు;
- **రెండో సెషన్ పరీక్ష తేదీలు:** 2024, ఏప్రిల్ 1 నుంచి 15 వరకు;
- **రెండో సెషన్ ఫలితాల వెల్లడి:** 2024, ఏప్రిల్ 25
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://jeemain.nta.ac.in

‘రేటింగ్’ పేరుతో చీటింగ్

గూగుల్ మ్యాప్ రేటింగ్ పేరిట సైబర్ మోసాలు



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసానికి తెరతీశారని, గూగుల్ మ్యాప్‌లోని ప్రాంతాలకు రేటింగ్ ఇవ్వాలంటూ మోసాలకు పాల్పడుతున్నట్టు సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఇందుకోసం ఏకంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఈఐటీ) నుంచి పంపుతున్నట్టుగా నకిలీ ఎస్‌ఎంఎస్‌లు పంపుతున్నారు. వారు పంపే లింక్‌లపై క్లిక్ చేసి అందులో వచ్చే గూగుల్ మ్యాప్‌లో వారు చెప్పిన ప్రాంతానికి రేటింగ్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇలా చేస్తే ఒక్కో రేటింగ్‌కు రూ.150 ఇస్తామని, ఇలా రోజుకు కనీసం రూ.5 వేల వరకు సంపాదించవచ్చని ఊదరగొడుతున్నారు. ఎవరైనా ఇది నిజమని నమ్మితే ఒకటి, రెండుసార్లు డబ్బులు పంపి..ఎదుటి వ్యక్తికి నమ్మకం కుదిరిన తర్వాత అసలు మోసానికి తెరతీస్తున్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు..ఆధార్, పాన్ కార్డు వివరాలు సేకరించడం..లింక్‌లో ఓటీపీ నమోదు చేయాలని చెబుతూ ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొడుతున్నట్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇదే తరహాలో కొన్ని నెలల క్రితం సోమాజిగూడకు చెందిన ఒక యువకుడు గూగుల్ మ్యాపింగ్ రేటింగ్ స్కాంలో చిక్కి రూ.74 వేలు పోగొట్టుకున్నాడని తెలిపారు.

2,604 బీఈడీ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా 2,604 బీఈడీ సీట్లను కేటాయించినట్టు టీఎస్‌సెట్స్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ రౌండ్‌లో 6,419 సీట్లు అందుబాటులో ఉన్నాయని, వీటికి 3,988 వెబ్ ఆప్షన్లు వచ్చాయని వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 17లోగా సంబంధిత కళాశాలల్లో జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలని సూచించారు.

416 ప్రకటనల్లో 15 మాత్రమే నిలిపివేశాం

అనుమతించాక కొన్నింటి రూపురేఖలు మార్చారు: సీఈవో



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రచారం కోసం సమర్పించిన ప్రకటనల్లో మూడు ప్రధాన పార్టీలకు సంబంధించి 15 ప్రకటనలు మాత్రమే నిలిపివేస్తూ ఆదేశించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. ప్రచార ప్రకటనల నిలిపివేతపై వస్తున్న వార్తలపై స్పందించిన సీఈవో మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఎన్నికల సంఘం నియమించిన ప్రకటనల పరిశీలన, అనుమతి కమిటీ మొత్తం 416 ప్రకటనలకు అనుమతినిచ్చిందని తెలిపారు. అనుమతించిన వాటిలో కొన్నింటి రూపురేఖలు మార్చడం, వక్రీకరించి తప్పుగా అన్వయించడం వంటివి జరిగినట్లు పేర్కొన్నారు. అనుమతి నిబంధనలను ఉల్లంఘించి వాటిని ప్రసారం చేయడం అంటే ఆ స్ఫూర్తిని దెబ్బతీయడమేనని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రకటన తర్వాత అమలులోకి వచ్చిన నిబంధనల ప్రకారం ఆయా రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకోవడానికి రాష్ట్ర స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందని, వాటిని యథాతథంగా ఉపయోగించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే రాజకీయ పార్టీలు ముందుగా తగిన అనుమతి పొందని ప్రకటనలను యూట్యూబ్‌తో పాటు ఇతర వేదికలలో కూడా ప్రచారం చేస్తున్నట్లు ఎన్నికల సంఘం దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై ఎన్నికల సంఘం ఈనెల 8, 9, 10 తేదీల్లో వివిధ రాజకీయ పార్టీలతో మూడు సమావేశాలు నిర్వహించిందని, ఈ సమావేశాల్లో ప్రచార, ప్రచార అనుమతి (ధ్రువీకరణ/ సర్టిఫికేషన్) పొందడానికి మార్గదర్శకాలను క్షుణ్ణంగా వివరించామన్నారు. అదే విధంగా అనుమతుల్లేని ప్రకటనల ద్వారా తలెత్తే సమస్యలను కూడా తెలిపామన్నారు. ఎన్నికల సంఘం సూచనలను, మార్గదర్శకాలను అనుసరిస్తామని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఎన్నికల సంఘం అనుమతి పొందాల్సిందే

రాజకీయ పార్టీలు విడుదల చేసే ప్రకటనలను ప్రసారం చేయడానికి ముందు ధ్రువీకరణ పొందిన ప్రకటనలేనా కాదా అనేది మీడియా సరిచూసుకోవాలని కోరింది. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతి పొందని అంశాల ప్రసారాలను నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తామని వికాస్‌రాజ్ తెలిపారు. రాజకీయ పార్టీలు విడుదల చేసే ప్రకటనలకు అనుమతి ధ్రువీకరణ ఇవ్వడం అనేది నిరంతర ప్రక్రియని వివరించారు. ఏ రాజకీయ పార్టీ అయినా, అభ్యర్థి అయినా రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనుమతి ధ్రువీకరణ కోసం మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీకి ప్రకటనలను పంపుకోవచ్చునని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఉపసంహరించిన ప్రకటనలు ఇలా....

బీజేపీ

డబుల్ బెడ్రూం, దొంగ చేతికి తాళం, రైతు, నేతి బీరకాయ, పేనుకు పెత్తనం

బీఆర్ఎస్

దేఖ్ లేంగే (తెలుగు పాట), మొదటి ఓటు ఎవరికి (వీడియో ప్రకటన), రైతుల అండ దండ– కేసీఆర్ (వీడియో ప్రకటన), కల్యాణలక్ష్మి

కాంగ్రెస్

కారు (30 సెకన్లు), జాబ్ (15 సెకన్లు), రైతు (40 సెకన్లు), రైతు (30 సెకన్లు), రైతు (15 సెకన్లు), రైతు (15 సెకన్లు)

సంక్లిష్ట ప్రాంతాల్లో అదనపు బందోబస్తు

4,400 ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను క్లిష్టమైనవిగా గుర్తించిన పోలీస్ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19,375 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇందులో 4,400 ప్రాంతాలను క్లిష్టమైనవిగా గుర్తించినట్టు ఎన్నికల నోడల్ అధికారి, శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ జైన్ ‘సాక్షి’కి తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా నమోదైన హింసాత్మక ఘటనలు, రాజకీయ ప్రత్యర్థుల మధ్య వైరం, ఆయా ప్రాంతాల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని ఈ సంక్లిష్ట ప్రాంతాలను గుర్తించినట్టు పేర్కొన్నారు. గతంలో పోలింగ్ కేంద్రాలను సున్నితమైన, అత్యంత సున్నితమైన, సాధారణమైనవిగా వర్గీకరించేవారని, ఈ ఎన్నికల్లో కేవలం క్లిష్టమైన, సాధారణ పోలింగ్ ప్రాంతాలుగా గుర్తిస్తున్నట్టు తెలిపారు. క్లిష్టమైన ప్రాంతాల్లోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సాధారణ భద్రతావిధుల్లో స్థానిక పోలీసులతోపాటు నలుగురు నుంచి ఐదుగురు కేంద్ర సాయుధ పోలీస్ బలగాలకు చెందిన సిబ్బందిని నియమిస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అన్ని భద్రతాచర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కాగా, కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో పాటు ఇతర రాష్ట్రాల పోలీస్ బలగాల్లో పనిచేసే హోంగార్డులు, ఇతర సాయుధ సిబ్బంది సైతం ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొనున్నారు.

ఓటు లేదు.. ‘కోడ్’ పాటించట్లేదు

ఎన్నికల సంఘానికి ఫిర్యాదుల వెల్లువ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదుల స్వీకరణకు ఎన్నికల సంఘం జిల్లా కాల్ సెంటర్ (డీసీసీ), నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (ఎన్జీఆర్ఎస్) యాప్‌ను ప్రవేశపెట్టారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్జీఆర్ఎస్‌కు 4,959, డీసీసీకి 651 ఫిర్యాదులు అందినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఇందులో ప్రధానంగా ఓటు లేదని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నా ఓటరు జాబితాలో పేరులేదని, బీఎల్‌ఓ, పోలింగ్ బూత్ కేంద్రాల సమాచారం, రాజకీయ పార్టీలు ఉల్లంఘిస్తున్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై ఫిర్యాదులు అందుతున్నాయి. జిల్లా కాల్ సెంటర్లకు వచ్చిన ఫిర్యాదుల్లో ఇప్పటి 402ను మూసేశామని, మరో 107 ఫిర్యాదులను పరిష్కరించామని, 139 పురోగతిలో ఉన్నాయని, డీఫాల్ట్‌గా 3, పెండింగ్‌లో ఇంకా 142 ఉన్నట్లు వెల్లడించారు. తెలంగాణకు సంబంధించి నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సెల్‌కు వచ్చిన వాటిల్లో ఫిర్యాదులను పలు రకాలుగా విచారించిన తర్వాత 3,847 ఫిర్యాదులను మూసేశామని, 747 ఫిర్యాదులను పరిష్కరించగా, 208 పురోగతిలో ఉన్నాయని, మరో 365 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు.

ఆ పార్టీకి ‘కామన్ సింబల్’ కేటాయిస్తారా.. లేదా?

ఏ విషయం చెప్పండి... ఈసీకి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తెలంగాణ యువ శక్తి పార్టీ(టీయుఎస్‌పీ)కి కామన్ సింబల్ కేటాయిస్తారో.. లేదో.. చెప్పాలని ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా వివరణ ఇవ్వాలంటూ విచారణను వాయిదా వేసింది. ‘రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో టీయూఎస్‌పీ పోటీ చేస్తోంది. కామన్ సింబల్ కేటాయించాలని ఎన్నికల కమిషన్‌కు వినతి పత్రం సమర్పించినా.. గత నెల 20న తిరస్కరించింది. ఇది రాజ్యాంగ విరుద్ధం, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే అవుతుంది. కామన్ సింబల్ కేటాయించేలా ఈసీకి ఆదేశాలు జారీ చేయాలి’అని కోరుతూ ఆ పార్టీ అధ్యక్షుడు రామ్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈసీకి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

పాముకు ప్రాణదానం



పీహెచ్‌సీలో పాముకు ఆక్సిజన్ ఏర్పాటు

రాయచూరు రూరల్: పాము అంటేనే ప్రాణాలు తీస్తుందని భయపడతాం. కనిపిస్తే పరుగులు తీస్తాం... కానీ అస్వస్థతకు గురైన ఓ పామును వైద్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం చేసి ఊపిరిపోశారు. ఈ సంఘటన మంగళవారం కర్ణాటకలోని రాయచూరు జిల్లా లింగసూగూరులో చోటుచేసుకుంది. లింగసూగూరు తాలూకా హట్టి సమీపంలోని పామనకల్లూరు క్రాస్ వద్ద ఓ జెర్రిపోతు పాము కారులోకి దూరింది. హట్టి ఆస్పత్రి వైద్యుడు రవీంద్రనాథ్ ఆ పామును పట్టుకోవడానికి ప్రయత్నించగా దొరకలేదు. అది కారు నుంచి బయటకు రావాలని ఫినాయిల్ చల్లడంతో వాసన తట్టుకోలేక బయటకొచ్చింది. కానీ స్పృహ తప్పి అచేతనంగా పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న లింగసూగూరుకు చెందిన పాముల వైద్యుడు ఖాలిద్ చావుస్ వచ్చి ఆ పామును గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. పాము నోట్లో ఆక్సిజన్ పైపు పెట్టి చికిత్స చేయడంతో కోలుకుంది. తర్వాత ఆ పామును ఊరికి దూరంగా వదిలిపెట్టారు.

మరోసారి ఉచిత వీసాల అవకాశం

- తెలంగాణలోని యువ కార్మికుల కోసం యూఏఈ కంపెనీ స్పెషల్ డ్రైవ్
- నేడు ఆర్మూర్, జగిత్యాల కార్యాలయాల్లో షార్ట్ లిస్టింగ్‌కు అవకాశం

మోర్తాడ్(బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని ఏడీఎన్‌హెచ్ కంపాస్ కంపెనీ తన క్యాటరింగ్ సర్వీస్ కోసం ఉచితంగా వీసాలను జారీచేయడానికి మరోసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టనుంది. రాష్ట్రంలోని ప్రముఖ రిక్రూటింగ్ ఏజెన్సీ జీటీఎం ఆధ్వర్యంలో బుధవారం షార్ట్ లిస్టింగ్‌కు అవకాశం కల్పించారు. ఇక్కడ ఎంపికైనవారిని ముంబైలో ఈ నెల 17, 18 తేదీలలో ఇంటర్వ్యూల నిమిత్తం తరలించనున్నారు. కిచెన్ స్టీవార్డ్, వెయిటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపికైనవారికి భోజనం, వసతి, రవాణా సౌకర్యం కల్పించి ఆకర్షణీయమైన వేతనం ఇవ్వనున్నట్లు జీటీఎం కంపెనీ యజమాని చీటీ సతీశ్‌రావు ‘సాక్షి’తో చెప్పారు. 21– 35 ఏళ్ల మధ్య వయస్సు వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని వివరించారు. బేసిక్ ఇంగ్లిష్ వచ్చి ఉండాలని, ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు తప్పనిసరి అని చెప్పారు. బుధవారం ఆర్మూర్, జగిత్యాలలో షార్ట్ లిస్టింగ్ చేయనున్నారని, ఇక్కడ ఎంపికైనవారు ముంబైలోని ఇంటర్వ్యూలకు సొంత ఖర్చులతో వెళ్లి రావాల్సి ఉంటుందని వెల్లడించారు. ఉచిత వీసాలను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు.

డిసెంబర్ 26లోగా ఆక్రమణల తొలగింపు

హైకోర్టుకు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్ హామీ



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముషీరాబాద్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని హైకోర్టుకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో డిసెంబర్ 26లోగా ఆక్రమణలను తొలగించి నివేదిక అందజేయాలని ఆదేశించిన హైకోర్టు...విచారణను వాయిదా వేసింది. ముషీరాబాద్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని 2022 ఏప్రిల్‌లో అధికారులు కోర్టుకు వివరించారు. 3 నెలల్లో ఆక్రమణలను తొలగించాలని న్యాయస్థానం ఆదేశించింది. అయినా తొలగించకపోవడంతో శతాబ్ది నిలయం ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన కె.శ్రీధర్ రెడ్డి ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా నవంబర్ 14లోగా ఆ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ అభినంద్ కుమార్ షావిలీ, జస్టిస్ జె.అనిల్ కుమార్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. అధికారులు కోర్టు ఆదేశాలను పాటించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. ఎన్నికల పనిలో అధికారులు బిజీగా ఉన్నారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది హరేందర్ పరిషద్ సమయం కోరారు. దీనికి ధర్మాసనం నిరాకరించింది. మధ్యాహ్నానికి జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. దీంతో వారిద్దరు ధర్మాసనం ముందు హాజరుకాగా కోర్టు పై విధంగా ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.